ప్రతిపక్షం

www.prathipaksham.in

రోహిత్, కోహ్లీకి బీసీసీఐ 'బి' గ్రేడ్ 10

మంగళవారం 10.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 321 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైంది
- అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తోంది
- తెలంగాణ ఉద్యమ సమయంలో రేవంత్ ఎక్కడున్నారు
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. బుధవారం జరిగే పోలింగ్‌లో కారు గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సోమవారం భూపాలపల్లి, పరకాల, మహబూబాబాద్ మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఎల్లుండి జరగనున్న పోలింగ్ లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, కేవలం అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు తప్ప మిగిలిన వారంతా బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ నాయకత్వంలో జరిగిన పోరాటాల్లో

...:: మిగతా 2లో

> 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న బీజేపీ, పదేళ్లు రాష్ట్రంలో పాలించిన బీఆర్ఎస్‌పార్టీలు తెలంగాణ అభివృద్ధికి ఎలాంటి పనిచేయలేదు. ముఖ్యమంత్రిగా, మున్సిపల్ శాఖ మంత్రిగా నేనే ఉన్నా. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను అభివృద్ధి చేసుకునేందుకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించి ముందుకు సాగబోతున్నాం. ప్రజలు ఓటు వేసే ముందు ఆలోచించి వేయాలి. రాష్ట్రాన్ని ఇంత ధరిద్రంగా తయారు చేసిన బీఆర్ఎస్, తెలంగాణా అభివృద్ధిపై వివక్ష చూపుతున్న బీజేపీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారు.?
>
> సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి

మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను అభివృద్ధి చేసుకుందాం

- బీఆర్ఎస్, బీజేపీకి ఓటు వేసే ముందు బేరీజు వేసుకొండి
- బీఆర్ఎస్ నేతలు గెలిస్తే వాళ్లు అభివృద్ధి చేస్తారా?
- భవిష్యత్‌ను ఆలోచించుకొని ఓటు వేయండి
- పట్టణ ఓటర్లకు సీఎం రేవంత్ రెడ్డి వినతి
- పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు
- ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారు
- బీజేపీ, బీఆర్ఎస్‌పార్టీపై సీఎం నిప్పులు
- మనం రూపాయి చెల్లిస్తే కేంద్రం 42 పైసలు ఇస్తుంది
- దక్షిణాది రాష్ట్రాలకు బీజేపీ తీవ్ర అన్యాయం చేస్తుంది
- ఏరోజైనా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడారా?
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 9: పట్టణాల భవిష్యత్‌ను ఆలోచించుకొని మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఓటర్లను కోరారు. సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని పట్టణాలు అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్రం ఇంత ధరిద్రంగా ఉండటానికి కారణం బీఆర్ఎస్‌అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌అనే మొక్క చిగురించకుండా ఉండేందుకు యాసిడ్ పోయాలన్నారు. రాష్ట్రానికి తీవ్ర నష్టం చేసిన బీఆర్ఎస్‌పార్టీ మళ్లీ చిగురించకూడదని సీఎం తెలిపారు. 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న బీజేపీ, పదేళ్లు రాష్ట్రంలో పాలించిన బీఆర్ఎస్‌పార్టీలు తెలంగాణ అభివృద్ధికి ఎలాంటి పనిచేయలేదని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రిగా, మున్సిపల్ శాఖ మంత్రిగా తానున్నానని రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను అభివృద్ధి చేసుకునేందుకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించి ముందుకు సాగబోతున్నట్లు ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు. నిధులు ఇచ్చేది ప్రజా పాలన

...:: మిగతా 2లో

ముగిసిన మున్సిపల్‌ప్రచారం

తేలనున్న 12,930 మంది భవితవ్యం

- రాష్ట్రవ్యాప్తంగా 8, 203 పోలింగ్ కేంద్రాలు సిద్ధం
- చివరి రోజు పార్టీల భారీ ర్యాలీలు, సభలు
- -జోరందుకున్న తాయిలాల పంపిణీ
- మద్యం, డబ్బులు పంపిణీకి నేతలు రెడీ
- అప్రమత్తమైన ఎన్నికల సంఘం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, పిబ్రవరి 9: మున్సిపల్‌ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. గత వారం రోజులుగా పట్టణ ప్రజల చెవులు చిల్లులు పడే విధంగా మోగిన మైక్లు మూగబోయాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పోటీలో ఉన్న అభ్యర్థులు విస్తృత ప్రచారం, ర్యాలీలు, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సోమవారం సాయంత్రం 5గంటల వరకు ప్రచారం ముగియనుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించాయి. సాయంత్రం అయిదు గంటలకు ప్రచారం ముగియడంతో పట్టణ ప్రజలు ఒకింత ఊపిరిపీల్చుకున్నట్లైంది. ఇక నగదు, మద్యం, తాయిలాల పంపిణీ జోరందుకుంది. రాత్రికి రాత్రే పంపిణీకి అభ్యర్థులు అంతా సిద్ధం చేసుకున్నారు. మరోవైపు పోలీసులు, ఎన్నికల బృందాలు మరింత అప్రమత్తమయ్యాయి. పోలింగ్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం తుది సన్నాహాలు చేస్తోంది. పోలింగ్ సిబ్బంది, పోలీసు అధికారులతో

...:: మిగతా 2లో

ఆన్‌లైన్ వేదికగా భారీ కుంభకోణం

- గేమింగ్ పేరుతో రూ.5 వేల కోట్ల స్కామ్
- గుర్తించిన డీజీజీఐ అధికారులు
- ఓటీపీలు లేకుండానే వేల కోట్లు కొట్టేసినట్లు వెల్లడి
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 9: ఆన్‌లైన్ వేదికగా జరుగుతున్న భారీ గేమింగ్ కుంభకోణాన్ని హైదరాబాద్ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ అధికారులు ఇంటెలిజెన్స్ వెలుగులోకి తీసుకువచ్చారు. ఏకంగా రూ.5 వేల కోట్ల గేమింగ్ స్కామ్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఓటీపీలు లేకుండానే వేల కోట్ల రూపాయలను కొట్టేసినట్లు వెల్లడించారు. అయితే ఇలా మోసం చేసిన వేల కోట్ల రూపాయల డబ్బును.. నకిలీ షెల్ కంపెనీలకు తరలించినట్లు పేర్కొన్నారు. దుబాయ్ కేంద్రంగా ఈ గేమింగ్ ముఠా ఆటలు సాగిస్తోందని అధికారులు వెల్లడించారు. దుబాయ్ కేంద్రంగా ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్ జరిగినట్లు ప్రాథమిక విచారణలో బయటపడింది. డొల్ల కంపెనీలకు రూ.5వేల కోట్లు మళ్లించినట్టు గుర్తించారు. ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్‌లు, రెంటెడ్ బ్యాంక్ అకౌంట్ల ద్వారా ఈ అక్రమ లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. జీఎస్టీ ఎగవేతకు ఎస్క్రో ఖాతాలను దుర్వినియోగం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఫిన్‌టెక్ సంస్థలు, రేస్‌జీఈటీ247 వంటి వెబ్‌సైట్ల ద్వారా అక్రమ దందా నడిచినట్లు బయటపడింది. బ్యాంకింగ్ ఏపీఐలను అక్రమంగా ఉపయోగించి, ఆడిట్‌కు దొరక్కుండా నిందితులు జాగ్రత్త పడ్డారని పోలీసులు తెలిపారు. రియల్ మనీ గేమింగ్

...:: మిగతా 2లో

ఎస్ఐఆర్‌ను అడ్డుకోవద్దు

బెంగాల్ సర్కార్ ను హెచ్చరించిన సుప్రీం

ఓటర్లకు జాబితా ప్రక్రియకు చెందిన ప్రత్యేక సమగ్ర సమీక్ష(ఎస్ఐఆర్) పూర్తి చేయడంలో ఎటువంటి అడ్డంకులు సృష్టించవద్దని సోమవారం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు హెచ్చరించింది. కాగా ఈ ప్రక్రియలో నిజమైన ఇబ్బందులను పరిష్కరిస్తామని ప్రభుత్వానికి సుప్రీం హామీ ఇచ్చింది.

...:: 9లో

నరవణె పుస్తకం టాపిక్ విని మోడీ భయపడ్డారు

- అందుకే లోక్‌సభకు రాలేదు
- ప్రధానిని బెదిరించేందుకు విపక్ష ఎంపీలు ప్లాన్ చేశారనేది అబద్ధం
- అలాంటి ఎంపీలను అరెస్టు చేయించి ఉండాల్సింది
- రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతో భేటీ

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: మాజీ ఆర్మీ చీఫ్ నరవణె పుస్తకం గురించి భయపడినందువల్లే లోక్‌సభకు ప్రధాని మోడీ రాలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇప్పటికీ మోడీ భయంలోనే ఉన్నారని, నిజం అంటే ఆయనకు భయమని విమర్శించారు. ప్రధాని మోడీ

...:: మిగతా 2లో

డిజిటల్ క్రాప్ సర్వే పూర్తి చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

రాష్ట్రంలో డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారుడు, అగ్రిస్టాక్ చీఫ్ నాలెడ్జ్ ఆఫీసర్ రాజీవ్ చావ్లా (రిటైర్డ్ ఐఏఎస్) అధ్యక్షతన సమావేశం జరిగింది.

...:: 3లో

మావోయిస్టులు అభివృద్ధిని కాంక్షించలేదు

'మావోయిజం సమాజానికి ఎప్పుడూ మేలు చేయలేదు. అది అడుగుపెట్టిన ప్రతిచోటా వినాశనం తప్ప అభివృద్ధిని కాంక్షించలేదు. అందుకే మార్చి 31 నాటికి నక్సలిజాన్ని సమూలంగా తుడిచిపెడతాం. అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.

9

అసోం సీఎం వీడియోపై దుమారం

అసోం బీజేపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఓ వీడియోపై తీవ్ర దుమారం చెలరేగింది. తాజాగా వైరల్ అయిన వీడియోపై అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ స్పందించారు. ఆ వీడియో గురించి తనకు తెలియదని అన్నారు.

9

శరద్ పవార్‌కు అస్వస్థత.. ఆస్పత్రిలో చేరిక

ఎన్సీపీ-ఎస్పీ అధినేత శరద్ పవార్ అస్వస్థతకు గురయ్యారు. గత కొన్ని రోజులుగా ఆయన గొంతునొప్పి, దగ్గుతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే కుటుంబ సభ్యులు ఆయన్ను పుణెలోని రూబీ ఆస్పత్రికి తరలించారు.

9

మళ్లీ భగ్గుమన్న మణిపూర్

మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే అక్కడ మళ్లీ హింస చెలరేగింది. ఉఖ్రుల్ జిల్లాలో సోమవారం టాంగ్‌ఖుల్ నాగా, కుకీ వర్గాలు పరస్పరం దాడులకు తెగబడ్డాయి.

9

రాజకీయం

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డి ఎక్కడ ఉన్నారని ప్రశ్నించిన కేటీఆర్, ఆనాడు చంద్రబాబు నాయుడితో కలిసి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే ప్రయత్నాల్లో పాల్గొన్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని పరిపాలించడంలో విఫలమైన సీఎం, మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు.

లాభాల్లో ఉన్న సింగరేణి కాంగ్రెస్ పాలనలో నష్టాల్లోకి

సింగరేణి సంస్థపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ₹6,000 కోట్ల స్కామ్‌కు పాల్పడిందని కేటీఆర్ ఆరోపించారు. ఒకప్పుడు లాభాల్లో ఉన్న సింగరేణి సంస్థ కాంగ్రెస్ పాలనలో నష్టాల్లోకి వెళ్లిందన్నారు. ఈ అంశంపై ఆధారాలతో బయటపెట్టినా ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రతిపక్షాలపై, ప్రజలపై కొంతమంది పోలీసు అధికారులు ఒత్తిడులు పెంచుతున్నారని, అధికారం శాశ్వతం కాదని హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బంది పెడితే సహించేది లేదని స్పష్టం చేశారు. భూపాలపల్లి ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, వారి హామీల అమలును ప్రశ్నించాలని కేటీఆర్ పిలుపునిస్తూ, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వమని, ప్రజలు ఓటు వేసే ముందు ఆలోచించి వేయాలని ఆయన మరొమారు కోరారు.

బీజేపీ, బీఆర్ఎస్ తీరుపై నిప్పులు

కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీపై సీఎం నిప్పులు చెరిగారు. రాష్ట్రాన్ని ఇంత ధరిద్రంగా తయారు చేసిన బీఆర్ఎస్ పార్టీ, తెలంగాణా అభివృద్ధిపై వివక్ష చూపుతున్న బీజేపీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. పదేళ్లు అధికారంలో ఉంటూ మున్సిపల్, ఆర్థిక శాఖ అన్నింటిపై పెత్తనం చెలాయించిన వారు ఎందుకు మున్సిపాలిటీలను అభివృద్ధి చేయలేదని కేసీఆర్, హరీశ్, కేటీఆర్‌పై సీఎం పరోక్షంగా మండిపడ్డారు. తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేశారా? అడిగారు. పాలమూరు, రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా చేస్తామని మోదీనే స్వయంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీలు అమలు గురించి చెప్పట్లేదని, మోదీని చూసి ఓటేయాలని బీజేపీ నేతలు అడుగుతున్నారని అన్నారు. మోడీని చూసి ఓట్లు వేస్తే పట్టణంలోని మోరీని బాగుచేస్తారా? అంటూ ధ్వజమెత్తారు.

మాట మార్చిన బండి సంజయ్

మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ మనల్ని అవమానించారని, మనల్ని అవమానించి తర్వాత ఓటు వేయాలని ఫడణవీస్ కోరారని సీఎం తెలిపారు. వరదల్లో నీటమునిగిన వస్తువులన్నీ తిరిగిస్తామని జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ హామీ ఇచ్చారని, కేంద్రం నుంచి నిధులు తెచ్చి వస్తువులన్నీ తిరిగిస్తామని బండి సంజయ్ ప్రకటించారని వెల్లడించారు. బండి సంజయ్ హామీలను నమ్మి జీహెచ్ఎంసీలో 50 మంది బీజేపీ కార్పొరేటర్లను గెలిపించారని, ఎన్నికలయ్యాక అడిగితే వస్తువులకు బీమా ఉంటుందని బండి సంజయ్ మాటమార్చారని విమర్శించారు. బీమా డబ్బులు వచ్చేదానికి బండి సంజయ్ రికమెండేషన్ ఎందుకో? అని ప్రశ్నించారు. బండి సంజయ్ మాటలు సత్రం భోజనానికి పెద్దారెడ్డి రికమెండేషన్ అన్నట్లుందని ఎద్దేవా చేశారు.

కేంద్రం వద్ద మొకరిల్లిన బీఆర్ఎస్

2014, 19 వరకు రాజ్యసభలో బీజేపీకి మెజార్టీ లేదని సీఎం తెలిపారు. 2014, 19 వరకు రాజ్యసభలో ప్రతి బిల్లుకు మద్దతు ఇచ్చారన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా కేంద్రం తెచ్చిన చట్టాలను బీఆర్ఎస్ ప్రశంసించిందని చెప్పుకొచ్చారు. నరేంద్ర మోదీ ప్రేమలో అమరత్వం పొందుతానని గతంలో కేసీఆర్ చెప్పారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు అవినీతి జరిగిందని బీజేపీ నేతలు చెప్పారు. మీకు చేతగాకపోతే మాకు అప్పగించండి 48 గంటల్లో అరెస్టు చేస్తామని కిషన్‌రెడ్డి అన్నారని, ఇప్పటి వరకు ఎందుకు అరెస్ట్ చేయలేదో కిషన్ రెడ్డి ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కాళేశ్వరం అవినీతి కేసును సీబీఐకి అప్పగించి ఆర్నెల్లు అవుతుంది. కాళేశ్వరం అవినీతి కేసులో ఇప్పటివరకు ఒక్కరినీ విచారణకు పిలవలేదని కేంద్రంపై సీఎం ధ్వజమెత్తారు.

ప్రాజెక్టును మోదీ ఒత్తిడి చేసి ఏపీకి తరలించారు

ఎన్నికలొచ్చాక మళ్లీ కేంద్రం నిధులు తెస్తామని కిషన్‌రెడ్డి చెబుతున్నారని, తెలంగాణకు లక్షల కోట్లు ఇచ్చామని బీజేపీ నేతలు చెబుతున్నారని, బీజేపీ నేతల ప్రకటనపై సీఎస్‌ను అడిగానని, మనం రూపాయి చెల్లిస్తే కేంద్రం 42 పైసలు ఇస్తుందని చెప్పారని సీఎం తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు బీజేపీ తీవ్ర అన్యాయం చేస్తుందని, బిహార్ ఒక్క రూపాయి పన్ను చెల్లిస్తే రూ.6.16పైసలు కేంద్రం తిరిగి చెల్లిస్తుందని విమర్శించారు. తెలంగాణకు అన్యాయం జరుగుతున్నప్పుడు ఏరోజైనా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడారా? నిలదీశారు. మనకు అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదని, మనం చెల్లించిన నిధులు తిరిగిస్తే చాలని అన్నారు. కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయని మండిపడ్డారు. మన రాష్ట్రానికి వచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారని, హైదరాబాద్‌కు వచ్చిన సెమీకండక్టర్ ప్రాజెక్టును మోదీ ఒత్తిడి చేసి ఏపీకి తరలించారని ఆరోపించారు. కేంద్రం తన విచక్షణను ఉపయోగించి చేయాల్సిన పనులను తెలంగాణకు ఇవ్వలేదని ఆరోపించారు. కుంభమేళాకు వేల కోట్లు నిధులు ఇస్తారని, తెలంగాణలో జరిగే సమ్మక్కసారక్క జాతరకు, గోదావరి పుష్కరాలకు నిధులు ఇవ్వరని, తెలంగాణకు కేంద్రం ఏదైనా ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చిందని కిషన్‌రెడ్డి చెప్పగలరా? అంటూ ప్రశ్నించారు. ఖమ్మం, హైదరాబాద్ వరదలొచ్చినప్పుడు ఒక్క రూపాయి అదనంగా సాయం చేశారా? అని ప్రశ్నించారు. తాము కట్టిన రూపాయిలో 42 పైసలు ఇస్తున్నారా? మీరు అదనంగా ఇచ్చింది ఏంటి? అని అడిగారు. మోదీని చూసి ఓటేయాలని బీజేపీ నేతలు అడుగుతున్నారని, అసలు మున్సిపల్ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధం ఉందని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.

బీజేపీ నేతలకు దేవుడు అసదుద్దీన్

బీజేపీ నేతలకు దేవుడు అసదుద్దీన్ ఓవైసీ అని, బీజేపీ నేతలు రాముడి పేరు చెబుతారు కానీ వాళ్లు దండం పెట్టుకునేది అసదుద్దీన్‌కేనని సీఎం అన్నారు. అసదుద్దీన్ పేరు లేకుండా బీజేపీ నేతల ప్రచారం ఉండదని, రాముడి పేరు ఎన్నిసార్లు తలుచుకుంటారో అసదుద్దీన్ పేర్లు అన్నిసార్లు తలుచుకున్నారని ఎద్దేవా చేశారు. అసదుద్దీన్‌ను అల్లావుద్దీన్ అద్భుత దీపంగా మార్చుకొని ఓట్లు అడుగుతున్నారని, అసదుద్దీన్ దుర్మార్గుడు అయితే మీ ప్రభుత్వమే ఉంది కదా చర్యలు ఎందుకు తీసుకోలేదని సీఎం ప్రశ్నించారు. మతరాజకీయాల ద్వారా బీజేపీ రాజకీయ మనుగడ సాధిస్తుందని వివర్శించారు.

దోపిడీకి అలవాటు పడ్డ బీఆర్ఎస్.

"బీఆర్ఎస్ నేతలు దోపిడీకి అలవాటుపడ్డారని సీఎం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో సహజవనరులను కూడా దోచుకున్నారని, ఆఖరికి భార్యభర్తలు మాట్లాడుకునే టెలిఫోన్ సంభాషణలను కూడా వదల్లేదు మండిపడ్డారు. వాళ్ల పైశాచిక ఆనందానికి ఫోన్‌ట్యాపింగ్ చేసి బెదిరించి డబ్బులు వసూలు చేశారన్నారు. బీఆర్ఎస్ నేతలు విచారణకు వెళ్లేటప్పుడు ఏదో యుద్ధానికి వెళ్తున్నట్లు వెళ్తారని సీఎం సెటైర్లు వేశారు.

అన్ని సదుపాయాలు తీసుకుంటూ సభకు రారా? ...

పదేళ్లలో అన్ని పదవుల్లో బీఆర్ఎస్ నేతలే ఉన్నారని, వార్డు మెంబర్ నుంచి పార్లమెంట్ మెంబర్ వరకు బీఆర్ఎస్ నేతలే ఉన్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. మున్సిపాల్టీల్లో సమస్యలు పరిష్కరించాలంటే బీఆర్ఎస్‌కు ఓటేయాలని అడుగుతున్నారని, పదేళ్లు బీఆర్ఎస్సే అధికారంలో ఉండి ఇప్పుడు సమస్యలు పరిష్కారం కావాలంటే తమకు ఓటేయమనడం ఏంటి? అని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారా?, రేషన్‌కార్డులు ఇచ్చారా? బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగాలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఏం చేయకుండా ఇప్పుడు మళ్లీ గెలిపిస్తే పొడుస్తాం అంటున్నారని, కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారని, సభకు వచ్చి సమస్యలు ప్రస్తావించారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చే అన్ని సదుపాయాలు తీసుకుంటూ సభకు రారా? ఒకవేళ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నేతలు గెలిస్తే వాళ్లు అభివృద్ధి చేస్తారా? అంటూ ప్రశ్నించారు. ఓటు అడిగేందుకు బీఆర్ఎస్‌కు అధికారం ఉందా? అని, బీఆర్ఎస్ నేతలది అహంకారం, విషం, రెచ్చగొట్టే ప్రసంగాలని వివర్శించారు.

ఏ ఒక్కరు నిర్లక్ష్యం చేయకుండా చూడాలి

సోమవారం ఉదయం పార్టీ ముఖ్య నేతలతో జూమ్‌లో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి పార్లమెంటు నియోజక వర్గాల వారీగా తాజా రాజకీయ పరిణామాలపై ఆరా తీశారు. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షులు, ప్రభుత్వ సలహాదారులు మున్సిపల్ ఎన్నికలపై సంబంధించి జరిగిన జూమ్ సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి ఓటరు పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు వేసేటట్లు స్థానిక నాయకత్వం చొరవ చూపాలని సీఎం దిశానిర్దేశం చేశారు. దాదాపు రెండుగంటలు కొనసాగిన జూమ్ సమావేశంలో పోల్ మేనేజ్ మెంట్ పై దృష్టి సారించాలన్నారు. . వివిధ సంస్థలతో నిర్వహింప చేసిన సర్వేలతో పాటు డీసీసీ అధ్యక్షుల నివేదికలు, నిఘా వర్గాల సమాచారం ఆధారంగా పార్టీకి ప్రతికూలంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నేడు, రేపు స్థానిక నాయకత్వం ఓటర్లకు అందుబాటులో ఉండాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ముగిసిన మున్సిపల్‌ప్రచారం

మొదటిపేజీ తరువాయి

ఎస్ఈసీ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓట్ల లెక్కింపు ముగిసే వరకు పకడ్బందీగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే 14మంది పోటీ లేకుండా ఎన్నిక కాగా ,12,930 మంది భవితవ్యం తేలనుంది. రాష్ట్రవ్యాప్తంగా 2,982 వార్డుల్లో ఓట్లు వేసేందుకు 8, 203 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.

జోరందుకున్న తాయిలాల పంపిణీ

పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల్లో సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగియడంతో తాయిలాల పంపిణీ జోరందుకుంది. భారీ ఎత్తున డబ్బు, మద్యం పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఎన్నికల్లో ప్రత్యర్థుల పార్టీ అభ్యర్థుల మధ్య నెలకొన్న పోటీకి అనుగుణంగా డబ్బులు పంపిణీ చేసేందుకు అభ్యర్థులు నిర్ణయించారు. ప్రత్యర్థి ఎంత డబ్బు పంపిణీ చేస్తున్నారు.. అంతకు అధికంగా పంపిణీ చేసేందుకు పోటీ పడుతున్నారు. మున్సిపాలిటీ వార్డులలో యధేచ్ఛగా డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నా పోలీసులు, ఎన్నికల అధికారులు నామ మాత్రంగానే పరిశీలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని మున్సిపాలిటీలలో అధికార పార్టీకి అడ్డుచెప్పని పోలీసులు, విపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీ అభ్యర్థులపై నిఘా పెట్టారంటూ ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. గత నెల 27న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఇప్పటికే పోలీసులు 2 కోట్ల రూపాయలకు పైగా సొత్తు జప్తు చేశారు. నగలు, నగదు, మద్యం, మత్తుపదార్థాలు, ట్యాబ్‌లు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

11న ఉదయం 7 నుంచి
సాయంత్రం 5 వరకు పోలింగ్

ఈనెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ కోసం 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,031 బ్యాలెట్ బాక్సులు, 137 స్ట్రాంగ్‌రూమ్‌లు, 136 ఓట్ల లెక్కింపు కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. అలాగే 742 మంది జోనల్ అధికారులు, 279 ఫ్లయింగ్ స్క్వాడ్, 381 స్క్వాడ్ బృందాలు, 1,370 రిటర్నింగ్ అధికారులు, 1,547 ఏఆర్‌వోలు, 9వేల 560 పోలింగ్ అధికారులు, 31 వేల 428 మంది సిబ్బందిని నియమించి శిక్షణ ఇచ్చారు. పురపాలక, నగరపాలక సంస్థల ఎన్నికల కోసం సుమారు 25 వేల మంది పోలీసు సిబ్బందిని సిద్ధం చేశారు. పోలీసులతో పాటు ఎక్సైజ్, ఫారెస్టు సిబ్బందిని భద్రతలో వినియోగించనున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశారు. ఎక్కడైనా రీపోలింగ్ అవసరమైతే మరుసటి రోజున నిర్వహిస్తారు. ఈనెల 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

ఏ పార్టీ నుంచి ఎంతమంది?....

రాష్ట్రవ్యాప్తంగా 2982 వార్డుల్లో 12,930 మంది భవితవ్యం తేలనుంది. రాష్ట్రవ్యాప్తంగా 22,519 మంది అభ్యర్థులు 29,742 నామినేషన్లు వేశారు. అయితే నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత 12,944 మంది బరిలో మిగిలారు. అందులో రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది మున్సిపాల్టీలు, రెండు కార్పొరేషన్లలో 14 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పన్నెండు మంది కాంగ్రెస్ ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవాలు సాధించారు. కోదాడ మున్సిపాల్టీలో ముగ్గురు వికారాబాద్‌లో ఇద్దరు ఎన్నిక లేకుండానే కౌన్సిలర్లయ్యారు. మహబూబ్‌నగర్, కరీంనగర్ కార్పొరేషన్‌లలో ఒకరు చొప్పున ఏకగ్రీవమయ్యారు. ఆలంపూర్, వికారాబాద్ మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవగా మిగతా 12 చోట్ల కాంగ్రెస్ నాయకులకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లలోని 2,996 వార్డుల్లో కాంగ్రెస్ 2,948, బీఆర్ఎస్ 2,634, బీజేపీ 2,634 వార్డుల్లో పోటీలో ఉంది. రాష్ట్రంలోని అన్ని వార్డుల్లో కలిపి 2,786 మంది ఇండిపెండెంట్లు బరిలో నిలిచారు. ఆమ్ ఆద్మీ పార్టీ 38, బీఎస్పీ 213, సీపీఎం 128, ఎంఐఎం 282, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ 288, సీపీఐ 168, జనసేన 332 స్థానాల్లో పోటీలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు యాభైరెండున్నర లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో పురుషుల కంటే మహిళ ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. 32 జిల్లాల్లోని 7 కార్పొరేషన్లు, 116 కార్పొరేషన్లలోని 2,996 వార్డుల్లో కలిపి పురుష ఓటర్లు 25 లక్షల 62 వేల 369 ఉండగా మహిళలు 2680014 మంది, థర్డ్‌జెండర్లు 640 ఓటర్లు ఉన్నట్లు ఎస్ఈసీ వెల్లడించింది. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో 52 లక్షల 43023 మంది ఓటర్లు ఉన్నారు.

అటవీ శాఖ అభివృద్ధికి జైకా రుణ సాయం

- అరణ్యభవన్ సందర్శించిన జపాన్ ప్రతినిధులు
- రూ.1270 కోట్ల ప్రాథమిక ప్రతిపాదన
- జైకా ప్రతినిధులతో అటవీ అధికారుల కీలక భేటీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 9 : తెలంగాణ అటవీ శాఖను సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ నుంచి రుణ సహాయం పొందేందుకు అటవీ శాఖ ప్రాథమిక ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఈ మేరకు అరణ్యభవన్‌లో అటవీ దళాల ముఖ్య సంరక్షణాధికారిణి డాక్టర్ సీ. సువర్ణ అధ్యక్షతన జపాన్ నుంచి వచ్చిన జైకా ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా డాక్టర్ సువర్ణ తెలంగాణ రాష్ట్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలపై జైకా ప్రతినిధులకు వివరించారు. పచ్చదనం పెంపు లక్ష్యంగా వనమహోత్సవం కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే జైకా ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధి, టైగర్ రిజర్వ్‌ల బలోపేతం, వన్యప్రాణి సంరక్షణ, అర్బన్ ఫారెస్ట్ డెవలప్మెంట్, విస్తృత ప్లాంటేషన్ కార్యక్రమాలు, క్షీణించిన అడవుల పునరుద్ధరణ, అటవీ అగ్నిప్రమాదాల నివారణ వంటి పలు కీలక కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు నిర్ణయించారు. జైకా సహకారంతో 5 సంవత్సరాల కాలానికి రూ.1270 కోట్ల విలువైన ప్రాథమిక ప్రతిపాదనను సిద్ధం చేశారు. మొత్తం వ్యయంలో 85 శాతం నిధులను జైకా నుంచి రుణ రూపంలో, మిగిలిన 15 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలని ప్రతిపాదనలో పొందుపరిచారు. ఈ సందర్భంగా జైకా ప్రతినిధులు మాట్లాడుతూ భారత్-జపాన్ ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే దిశగా ప్రస్తుతం భారత్‌లోని పది రాష్ట్రాల్లో అటవీ రంగానికి సంబంధించిన ప్రాజెక్టులను జైకా అమలు చేస్తోందని వారు తెలిపారు. తెలంగాణ అటవీ శాఖ ప్రతిపాదించిన అభివృద్ధి కార్యక్రమాలు సమగ్రంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉన్నాయని ప్రశంసించారు. అటవీ సంరక్షణతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనే దిశగా ఈ ప్రాజెక్టులు ఆదర్శంగా నిలుస్తాయని, తెలంగాణతో కలిసి పని చేయడం తమకు ఆనందంగా ఉందని తెలిపారు. డాక్టర్ సీ. సువర్ణ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో జైకా ప్రాజెక్ట్ అటవీ శాఖకు అత్యంత అవసరమని, గతంలో ప్రపంచ బ్యాంకు సహకారంతో వచ్చిన నిధులను మా శాఖ విజయవంతంగా అమలు చేసిన అనుభవం ఉందని తెలిపారు. ప్రస్తుతం క్యాంపా నిధులు తగ్గుతున్న నేపథ్యంలో జైకా వంటి అంతర్జాతీయ సహకార ప్రాజెక్టులు అటవీ శాఖ అభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జైకా ప్రతినిధులను తెలంగాణ ప్రభుత్వం తరపున అటవీ శాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జైకా ప్రతినిధులు ఇహా చినాట్సు, షిమోజో హిటోమీ, జైకా భారతీయ ప్రతినిధి సిద్ధార్థ్ పరమేశ్వరన్, పీసీసీఎఫ్ (వైల్డ్‌లైఫ్) వినయ్ కుమార్, పీసీసీఎఫ్ రత్నాకర్ జౌహరి, పీసీఎఫ్ ప్రియాంక వర్గీస్, ఎస్.జె. ఆశ, క్షితిజతో పాటు పలు జిల్లాల డీఎఫ్‌ఓలు పాల్గొన్నారు.



కొన్నేళ్ల పాటు తీరిక లేకుండా నటించడంతో బ్రేక్ తీసుకోవాల్సి వచ్చింది. ఈఎంఐ కట్టేందుకో, మనుగడ సాగించేందుకో నటించలేను. అందుకే ఆలస్యంగా సినిమాలు చేయడం జరిగింది. తనలోని నటుడిని సంతృప్తి పరిచే రోల్స్‌ను సెలక్ట్ చేసుకుంటా.. పాత్రల ఎంపికపై మరింత ఫోకస్ చేసినట్లు పేర్కొన్నారు.

- నటుడు పంకజ్ త్రిపాఠి

భారీ కుంభకోణం

మొదటిపేజీ తరువాయి

ప్లాట్ ఫామ్‌ల ద్వారా భారీ మొత్తాలు షెల్ కంపెనీలకు మళ్లించినట్టు విచారణలో వెల్లడైంది. ఈ స్కామ్‌లో కీలక నిందితులుగా ఉన్న 'విగోఫిన్ డిజిటల్ సొల్యూషన్స్' డైరెక్టర్లు వైఎస్ ప్రభుకుమార్, రాజశేఖర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం వీరిద్దరినీ పోలీసులు విచారిస్తున్నారు. విచారణలో ఈ స్కామ్‌కు సంబంధించి మరిన్ని కీలక విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అధికారుల దర్యాప్తు వేగవంతం

దాడుల్లో లభించిన హార్డ్ డిస్క్ లు, బ్యాంక్ స్టేట్మెంట్ల ఆధారంగా జీఎస్టీ విజిలెన్స్ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. కేవలం పన్ను ఎగవేతే కాకుండా.. ఈ వ్యవహారంలో హవాలా కోణం కూడా ఉందా? అనే దిశగా ఆరా తీస్తున్నారు. రూ. 5,000 కోట్ల లావాదేవీల్లో ప్రభుత్వానికి రావాల్సిన జీఎస్టీ వాటా ఎంత? ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే విషయాలపై లోతుగా విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుల అరెస్టుతో పాటు వారికి సహకరించిన మరి కొంతమంది పేర్లు కూడా వెలుగులోకి రావొచ్చు.

కీసర బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు

- మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ మను చౌదరి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 9: శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో వీఐపీ దర్శనాలతో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 13 నుంచి 18 వరకు జరగనున్న నేపథ్యంలో సోమవారం కీసర గుట్టకు వెళ్లిన కలెక్టర్ మన చౌదరి, మల్కాజ్గిరి డీసీపీ శ్రీధర్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ రెడ్డి, ఆర్డీఓ రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ తటాకం వెంకటేశ్, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డిలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు పూర్ణ కుంభంతో కలెక్టర్ కు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోగల సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు క్యూలైన్లను పెంచాలన్నారు. కీసర గుట్ట బ్రహ్మోత్సవాల జాతరలో పూజ సామగ్రి, ఆహార పదార్థాల నుంచి మొదలుకొని అన్ని రకాల వస్తువుల విక్రయానికి సంబంధించి ధరలు

భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కువ ధరలకు విక్రయించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులు వ్యాపారులకు తెలపాలన్నారు. కీసర ఆలయంకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకు రావాలని ఆలయ ఈవో, చైర్మన్ కు తెలిపారు. మహాశివరాత్రికి కీసరగుట్టలో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విజయవంతం చేయాలని కలెక్టర్ సమావేశంలో స్పష్టం చేశారు.

నరవణె పుస్తకం టాపిక్ విని మోడీ భయపడ్డారు

మొదటిపేజీ తరువాయి

సాహసం చేసి సభకు వచ్చి ఉండాల్సిందన్నారు. సోమవారం మధ్యాహ్నం రాహుల్ గాంధీ పలువురు విపక్ష నేతలతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో ప్రధాని మోదీని బెదిరించేందుకు విపక్ష ఎంపీలు ప్లాన్ చేశారు అనేది పూర్తిగా అబద్ధమన్నారు. స్పీకర్‌కు సరైన సమాచారమే ఉంటే, ప్రధానిపై దాడికి ప్లాన్ చేసిన ఎంపీలపై ఎఫ్ఐఆర్‌ను ఎందుకు నమోదు చేయించలేదని రాహుల్ ప్రశ్నించారు. అలాంటి ఎంపీలను అరెస్టు చేయించి ఉండాల్సిందన్నారు. స్పీకర్ ఆరోపణ అవాస్తవం కాబట్టే, ఇవేం చేయలేదని పేర్కొన్నారు.

నన్ను మాట్లాడనివ్వడం లేదు

మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణె పుస్తకం గురించి మోదీ సర్కారు తనను మాట్లాడనివ్వడం లేదని రాహుల్ అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ పుస్తకంలోని అంశాలపై లోక్‌సభలో తనకు మాట్లాడే అవకాశాన్ని ఇచ్చేది లేదని ప్రభుత్వం తేల్చి చెబుతోందన్నారు. లోక్‌సభ కార్యకలాపాలు ఆగినా ఫర్వాలేదు అనుకొని, వాళ్లు తనను మాట్లాడనివ్వడం లేదని రాహుల్ తెలిపారు. నరవణె పుస్తకం గురించి తాను సభలో మూడు, నాలుగుసార్లు మాట్లాడే ప్రయత్నం చేసినా అడ్డుకున్నారని ఆయన చెప్పారు.

పుస్తకం కాదు.. మ్యాగజైన్ గురించి..

"నేను ఎంఎం నరవణె పుస్తకంలోని అంశాల గురించి మాట్లాడటం లేదు. ఒక మ్యాగజైన్‌ను ఉటంకిస్తూ, అందులోని కొన్ని అంశాలను లోక్‌సభకు చెప్పదలిచాను. నేనొక పుస్తకం గురించి మాట్లాడే ప్రయత్నం చేస్తున్నాను అని మోదీ సర్కారు చేస్తున్న ఆరోపణ సరికాదు. ఎంఎం నరవణె పుస్తకం పబ్లిషే కాలేదని భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అంటున్నారు. ఆయన చెప్పింది తప్పు. ఆ బుక్ పబ్లిష్ అయింది. మేం ఒక కాపీని కూడా సేకరించాం. అందుకే ఇదొక పెద్ద అంశం'' అని రాహుల్ గాంధీ తెలిపారు.

మేం ఏమీ మాట్లాడొద్దు అంటే ఎలా?

"రాష్ట్రపతి ప్రసంగంపై ప్రవేశ పెట్టిన ధన్యవాద తీర్మానంపై చర్చలో లోక్‌సభ విపక్ష నేతగా ఉన్న నన్ను, మొత్తం విపక్షాలను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు. అధికార ఎన్‌డీఏ కూటమిలోని ఒక ఎంపీ చాలా పుస్తకాలను ఉటంకిస్తూ లోక్‌సభలో మాట్లాడాడు. నీచమైన వ్యాఖ్యలు చదివి వినిపించాడు. అయినా ఆయనను స్పీకర్ ఏమీ అనలేదు. ఇది రెండో పెద్ద అంశం. అధికార పక్షం ఎంపీలు ఏది పడితే అది మాట్లాడుతున్నారు. మేం ఏమీ మాట్లాడొద్దు అంటే ఎలా?'' అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు.

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో భేటీ

ఇక లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో భేటీలో పలు ప్రధాన అంశాలను రాహుల్ గాంధీ ప్రస్తావించారు. సభలో తాను లేవనెత్త దల్చిన అంశాల గురించి ఆయన వివరించారు. 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్, విపక్ష మహిళా ఎంపీలపై చేసిన ఆరోపణలు, పార్లమెంటుతో ముడిపడిన పలు అంశాల గురించి సభలో మాట్లాడాలని తాను భావించానని రాహుల్ చెప్పినట్లు తెలిసింది. రాహుల్ గాంధీ వెంట స్పీకర్ వద్దకు వెళ్లిన విపక్ష నేతల్లో టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ, డీఎంకే నేత టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఉన్నారు. లోక్‌సభ సజావుగా సాగాలంటే 8 మంది కాంగ్రెస్ ఎంపీలపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని స్పీకర్‌ను విపక్ష ఎంపీలు కోరినట్లు సమాచారం. అయితే కొన్ని నిమిషాల్లోనే ఈ సమావేశం ముగిసింది.

స్పీకర్‌తో అగ్రిమెంట్ కుదిరింది: రాహుల్-

సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు కేంద్ర బడ్జెట్‌పై లోక్‌సభలో చర్చ మొదలైంది. ఈ చర్చను మొదలుపెట్టాలని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌ను లోక్‌సభ స్పీకర్ స్థానంలో ఉన్న సంధ్యా రే కోరారు. ఈసందర్భంగా థరూర్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీకి మాట్లాడే ఛాన్స్ ఇవ్వాలన్నారు. బడ్జెట్‌పై రాహుల్ మాట్లాడితే తమకు అభ్యంతరం లేదని సంధ్యా రే చెప్పారు. ఈ తరుణంలో రాహుల్ స్పందిస్తూ, స్పీకర్ ఓం బిర్లాతో జరిగిన మీటింగ్‌లో ఒక ఒప్పందానికి వచ్చామన్నారు. బడ్జెట్ చర్చ కంటే ముందు, కొన్ని అంశాలపై మాట్లాడేందుకు తనకు అవకాశమిస్తానని స్పీకర్ చెప్పారని రాహుల్ తెలిపారు. అలాంటి ఒప్పందాల గురించి తనకు తెలియదని, ముందస్తు నోటీసు లేకుండా బడ్జెట్ మినహా వేరే అంశాల గురించి. స్పీకర్ సభలో ఉన్నప్పుడే, ఆయనతో మాట్లాడిన విషయాల గురించి ప్రస్తావించాలని రాహుల్‌కు రిజిజు సూచించారు. దీంతో అధికార, విపక్ష ఎంపీలు పరస్పర వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ గందరగోళం నడుమ లోక్‌సభను సంధ్యా రే వాయిదా వేశారు.

రాష్ట్రీయం

ప్రశ్నించే గొంతుక మజ్లిస్

- ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ
- షాద్ నగర్లో మున్సిపల్ ఎన్నికల ప్రచారం
- 1వ వార్డు ఎంఐఎం అభ్యర్థి గౌస్ ను గెలిపించాలని విన్నపం

ప్రతిపక్షం, షాద్‌నగర్, ఫిబ్రవరి 9: అన్యాయాలపై అక్రమాల పై ప్రశ్నించే గొంతుక మజ్లిస్ పార్టీ అని ఏఐఎంఐఎం పార్టీ అధినేత, పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఒకటవ వార్డులో ఎంఐఎం పార్టీ తరఫున పోటీ చేస్తున్న మాజీ కౌన్సిలర్ గౌస్ తరఫున మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ నిర్వహించారు. ఎంఐఎం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన రోడ్డు షో లో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడారు. మొత్తం మున్సిపల్ ఎన్నికలలో ఒకే ఒక్క సీటు ఒకటవ వార్డు అని ఈ వార్డులో పోటీ చేస్తున్న గౌస్ ను గెలిపించాలని కోరారు. మనకు ఒకే ఒక సీటు ఉంది ఆ సీటును ఎట్టి పరిస్థితుల్లోనూ మజ్లీస్ ఖాతాలో వేసుకోవాలని అన్నారు. ఈ సీటు మన గౌరవానికి మన హక్కులకు ప్రతీక అని, ఐక్యంగా ఓటేస్తే గెలుపు మనదేనని మీ ఒక్క ఓటే మజ్లీస్ బలాన్ని నిర్ణయిస్తుందని అన్నారు. అన్యాయాలు, అక్రమాలు జరిగినప్పుడల్లా దేశవ్యాప్తంగా ప్రశ్నించే గొంతుక మజ్లిస్ పార్టీది అవుతుందని అన్నారు. మహిళల హిజాబ్ విషయంలో గొంతెత్తి ప్రశ్నించింది ఎంఐఎం పార్టీ అని, అదేవిధంగా త్రిబుల్ తలాక్ విషయంలో హక్కుల భంగానికి సంబంధించి ప్రశ్నించింది ఎంఐఎం పార్టీ అని అన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థి గౌస్ మాట్లాడుతూ అనేక సమస్యలపై ప్రశ్నించిన దాఖలాలు ఉన్నాయని ఈ మున్సిపల్ పరిధిలో ఒకే ఒక్క సీటు తనదేనని తనను అత్యధిక వ్యాధితో గెలిపిస్తే సమస్యల పై ప్రశ్నిస్తానని న్యాయం జరుగుతాయని తెలిపారు.

ఆత్మగౌరవ సభకు తరలిరండి

- జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 9: ఈ నెల 12న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభకు తరలిరావాలని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి అన్నారు. దేశంలో సుదీర్ఘంగా కొనసాగి లక్ష్యాన్ని సాధించిన ఉద్యమం తెలంగాణ ఉద్యమమని నవీన్ ఆచారి అన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక ఉద్యమాలు మధ్యలోనే ఆగిపోయినప్పటికీ, తెలంగాణ ఉద్యమం మాత్రం 1950లో నిజాం నుంచి విముక్తి కోసం ప్రారంభమై వలస పాలన అంతం వరకు అదే స్పూర్తితో కొనసాగిందన్నారు. 2001లో ప్రారంభమైన మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఇంటి నుంచి ప్రజలు భాగస్వాములయ్యారని, ప్రపంచానికే ఆదర్శంగా నిలిచే ఉద్యమంగా తెలంగాణ ఉద్యమం మారిందని తెలిపారు. ఎంతో మంది అమరవీరులు, ఉద్యమకారులు పరపీడన నుంచి విముక్తి కోసం తమ ప్రాణాలను అర్పించారని గుర్తుచేశారు.అమరవీరులు, ఉద్యమకారుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ ఒక రాష్ట్రం మాత్రమే కాక వందలాది మంది ఉద్యమకారుల కృషి ఫలితమని నవీన్ ఆచారి పేర్కొన్నారు. అయితే రాష్ట్రం సాధించిన తరువాత ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు తగిన అవకాశాలు, ఆదరణ లభించాయా అనే అంశాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో జరిగే ఈ సభకు తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన వారితో పాటు అమరవీరుల కుటుంబాలు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కుల సంఘాలు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై జరిగే చర్చలో భాగస్వాములు కావాలని కోరారు. ఉద్యమకారులు, అమరవీరులు లేకుండా తెలంగాణ లేదని, వారందరినీ గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని నవీన్ ఆచారి స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ జాగృతి నాయకులు దండెం ఆనందం, పాండురంగారెడ్డి, శశిధర్, లింగం తదితరులు పాల్గొన్నారు.

చివరి రోజు కాంగ్రెస్ భారీ ర్యాలీ

- పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

ప్రతిపక్షం, షాద్ నగర్, ఫిబ్రవరి 9: మున్సిపల్ఎన్నికల చివరి రోజున కాంగ్రెస్‌శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. ఈ ర్యాలీకి మున్సిపాలిటీలోని అన్ని వార్డుల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు మద్దతుగా పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఈ భారీ ర్యాలీలో కాంగ్రెస్ నేతల ఆటపాటలు, జెండాల రెపరెపలు, నినాదాలు చూపర్లను ఎంతగానో ఆకట్టుకున్నాయి. 28 వార్డులలో గత కొన్ని రోజులుగా తన వ్యూహరచనల ద్వారా పార్టీకి అనుకూలమైన పరిస్థితులు తీసుకువచ్చి, విజయాన్ని ఖాయం చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, చివరి రోజున ఈ భారీ ర్యాలీ నిర్వహించి అందరి దృష్టిని తన వైపుకు తిప్పుకున్నారు.

జయం మనదే..: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

కాంగ్రెస్ అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ విజయం ఖాయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రచారంలో భాగంగా బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రచారంలో ఏవార్డుకు వెళ్లినా ప్రజల నుంచి విపరీతమైన స్పందన వచ్చిందని అన్నారు. గత రెండేళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి చేరగని ముద్రవేశాయని, భవిష్యత్తులో అన్ని వార్డులలోనూ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం చేస్తున్న సంక్షేమ పథకాలే ఆ పార్టీకి విజయాన్ని అందిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

కాంగ్రెస్ కు ఎదురేలేదు..: మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి

మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురేలేదని మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి అన్నారు. ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడం ఖాయమని స్పష్టమవుతుందని వెల్లడించారు. అభ్యర్థులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి మన్నలు అందుకున్నారని ప్రశంసించారు. ఘనవిజయం సాధించిన తర్వాత తిరిగి కృతజ్ఞతాపూర్వకంగా భారీ ర్యాలీ చేపట్టాలని ఆయన సూచించారు. షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అధికార పార్టీకి చెందిన 28 మంది అభ్యర్థులు విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ముమ్మర ప్రచారం చేపట్టిన అభ్యర్థులు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ప్రచారంలో ముందడుగు వేశారు. ప్రతిపక్షాలు ఇతర అభ్యర్థుల కన్నా ముందంజలో ఉన్నారు. ప్రచారం చివరి రోజు భారీ ఎత్తున పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఇంత పెద్ద భారీ ర్యాలీ చూసి పట్టణ ప్రజలు కూడా ఆశ్చర్యానికి గురయ్యారు. షంషేర్ శంకర్ అంటూ రాజకీయ విశ్లేషకులు అంటున్నారు

'మాకు 15 సెకన్లు చాలు'

అది మా బీజేపీ సిద్ధాంతం కాదు

- బీజేపీ ఆలోచన "సబ్ కా సాత్ సబ్ కా వికాస్"
- కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మిలాఖత్
- నిర్మల్ జిల్లాలో ప్రచారంలో రామచంద్రరావు

ప్రతిపక్షం, నిర్మల్, ఫిబ్రవరి 9: కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు విరుచుకుపడ్డారు. మున్సిపల్ ఎన్నికల వేళ నిర్మల్ జిల్లాలో రామచంద్రరావు ప్రచారం చేశారు. గతంలో అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల పై సవాల్ విసిరారు. 'నీకు 15 నిమిషాలు.. మాకు 15 సెకన్లు సరిపోతాయి. కానీ, అది మా బీజేపీ సిద్ధాంతం కాదు. బీజేపీ, మోదీ ఆలోచన "సబ్ కా సాత్ సబ్ కా వికాస్". ఎంఐఎం ఒక బ్రోకర్ పార్టీ. అప్పట్లో బీఆర్ఎస్‌తో, ఇప్పుడు కాంగ్రెస్‌తో ఎంఐఎం ఎన్నికల పొత్తు. ఓట్ల లబ్ధి కోసమే ప్రజలను ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలు రెచ్చగొడుతున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కలిసి ఉమ్మడి కాపురం చేస్తున్నాయి. ప్రజల కోసం బీజేపీకి ఓటు వేయండి.. తెలంగాణను రక్షించండి. ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో స్కాములు, స్కీముల పేరిట దోచుకుంటున్నారు. నిర్మల్ ప్రజలు విజ్ఞులు.. బీజేపీకి ఓటు వేయండి, అవినీతి రహిత పాలనను స్వాగతించండి" అని రామచంద్రరావు కోరారు.

డిజిటల్ క్రాప్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 9 : రాష్ట్రంలో డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారుడు, అగ్రిస్టాక్ చీఫ్ నాలెడ్జ్ ఆఫీసర్ రాజీవ్ చావ్లా (రిటైర్డ్ ఐఎఎస్) అధ్యక్షతన సమావేశం జరిగింది. రెవెన్యూ కార్యదర్శి లోకేశ్‌కుమార్, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రెటరి రాజీవ్‌గాంధీ హన్మంతు, ఇతర సీనియర్ అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ మార్చి 15 లోగా డీసీఎస్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, ఎన్ఐసీ అధికారుల సహకారంతోసర్వేను పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రంలో 10,877 గ్రామాల్లో డిసిఎస్ సర్వే చేపట్టడం జరిగిందని అధికారులు తెలిపారు. సీజినల్ డిజిటల్ క్రాప్ సర్వే వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలకు ఉపకరిస్తుందని, అదేవిధంగా స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి(జీఎస్‌డీపీ) గణాంకాలకు ఈ సర్వే ఉపయుక్తంగా ఉంటుందని సీఎస్ పేర్కొన్నారు. దేశంలోని యూపీ, బీహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక, ఒడిశా తదితర రాష్ట్రాల్లో డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ పూర్తి అయిందని కేంద్ర ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్ చావ్లా తెలిపారు. అదే తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.వ్యవసాయశాఖ సంచాలకులు గోపి ఇప్పటి వరకు చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే వివరాలను ఉన్నతాధికారులకు వివరించారు. ఈ సమావేశంలో కార్యదర్శులు లోకేశ్‌కుమార్, సురేంద్రమోహన్, రాజీవ్‌గాంధీ హన్మంతు, వ్యవసాయశాఖ సంచాలకులు గోపి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా

మద్యం దుకాణాల మూసివేత

- ఫ్యూచర్ సిటీ సీపీ సుధీర్ బాబు

ప్రతిపక్షం సిటీబ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 9: మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు జరగనున్న సాధారణ ఎన్నికల సందర్భంగా, శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ ఎక్సైజ్ చట్టం, 1968 లోని సెక్షన్ 20 ప్రకారం, కమిషనరేట్ పరిధిలో మద్యం విక్రయాలపై నిషేధం విధించినట్లు వెల్లడించారు. ఆమన్ గల్, ఇబ్రహీంపట్నం, షాద్ నగర్, చేవెళ్ల, శంకర్పల్లి, మొయినాబాద్ మున్సిపాలిటీల పరిధిలోని అన్ని కల్లు దుకాణాలు, వైన్ షాపులు మరియు రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లు మూసివేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ఎన్నికల సందర్భంగా 9వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి, 11 సాయంత్రం 5.00 గంటల వరకు (పోలింగ్ ముగిసే వరకు) మద్యం దుకాణాలు పూర్తిగా మూసివేయబడతాయని తెలిపారు. తిరిగి కౌంటింగ్ రోజు 13న ఉదయం 06.00 గంటల నుండి, ఓట్ల లెక్కింపు పూర్తయి ఫలితాలు వెల్లడయ్యే వరకు నిషేధం కొనసాగుతుందని తెలిపారు. ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని కమిషనర్ ఆఫ్ పోలీస్ హెచ్చరించారు.

మధిర పట్టణ రూపురేఖలను మారుస్తా

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం, ఫిబ్రవరి 9: మధిర పట్టణ రూపురేఖలను పూర్తిగా మార్చే బాధ్యత తనదేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత పదేళ్లుగా మధిర మున్సిపాలిటీలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని, ప్రజల ఆశీస్సులు, సహకారంతో మధిర మున్సిపాలిటీలోని అన్ని వార్డులను కైవసం చేసుకుంటామని డిప్యూటీ సీఎం ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలోని మధిర మున్సిపాలిటీలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భారీ రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మధిర పట్టణ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. మధిరలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్ తరహాలో మోడరన్ మహాప్రస్థానం శ్మశానవాటిక నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. మధిరకు కావాల్సింది రాజకీయాలు కాదని, కేవలం అభివృద్ధి మాత్రమేనని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. అభ్యర్థుల గెలుపు రాజకీయాల కోసం కాదని.. అభివృద్ధి కోసమే అని చెప్పారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్‌టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. డబ్బు ప్రధానం కాదని.. అభివృద్ధే ప్రధానమని, వ్యక్తులకన్నా వ్యవస్థలే ముఖ్యమని డిప్యూటీ సీఎం వివరించారు. మధిర మున్సిపాలిటీని రాష్ట్రానికి మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. ఏ అవసరం ఉన్నా ప్రజలందరికీ అండగా నిలుస్తానని చెప్పారు. విజ్ఞులైన ప్రతి ఒక్కరూ మధిర అభివృద్ధిపై తమ ఆలోచనలు పంచుకోవాలని కోరారు. మహిళలను వడ్డీలేని రుణాలతోస్వయం ఉపాధి వ్యాపారస్తులుగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

శోభన్ బాబును గెలిపిస్తే అన్ని విధాల అభివృద్ధి చేస్తా

- చివరి రోజు ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ

-ప్రతిపక్షం, హుస్నాబాద్, ఫిబ్రవరి 9: హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో 20వ వార్డును అభివృద్ధి పథంలో నడిపించాలంటే కాంగ్రెస్ అభ్యర్థి గోపగోని శోభన్ బాబును గెలిపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజైన సోమవారం ఆయన 20వ వార్డులో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... శోభన్ బాబు గెలుపే 20వ వార్డుకు అభివృద్ధి ద్వారాలు తెరుస్తుందని అన్నారు. ప్రజల అవసరాలు తెలుసుకుని, ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, కౌన్సిలర్‌గా శోభన్ బాబు గెలిస్తే ప్రభుత్వ నిధులు, పథకాలను నేరుగా వార్డుకు తీసుకొచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతుల్యంగా అమలు చేస్తున్నామని తెలిపారు. 20వ వార్డును అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, హస్తం గుర్తుపై ఓటు వేసి గోపగోని శోభన్ బాబును భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి పొన్నం కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా12న సార్వత్రిక సమ్మె

- పడమటిగూడెం గ్రామంలో గోడపత్రిక ఆవిష్కరణ

ప్రతిపక్షం, తొర్రూరు, ఫిబ్రవరి, 9 : బీజేపీ ప్రభుత్వం దేశంలో కార్మికులు, రైతు కూలీలను హక్కులు లేని బానిసలుగా మార్చే దిశగా వ్యవస్థబద్ధమైన దాడి చేస్తోందని అఖిల భారత రైతు కూలీసంఘం తొర్రూరు డివిజన్ అధ్యక్షుడు చిర్ర యాకన్న తీవ్రంగా విమర్శించారు. సోమవారం నరసింహుల పేట మండలం పడమటిగూడెం గ్రామంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో గోడపత్రికలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా చిర్ర యాకన్న మాట్లాడుతూ కార్మిక చట్టాల పేరుతో తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లు కార్మికుల కనీస హక్కులను కాలరాస్తూ, యాజమాన్యాలకు అపరిమిత అధికారాలు కట్టబెట్టే ప్రమాదకర చట్టాలని తెలిపారు. పని గంటలు పెంచడం, సమ్మె హక్కును హరించడం, సంఘటితంగా పోరాడే అవకాశాలను అణిచివేయడం ఈ చట్టాల అసలైన లక్ష్యమని స్పష్టం చేశారు. అలాగే ఉపాధి చట్టం పేరును మార్చి నిధులకు కోత విధించడం అనేది రైతు కూలీల సంక్షేమాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రజలను మభ్యపెట్టే రాజకీయ మాయాజాలమని విమర్శించారు. పేర్లు మార్చడం కాదు, పథకాలను పాత పద్ధతిలో యథావిధిగా, పూర్తి నిధులతో అమలు చేయడమే ప్రజల డిమాండ్ అని అన్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే విధానాలకు వ్యతిరేకంగా, కార్మిక, రైతు వర్గాల ఐక్య పోరాటం తప్ప మరో మార్గం లేదని, అందులో భాగంగానే ఈ నెల 12న సార్వత్రిక సమ్మె అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొమ్ము కుమార్, చిర్రా హనుమంతు, అనిల్, అమృత, యాకయ్య, మల్లయ్య, లింగమ్మ, మంచాల కొమురయ్య, ఎర్ర అశోక్, కాశి రెడ్డి, రామి రెడ్డి, జక్కుల యక సాయిలు తదితరులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.



ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడనివ్వం. విద్యుత్ కొనుగోలు భారాన్ని కూడా తగ్గించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అగ్నిమాపక, పురపాలక, అటవీ, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో నిబంధనలు సరళతరం చేయాలి. కేంద్రం నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి. పన్ను వసూళ్లు తగ్గకూడదు. వ్యాపారులను వేధించకూడదు.

- అధికారులతో ఏపీ సీఎం చంద్రబాబు

ఓపెన్ వాయిస్

భారత్ వాణిజ్య వ్యూహం

ప్రపంచ వాణిజ్య యుద్ధాలు, ట్రంప్ టారిఫ్ వార్‌తో ప్రపంచ వ్యాప్తంగా సప్లయ్ చైన్ దెబ్బతింటోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కారణంగా చాలా దేశాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. భారత్‌పై ట్రంప్ 2.0 విధించిన టారిఫ్‌లతో ఫార్మా, టెక్స్‌టైల్, జెమ్స్ తదితర రంగాలు ఒడిదుడుకులకు లోనయ్యాయి. చాలా మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఈ తరుణంలో మోదీ తన చాణక్యంతో వ్యాపార విస్తరణపై దృష్టి పెట్టారు. అమెరికాను మించిన ఒప్పందాలు చేసుకుంటూ టారిఫ్‌ల ప్రభావం భారత్‌పై పడకుండా చేశారు. ఆస్ట్రేలియా, యూకే, యూఏఈ, యురోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నారు. దీంతో షాక్ అయిన ట్రంప్ ఇప్పుడు దిగి వచ్చారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి సై అంటున్నారు. అదీ మనం చెప్పినట్లుగా, మన కండిషన్స్ అంగీకరిస్తూనే.. ప్రపంచ వాణిజ్య యుద్ధాల మధ్య భారత్, యూరోపియన్ యూనియన్, అమెరికాతో ఒప్పందాల తర్వాత గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)లోని ఆరు దేశాలతో ఫ్రీ ట్రేడ్ ఒప్పంద చర్చలు ప్రారంభించింది. యూఏఈ, ఒమాన్‌తో ఇప్పటికే అమలులో ఉన్న ఒప్పందాలు ఆధారంగా, సౌదీ అరేబియా, ఖతర్, కువైత్, బహ్రెయిన్‌తో సంబంధాలు బలోపేతమవుతాయి. ఈ చొరవ భారత విదేశీ వ్యాపార వ్యూహానికి కొత్త ఊపిరి పోస్తుంది. ఒప్పందం విజయవంతమైతే, ఆహార ఉత్పత్తులు, ఫార్మా, టెక్నాలజీ ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయి. గల్ఫ్ దేశాల నుంచి ఇన్వెస్ట్‌మెంట్‌లు మాన్యుఫాక్చరింగ్, ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల్లో ప్రవేశిస్తాయి. ఇప్పటికే యూఏఈతో విస్తరణ జరిగిన మోడల్, మిగతా దేశాలకు మార్గదర్శకంగా పనిచేస్తుంది. ఆరు నెలలుగా ట్రంప్ భారత్‌ను ఇబ్బంది పెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మోదీపై, భారత్‌పై విమర్శలు చేస్తున్నారు. అయితే మన సహనం మోదీకి చికాకు తెప్పించింది. చివరకు మోదీ వద్దకు ట్రంపే దిగివచ్చేలా చేసింది. ట్రంప్ టారిఫ్ వార్ నుంచి వెనక్కి తగ్గారు. 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారు. ఇక నెలులగా జరుగుతున్న వాణిజ్య ఒప్పందం చర్చలు కొలిక్కి వచ్చాయి. మొదటి దశ వాణిజ్య ఒప్పందం ఆమోదం పొందింది. ఈమేరకు రెండు దేశాలూ ఐక్యంగా ప్రకటన విడుదల చేశాయి. పరస్పర ప్రయోజనాలు కలిగించే పూర్తి ఒప్పందానికి పునాది వేశాయి. తాజాగా కుదిరిన మధ్యంతర ఒప్పందంపై కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ స్పందించారు. ఇది దేశ ఎగుమతులకు 30 ట్రిలియన్ డాలర్ల అవకాశాలు తెరుస్తుందని చెప్పారు. ముఖ్యంగా చిన్న తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), రైతులు, చేపలు పట్టేవారికి గణనీయ ప్రయోజనాలు చేకూరుతాయి. ఎగుమతుల పెరుగుదలతో దేశవ్యాప్తంగా మహిళలు, యువతకు అనేక ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది.భారత్-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో దుస్తులు, చర్మ సామగ్రి, జుట్టు ఉత్పత్తులు, ప్లాస్టిక్, రబ్బర్ వస్తువులు, కొన్ని రసాయనాలు, ఇంటి అలంకార వస్తువులు, చేతి పని నైపుణ్య ఉత్పత్తులు, ఎంపికైన యంత్రసామగ్రి ధరలు తగ్గుతాయి. అమెరికన్ పరిశ్రమ వస్తువులు, కొన్ని పండ్లు, సోయాబీన్ ఆయిల్, వైన్ వంటి వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ టారిఫ్‌లను తొలగించనుంది లేదా తగ్గిస్తుంది. మరోవైపు, భారత జనరిక్ మందులు, రత్నాలు, వజ్రాలు, విమాన భాగాలపై అమెరికా సుంకాలు ఎత్తేసే అవకాశం ఉంది.భారత్, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపుతుందని అమెరికా పేర్కొంది. బదులుగా అమెరికా నుంచి పెద్ద మొత్తంలో ఇంధనం, గ్యాస్ దిగుమతి చేస్తామని భారత్ అంగీకరించింది. 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికన్ దిగుమతులకు మార్గం సుగమం అవుతుంది. ఇక భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పాకిస్తాన్‌కు తీవ్ర నష్టం కలిగిస్తోంది. అమెరికా టారిఫ్‌ల నుంచి తప్పించుకుని భారత టెక్స్‌టైల్స్, జెమ్స్ పరిశ్రమలు యూరప్ మార్కెట్‌లో ప్రవేశపెట్టుకుంటున్నాయి. పాక్ నుంచి యూరప్‌కు సంవత్సరానికి 9 బిలియన్ డాలర్ల ఎగుమతుల్లో టెక్స్‌టైల్స్, అపారెల్‌లు ప్రధానం. పన్ను రహిత భారత ఎగుమతులు పోటీని పెంచుతాయి. పాక్ ఎగుమతుల్లో 66% పన్ను రహితం, సంవత్సరానికి 7 బిలియన్ డాలర్ల టెక్స్‌టైల్స్ ఎగుమతులే. భారత్-ఈయూ ఒప్పందంతో ఇవి సగానికి పడిపోవచ్చు. కోటి మంది ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉంది. పాకిస్తాన్ కామర్స్ మంత్రి, టెక్స్‌టైల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భారత డీల్ పాకిస్తాన్‌కు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు.అమెరికా మార్కెట్ నష్టాన్ని భారతం యూరప్‌తో భర్తీ చేసుకుంది, గల్ఫ్ దేశాలు ప్రపంచ ఇంధన వనరుల 40% నియంత్రిస్తున్నాయి. ఈ ఒప్పందం భారత ఇంధన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. వాణిజ్య రక్షణను పెంచుతుంది. గల్ఫ్ దేశాలు ఆయిల్ ఆధారిత ఆర్థిక వ్యవస్థల నుంచి డైవర్సిఫై అవుతున్న సమయంలో, భారత మార్కెట్ వారికి ఆకర్షణీయంగా మారుతోంది. ఇది ద్వైపాక్షిక వ్యాపారాన్ని రెట్టింపు చేసే అవకాశం ఉంది. టారిఫ్ ఆంక్షలు, నిబంధనల సమన్వయం సవాళ్లుగా ఉన్నాయి. అయితే, వ్యూహాత్మక బలం, మ్యూచువల్ లాభాలు చర్చలను వేగవంతం చేస్తాయి. విజయం సాధిస్తే, భారత వాణిజ్యం మెరుగుపడుతుంది. గ్లోబల్ అనిశ్చితుల మధ్య భారత ఆర్థిక స్థిరత్వాన్ని బలపరుస్తుంది.

ప్రతిపక్షం

హైదరాబాద్

మంగళవారం

10.02.2026

ఎన్నికలకు ముందే గెలిచిన బహుజన వాదం

"ఎనకే.. ఎనకే.. ఎనకే ఎన్నాళ్లు నీ ఉనికిని చాటగా బయలెల్లు..." మరియు "రా...కదలిరా రా....ఏకమై కదలిరా"...అంటూ తెలంగాణలో మారుమోగిన పాటలు బహుజన వర్గాల్లో భూకంపాన్ని సృష్టించాయి. తరతరాలుగా అణచివేయబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో మహనీయుల ఆశయాలను రగిలిస్తూ, "తెలంగాణ గడ్డపై తమ వాటాను" అడిగిన ఈ పాటలకు రూపం ఇచ్చిన ఆధునిక బహుజన నాయకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్.

సంపతి రమేష్
7989579428

ప్రజాస్వామ్య భారతదేశంలో ప్రజల జీవితాల్లో మార్పు రావాలంటే, సమాజంలోని అన్ని వర్గాలకు తగిన ప్రాతినిత్యం లభించాలి. రాజ్యాంగం వచ్చి 77 ఏళ్ళు దాటినా జనాభాలో అధిక భాగాన్ని కలిగిన వెనుకబడిన తరగతులు(ఓబీసీ) ఇప్పటికీ రాజకీయంగా తగిన వాటా పొందలేకపోతున్నారు. రాజ్యాంగపరంగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించినప్పటికీ, ఓబీసీలకు మాత్రం వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా సీట్లు కేటాయించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయి. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ అంశం తెరపైకి తీసుకురావడం జరిగింది. ఇది కేవలం తూతూ మంత్రంగా ఒక బిల్లు చేయడం, జీవో విడుదల చేయడం వరకే పరిమితమైంది. ఇది సైతం న్యాయస్థానంలో నిలబడలేకపోయింది. చివరకు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ అంశాన్ని పక్కన పెట్టి స్థానిక సంస్థలు ఎన్నికలను వెళ్ళింది. ఈ విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ ఒకే తాటిపై నిలిచాయి. ఏ పార్టీ కూడా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి రాజకీయ సంకల్పం చూపలేదు. బీసీలను ఓటు బ్యాంక్ రాజకీయాలకు ఉపయోగించుకోవడమే తప్ప, అధికార భాగస్వామ్యాన్ని ఇవ్వాలనే మనసు ఎవరికీ లేదని రుజువైంది. తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను పార్టీలన్నీ పక్కన పెట్టినప్పటికీ... బీసీ రిజర్వేషన్ల ఉద్యమజ్వాల బహుజనులంతా ఏకమయ్యేలా చేసింది. ఈ సందర్భంగా బీసీ ఎస్సీ ఎస్టీల విముక్తి సారథి డాక్టర్ విశారదన్ మహారాజ్ లేవనెత్తిన ప్రశ్నలు బీసీ ఉద్యమానికి పునాదిగా మారాయి. నిబద్ధత, చైతన్యంతో కూడిన బీసీ మేధావులను ఒకే తాటిపై నిలిపి, వారిని సంఘటిత ఉద్యమ శక్తిగా ఏకీకృతం చేశాయి. "ఎవరెంతో వారికి అంత వాటా" అనే మాన్యవార్ కాన్సిరాం చారిత్రక నినాదం మరోసారి గుర్తుచేసింది. ఈ నినాదంతో జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో వేలాది మంది బహుజనులను రోడ్లపైకి వచ్చేలా చేసింది. ఫలితంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బహుజనుల గెలుపుకు, నేడు జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ సీట్ల కేటాయింపుకు కారణమైంది. ఇది స్వరాజ్య నిర్మాణానికి వేయబడుతున్న పునాది రాళ్లు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గిరిజన తండాలను మినహాయిస్తే...జనరల్ స్థానాల్లో బీసీలు 50 శాతంపైగా గెలిచారు. మొత్తం బీసీ ఎస్సీ ఎస్టీలు 86.4 శాతం గెలవడం అతిపెద్ద సామాజిక విజయం. ఈ విజయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అన్ని రాజకీయ పార్టీలను కలవరపెట్టింది. ఇది పార్టీల దయ వల్ల కాదు, ప్రజల ఐక్యత, చైతన్యం, స్వీయ రాజకీయ అవగాహన వల్ల సాధించిన విజయం. ఈ ఫలితమే బహుజన శక్తి ఎంత ప్రభావవంతమో రాజకీయ పార్టీలకు అర్థమయ్యేలా చేసింది. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో బహుజనుల ప్రాధాన్యతను గుర్తుచేసేలా చేసాయి. ఈ క్రమంలో అన్ని రాజకీయ పార్టీలు ఒక్కసారిగా తమ వైఖరిని మార్చుకున్నాయి. ఇప్పుడు జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకే అత్యధిక ప్రాధాన్యమిచ్చాయి. బీసీలకు 50 శాతం కంటే ఎక్కువ టికెట్లు కేటాయించారు. పార్టీలన్నీ బీసీ ఎస్సీ ఎస్టీలకు కలిపి దాదాపు 80 శాతంపైగా టికెట్స్ ఇవ్వడం

జరిగింది. అధికార కాంగ్రెస్ తో పాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ కూడా బీసీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేశాయి. కాంగ్రెస్ పార్టీ 53.71శాతం సీట్లను బీసీలకు కేటాయించగా, విపక్ష బీఆర్ఎస్ కూడా దాదాపు 53.79 శాతం బీసీలను రంగంలోకి దించింది. ఇక బీజేపీ.. కాస్త తక్కువగా 49.89 శాతం సీట్లను బీసీలకు కేటాయించింది. ఇదిలా ఉండగా...బీసీల తర్వాత ఎస్సీ, ఎస్టీలకు పాలక, విపక్ష పార్టీలు రెండూ సమానంగా కేటాయించారు. ఈ సీట్ల సమాన కేటాయింపును పరిశీలిస్తే అగ్రకుల పార్టీలన్నీ వాట్సప్ గ్రూపులో మాట్లాడుకొని టికెట్లు ఇచ్చినట్టుగా ఉన్నాయి. వారంతా ఏకమై రాజకీయాలు చేస్తున్నారనీ అర్థమవుతుంది. ఈ మార్పు బహుజనులకు న్యాయం చేయాలనే నిజమైన చిత్తశుద్ధితో కాదు, ఆ పార్టీలు రాజకీయ నష్టాన్ని తప్పించుకోవాలనే భయంతోనే అని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇది ఎన్నికలకు ముందే బహుజన వాదం గెలిచినట్టే.

భవిష్యత్తు ఎన్నికల్లో బహుజనులే కీలకం

నేడు 42 శాతం బీసీ రిజర్వేషన్లు అధికారికంగా అమలు కాకపోయినప్పటికీ...మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు బీసీ ఎస్సీ ఎస్టీలకు మెజారిటీ టికెట్లు కేటాయించారు. ఇప్పటికే స్థానిక సంస్థల్లో 86 శాతం బహుజనులు గెలిచారు. ఈ గెలుపుకు గల ప్రధాన కారణం...బీసీ రిజర్వేషన్ల ఉద్యమం ఒక కారణమైతే...మరో కారణం బీసీ ఎస్సీ ఎస్టీల హక్కులు & రాజ్యాధికార జాక్ వేదికగా డాక్టర్ విశారదన్ మహారాజ్ కొనసాగిస్తున్న లక్ష కిలోమీటర్ల "మా భూమి" రథయాత్ర కీలకపాత్ర పోషించింది. ఈ యాత్ర ద్వారా అగ్రకుల కబంధహస్తాల కింద నలిగిపోతున్న తెలంగాణ రాజకీయాలను ప్రశ్నించాడు. మేమెంతో మాకంత వాటా అని గర్జిస్తూ బహుజన వర్గాల్లో ఉద్యమ చైతన్యాన్ని రగిలించాడు. గతంలో 10వేల కిలోమీటర్ల "స్వరాజ్య పాదయాత్ర" ద్వారా సబ్బండ కులాల్లో రాజకీయ స్పృహ రగిలించి, సంఘటిత పోరాటానికి బాట వేశాడు. ఈ చైతన్యం మొన్న స్థానిక సంస్థల్లో, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. ఇది ఏ ఒక్క పార్టీ యొక్క ఔదార్యం కాదు, బహుజన వాదం తెచ్చిన రాజకీయ భూకంపమే. ఇప్పుడు బహుజన సమాజాన్ని విస్మరించి ఇక రాజకీయాలు నడవవని పార్టీలకు అర్థమైంది. తెలంగాణ రాష్ట్రంలో బహుజన వాదం ఇప్పుడు డిమాండ్ స్థాయిని దాటి, రాజకీయ అజెండాగా మారింది. ఇది బీసీ ఎస్సీ ఎస్టీల సంఘటిత ఉద్యమాల విజయం. ప్రస్తుత రాజకీయ పరిస్థితిలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలు సైతం బీసీ ఎస్సీ ఎస్టీ లకే అనుకూలంగా ఉండే సంకేతాలు స్పష్టంగా కనబడుతున్నాయి. టికెట్ల కేటాయింపుతోనే బహుజన వాదం సాధించిన ఈ ముందడుగు, రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాలను కొత్త దిశగా మలిచే శక్తిగా మారనుంది. భవిష్యత్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల వరకు ఉప్పెనలాగా ఎగిసి పడే అవకాశం లేకపోలేదు.

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

తెలంగాణా భాషకి, సంస్కృతికి పట్టం కట్టిన అన్నవరం దేవేందర్ 'అట్లనే'

సంకేపల్లి నాగేంద్రశర్మ
8074826371

అన్నవరం దేవేందర్ సాహిత్యం, ప్రత్యేకించి వారి కవిత్వం అంటే ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో తెలువని సాహితీప్రియులెవ్వరూ లేరు. ఆయన నిత్యకవితా వసంతులు. పైగా సాహితీ సంచారి, సమకాలీన సమాజాన్ని, సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ వారు చేస్తున్న రచనలు చైతన్యవంతమై ఉంటాయి. వారి రచనలపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఎంతో మంది వారి సాహిత్యంపై స్పందిస్తూ అభిప్రాయాలు, వ్యాసాలు పుష్కలంగా రాశారు. షష్టి పూర్తి నిండిన అనుభవం రంగరించి కాలమిస్ట్ గా కూడా పాలీని కదుపుతుంటారు. గత మూడు న్నర దశాబ్దాల నుండి అనవ్రతంగా దేవేందర్ తెలంగాణాకే సొంతమైన ప్రత్యేకమైన పరిభాషతో కవిత్వం రాస్తున్నారు. కవిత్వంతో పాటు, కథలు, సాహిత్య, సామాజిక వ్యాసాలు, పుస్తక సమీక్షలు, యాత్రా వ్యాసాలు, తన సాహితీ సోపతి ద్వారా పలు పుస్తకాల ప్రచురణలు, సాహిత్యకార్యక్రమాలు నిర్వహిస్తూ తన వంతు పాత్రను తెలుగు, తెలంగాణా సాహిత్యంలో సమర్థవంతంగా సవ్యసాచిగా పోషిస్తున్నారు. తెలంగాణా మలి ఉద్యమంలో దశాబ్దంన్నర పాటుగా కీలక పాత్రనే పోషించారు. తెలంగాణా రచయితల వేదికలో ఒక గుండె కాయగా నిలిచారు,

కరీంనగర్ సాహితీ గౌతమి వారి ప్రతిష్టాత్మకమైన 202021 డా.సినారె కవితా పురస్కారంతో పాటుగా, 2025లో విశిష్టమైన దాశరథి కృష్ణమాచార్య సాహిత్య పురస్కారాన్ని, తెలంగాణా ప్రభుత్వం నుండి అందుకొన్నారు. అన్నవరం దేవేందర్ తొలి నాళ్ళలో హుస్నాబాద్ నుండి పాత్రికేయునిగా కొన్నాళ్ళు పనిచేశారు. అటు పాత్రికేయునిగా జీవితం ప్రారంభించి, తదుపరి పంచాయతీ రాజ్ శాఖలో మూడు దశాబ్దాల పాటు ఉద్యోగించి పర్యవేక్షకుని హోదాలో పదవీ విరమణ చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం, తెలంగాణా సారస్వత పరిషత్తు, 2006లో ఉమ్మడి ఎపి ఉగాది పురస్కారం,అందుకొన్నారు. కరీంనగర్ లో గత ఏడాది మే 25న కేంద్ర సాహిత్య అకాడమీ వారు నిర్వహించిన కవిసంధి కార్యక్రమం అన్నవరం కవిత్వంతోనే ముఖాముఖిగా కొనసాగింది. అన్నవరం కవిత్వ జీవితంలో ఇదొక ప్రత్యేక గుర్తింపు. వీరు రాసిన



తొవ్వ, నడక, మంకమ్మతోట లేబర్ అడ్డా, బొడ్డు మల్లె చెట్టు, పొద్దు పొడుపు, పొక్కిలి వాకిళ్ళ పులకరింత, ఇంటి దీపం, వరి గొలుసులు, గవాయి, జీవన తాత్పర్యం, తో పాటుగా రెండు బృహత్ కవితా సంకలనాలు, బువ్వ కుండ దీర్ఘకవిత్వం, బుద్దపర్కలు నానీలు రాశారు. ఇవన్నీ వారికి ప్రత్యేక గుర్తింపు తేవడమే కాకుండా, పులు పురస్కారాలను తెచ్చి పెట్టాయి. వీరి రచనలు ఆంగ్లం, ఇతర భాషల్లోకి పరావర్తనం చెందాయి. అలాగే మరోకోణం, ఊరి దస్తూరి, సంచారం, అంతరంగం వంటి కాలమిస్ట్ గా రాసిన వ్యాసాలను పుస్తకాలుగా విడుదల చేశారు. అన్నవరం వారి కుటుంబంలో సాహిత్య కళాపోషణ అజారామరం. సతీమణి రాజేశ్వరి కథకురాలుగా, సోదరుడు శ్రీనివాస్ ఉత్తమ చిత్రకారునిగా సోదరి నాంపల్లి సుజాత కవియిత్రిగా రాణిస్తున్నారు. నాన్నగారైన దశరథం గారు ప్రభుత్వ టీచర్ గా పనిచేశారు. చిత్రకారునిగా సుపరిచితులు. అన్నవరం ఇటీవల విడుదల చేసిన అట్లనే కవితా సంకలనంలోని కవిత్వాలు హిమాలయాలలో అరుదుగా పూసే బ్రహ్మకమలాల లాంటి పుష్పాలు విచ్చుకొన్నట్లుగా ఉన్నాయి. వీరి కవిత్వంలో వస్తువు, శిల్పం, భావం, అభివ్యక్తి పోటీ పడుతూ మనతో సూటిగా మాట్లాడుతూ ఉంటాయి. అట్లనే గూర్చి ప్రముఖ రచయిత ప్రసేన్ వెనుక కవర్ పుట లో ప్రస్తావిస్తూ, జ్ఞాపకాలు, చావు కబుర్లు, కన్నీటి బొట్లు, ఊర్లు యమధర్మ దారులయ్యాయి, , అట్ల నే అంటే అంగీకారం, తలూపినట్లు కాదని, ధిక్కారమని, ఒక సవాల్ అని చెప్పారు. ఇలా భిన్నాభిప్రాయాన్ని సాకల్యంగా వివరించారు. ముఖచిత్రమే కాక, ప్రారంభ, చివరి పేజీలలో సోదరుడు కుంచెకారుడైన శ్రీనివాస్ వేసిన మరో రెండు చిత్రాలు నలుపు తెలుపులో కనిపిస్తూ, కవిత్వాలకు చిర్నునామాలుగా ప్రతిబింబంగా



అన్నవరం దేవేందర్

ఉన్నాయి. అవి కావ్యానికి వన్నె తెచ్చినట్లుగా ఉంది. చదువరులను ఆలోచింపజేస్తుంది. అట్లనే దాగి ఉన్న కవిత్వాల కొసర్లు కనిపించేలా వేసినట్లు కనిపిస్తుంది. వెనక పుటలో కావ్యకర్త నవ్వును పట్టుకొన్న ఒక చక్కటి ఫోటో కనిపిస్తుంది. అది తెలంగాణా సాహిత్యంలోని ఆణిముత్యాన్ని ఒడిసి పట్టినట్లుగా కనిపిస్తది. తెలంగాణా ప్రత్యేక అస్తిత్వ దరహాసం కవి నవ్వుల్లో పలికించేలా ఉంది. దీన్ని సహచర కవి పెనుగొండ బసవేశ్వర్ బంధించారు. ఇందులో కవిత్వం అనేక కోణాల్లో, వస్తు వైవిధ్యంగా పొర్లింది. నడక తీరే రమ్యంగా ఉంటుంది. అట్లనే గిట్లనే వాదాలను, సవాళ్ళను రేకెత్తిస్తుంది. బాల్యం నుండి యవ్వనంలోకి, వృద్ధాప్యపు దిశల్లోకి తీసుకెళ్ళే ఒక ఆకారాకృత కవిత్వాల పరిణామక్రమం కనబడుతుంది. కవి స్వకీయ జీవితం, జీవన విధానాలలోని మార్పులు, చేర్పులు, నివాసాలు, పెరుగుతున్న వయస్సుకు మారిన అలవాట్లు, ఇందులో పెద్ద పీట వేసుకొన్నాయి. క్రోధినామ ఉగాదిపై కూడా కవిత్వం రాశారు. మల్లవ్వా, మల్లవ్వా ..కండ్ల నిండ దు:ఖం పొంగంగా.. గద్గగ స్వరమైన పెనిమిటి పిలుపు..వంగి చెవిలో ఎన్ని సార్లు ఒర్లినా... ఆమెకు తప్ప అందరికీ వినవస్తుంది. దింపుడు కళ్ళెం కవిత్వంలో చనిపోయిన భార్య గూర్చి భర్త పొగిలి పొగిలి ఏడ్పును, ఆందోళనను, అక్కడి విషాద దృశ్యాన్ని కళ్ళకు కట్టినట్లు అవిష్కరించారు. జుట్టు పట్టి కొట్టుకొంటూ ఈడ్చిన ఊరేగింపు..దేశ దేహమ్మీద పారుతున్న మత్తు మరక గీత.. అంటూ మణిపూర్ లో రెండు జాతుల మధ్య జరుగుతున్న అల్లర్ల హింసాదృశ్యాలను దిగంబరం కవిత్వంలో ఆవిష్కరించారు. హనుమాళ్ళ దగ్గిర ఫలారంల్లో పిలుపు/పోచమ్మ గుడిలో ఉల్లిగడ్డలు ఏరే సంబురం అంటూ తెలంగాణా భాషా పదాల ముల్లెను మరింత నవ్యతగా విప్పుతూపోతాడు. రాత్రిళ్లు దేహాన్ని ఆవరించిన చలి/పొద్దు పొడుపుతో పొరలు పొరలుగా తరలి పోయింది/అప్పుడు సూర్యుని భుజం మీద చేయి వేసినంత వెచ్చగ// అంటాడు జీవగడియారంలో తన ఆరోగ్యపు రహస్యాన్ని చెబుతాడు. మనసుకొక తత్వం దేహానికొక సూత్రం/వైరుధ్యాల మధ్య చెలాయించుడే జీవితం\\ అని వైవిధ్యం కవిత్వంలో ఒక్కొక్కరి దేహవైవిధ్యాలు ఎట్లా ఉంటాయో రాస్తాడు. ఆరోగ్యానికి నడక అవసరాన్ని చెబుతాడు. నిత్యం కలిసి నడిచే పాదచార స్నేహాలు \\ నొసట మీద చెమట చుక్కలు\నవ్వు ముఖాలు, కనులతోనే సంభాషణలు అని తీరొక్కరీతిగా చెబుతాడు. మైదానానికి రాకపోకల సమయాలు/ధరించే టీ షర్టు ప్యాంటూ ఆహార్యం/ బూట్ల చప్పుళ్ళు/ముసి ముసి చీకట్లోనైనా ఎరుక పడుతామని వాకింగ్ గ్రౌండ్ అనే కవిత్వంలో వాకర్ ఆహార్యాన్ని రాస్తాడు. తెలంగాణా భాషామార్గాన్ని సుగమం చేస్తూనే ఆంగ్ల పదాలు కవిత్వంలో అక్కడక్కడా వాడడం కనిపిస్తుంది. వైవిధ్యాల జీవ కవిత్వరేఖలు సప్తవర్ణ శోభితంగా మెరుస్తూపోతుంటాయి. ఒక గ్రామీణుడి నిజాయితీ, అమాయకత్వాన్ని నిమ్మలం కవిత్వంలో సౌందర్యీకరిస్తాడు. సదిరిందే సదిరినట్లు కనిపిస్తది/ పని యత్మినాన్/ ఫర్ఫెక్ట్ గా అయితది/ అమాయకత్వం అంగీతో చిన్నగా నవ్వుతుండు మల్లయ్య బాపు అంటూ నామవాచకంతో కవిత్వానికి మానవీయతలను, మార్మిక గ్రామీణ నమ్మకత్వాల్ని పాయింటవుట్ చేసి చూపిస్తాడు. నాలుగు పేజీల దీర్ఘ బడి కవిత్వంలో తాను చదువుకొన్న ఊరి జ్ఞాపకాలను నెమరువేసుకొంటాడు. నోస్టాల్జియాలోకి వెళ్ళుతాడు. బాల్యం నాటి ఊరు, వాడలు, దారులు, మనుష్యులు కనబడకుండా మారిపోయాయని చెబుతాడు. తన ఊరు, బడి వాతావరణాన్ని యాజ్జేసుకొంటూ హుస్నాబాద్ అంటే ఎల్లమ్మ తీర్థం, సర్వాయి పాపన్న కొండ, మాందాపురం గుట్టల్లోని అమరత్వం, త్యాగాలు ఇత్తనాలు అలికిన నేల అంటూ బడి చదువులకు ముడి పెట్టి రాస్తాడు. తెలంగాణా ఉద్యమానికి దీపస్తంభంగా నిలిచిన హైదరాబాద్ ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ గూర్చి రాస్తూ, వీర తెలంగాణమా అని ఎత్తుకొని, పాట పదం లయలు, లయలుగా సుడులు, పాదాలు కంపిస్తున్నట్లుగ సన్నని విద్యుల్లతలు అంటాడు. సంలీనం అనే కవిత్వంలో సాయుధ రైతాంగ పోరాటం గూర్చి రాస్తూ, తెలంగాణాకు జరిగిన అన్యాయాల్ని, తిరుగుబాటు చరిత్రాంశాల్ని విప్పుతాడు. ఒడంబడిక వ్యూహంతో చేతులెత్తిన రాజ్యం/ లొంగి పోయిన నిజాం రెపరెపలాడిన త్రివర్ణం అని అంటాడు. ఎవరి తలకాయలు వారి ఆధీనంలో లేవు/ అనాదిగా కొనసాగుతున్న తాంత్రికత// పద్ధతిగా అబద్దాన్ని చెవుల్లోకి ఎక్కింపు// కండ్ల చుట్టూరా చీకటి వలయాలు/పైగా వెలుతురు అని దబాయింపు// అని కార్యచరణ అనే కవిత్వంలో నేటి కంపు రాజకీయాల వాస్తవ కాల రేఖల్ని హెచ్చరిస్తూ చెబుతాడు. కవికున్న హక్కును అట్లనేలో సార్థకం చేసుకొన్నాడు. కవిత్వానికి సామాజిక స్పృహ,ప్రయోజనం ఉండాలి. సోయితో కదలాలి, తగిన కార్యచరణ ఉండాలన్న సిద్ధాంతంతో అట్లనే తీర్చబడింది. విప్లవ, సామాజిక సామాన్య శాస్త్రం, కవి అన్నవరం దేవేందర్ రాసిన అట్లనే అద్వితీయ షడ్రుచుల పాకం. మిత్రునికి అభినందనలతో....

పుస్తక సమీక్షకులు రచయిత, కరీంనగర్

అట్లనే కవితా సంకలనంలో 59 కవితలను, 112 పేజీలలో హృద్యంగా రాశారు. చాలా వరకు కవితలన్నీ సందర్భానుసారంగా రాసినవి. వివిధ పత్రికల్లో అచ్చుకు నోచుకొన్నవి, ముఖపుస్తకంలో చేర్చినవి ఉన్నాయి. సోదరుడు శ్రీనివాస్ వేసిన ముఖచిత్రం శోభాయమానంగా ఉంది. ఈ సంకలనాన్ని కరీంనగర్ జీవగడ్డ దినపత్రిక పాత్రికేయ మిత్రుడు, రాష్ట్ర జర్నలిస్టుల సంఘం నాయకుడు, తెలంగాణా తొలి ప్రెస్ అకాడమీ చైర్మన్ గా పనిచేసిన అల్లం నారాయణకు అంకితం ఇచ్చారు. సంకలనం పేరు అట్లనే అంటూనే, విషయ సూచిక కు ఇట్లనే అని పేరు పెట్టారు. అట్లనే పేరు పెట్టడంలో అనంతార్ధాలను స్ఫురిస్తాయి. సమాజం పట్ల బాధ్యతాయుతంగా మంచి చెడులను బేరీజు వేసే తూకం లాంటి కవిత్వాలు వైవిధ్యంగా కనిపిస్తాయి. ఒక ధిక్కార, అంగీకార, అనంగీకార స్వరాలు పలు వాదాలతో, ఇతిహాసాలతో పలుకుతాయి. అరవై నిండిన కవిత్వంలో సమాజం పట్ల ఉన్న కవి బాధ్యతలు, తపన, ఆర్తి తెలియవస్తాయి. అసలు టైటిల్ కవిత్వం కనిపించదు. ప్రతి కవిత్వంలో అట్లనే, గిట్లనే అనే ఇతివృత్తం జబర్దస్తీగా ధ్వనిగా పలుకుతుంది. ఇలా ఈ పొత్తంలో వింతలు, విశేషాలు పరిశీలిస్తే బోలెడు కనిపిస్తాయి. ఇలా కవి తన స్వేచ్ఛా సమయాన్ని సాధికారిక నవ్యత్వాన్ని ప్రదర్శించడం ఇందులో కనిపిస్తుంది.

ప్రాంతీయం

కాసులకు కక్కుర్తి.. క్లాసులకు అనుమతి

- పెచ్చుమీరుతున్న ప్రైవేటు విద్యాసంస్థల అక్రమాలు
- నిబంధనలు ఉల్లంఘనలు ఏమాత్రం పట్టని విద్యాశాఖ
- తెలిసీ... కళ్లు మూసుకున్న అధికారులు?
- అక్రమాలపై మీడియాలో కథనాలు
- వివరణ కోరితే అధికారుల నిర్లక్ష్యపు సమాధానం

ప్రతిపక్షం సిటీబ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 9: బండ్లగూడ మండలంలో అనేక ప్రైవేట్ పాఠశాలలు జీవో నెంబర్ వన్ అమలు చేయకుండా విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్నా విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ఎలాంటి నిబంధనల ఉల్లంఘనలు జరిగినా, విద్యార్థుల భవిష్యత్తు ఏమైనా పర్వాలేదు అనే విధంగా విద్యాశాఖ అధికారుల తీరు ఉందని బాహాటంగానే విమర్శలు వినబడుతున్నాయి. కాసులు ఇస్తే చాలు ఎటువంటి అనుమతులైన మంజూరు చేస్తున్నారని, డిప్యూటీఈఓ కార్యాలయం అధికారులపై అనేక విమర్శలు వెల్లువెత్తున్నాయి. బండ్లగూడ మండల పరిధిలో ప్రైవేట్ స్కూల్స్ పై వచ్చే ఫిర్యాదులు పట్టించుకోకుండా, కాలయాపన చేస్తున్నారు. అధికారుల తీరుపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఇటీవల ఇదే కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు కూడా జరిగాయి. డిప్యూటీ ఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కడం చర్చనీయాంశంగా మారింది. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారి చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

అనుమతులు లేకున్నా సీబీఎస్ఈ తరగతులు

బండ్లగూడ మండలం ఫలక్నామా ప్రాంతంలో నారాయణ స్కూల్ అనుమతులు లేకున్నా సీబీఎస్ఈ కరక్యులమంటూ యథేచ్ఛగా తరగుతులు నిర్వహిస్తూ, విద్యార్థుల నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు వాపోయారు. అధిక ఫీజులకు తోడు నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలోనే పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులకు అదనంగా వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై బండ్లగూడ మండల డిప్యూటీ ఈవోను వివరణ కోరగా పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముగాస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

చర్యలు తీసుకోకుండా ఐఓఎస్ కాలయాపన

ఇక బండ్లగూడ మాస్టర్‌మైండ్స్ పరిస్థితి మరీ దారుణం. పాఠశాల ఉన్న భవంతి లోనే కింద ఓ మల్టీ క్యూసియన్ రెస్టారెంట్ ఉండడం విద్యార్థుల భద్రతను ప్రశ్నిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా అదే భవంతిలో పాఠశాలను నిర్వహించడమే కాకుండా అనుమతులు లేకుండా సీబీఎస్ఈ తరగతుల నిర్వహిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతునారు. నగరంలో జరుతున్న అగ్నిప్రమాద ఘటనల నేపథ్యంలో ఈ పాఠశాల విద్యర్థుల భద్రతను విద్యాశాఖ అధికారులు గాలికి వదిలేశారని విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ విషయమై 'ప్రతిపక్షం' దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైనా బండ్లగూడ మండల ఐఓస్(ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్) చర్యలు తీసకుంటామని చెబుతూనే కాలయాపన చేస్తున్నారు.

చిట్యాల అభివృద్ధికి పునరంకితం

- ఎమ్మెల్యే వేముల వీరేశం హామీ

ప్రతిపక్షం, చిట్యాల, ఫిబ్రవరి 9: చిట్యాల పట్టణ సమగ్ర మార్పు కోసం ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విజ్ఞప్తి చేశారు. నల్గొండ జిల్లా, చిట్యాల మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక కనకదుర్గ కూడలిలో చివరి రోజు సోమవారం జరిగిన సభలో మాట్లాడారు. చిట్యాలలో 12 కు 12 వార్డులు గెలిపించి పట్టణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తానని కీలక హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటానని, నిరంతరం ప్రజల పక్షాన నిలిచే వ్యక్తిగా గుర్తింపు పొందుతానని స్పష్టం చేశారు. చిట్యాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్న ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శలను స్వీకరిస్తూ... చర్చకు రావాలని సవాల్ చేశారు. చిట్యాల అభివృద్ధికి ఇటీవల 15 కోట్లు నిధులు తీసుకురావడంతోపాటు, రెండున్నర సంవత్సరాల్లో ఏఏ పద్దుల కింద ఎన్ని కోట్లు నిధులు సాధించానో జీవోలు, పత్రాలను సభలో ప్రజలకు చూపించారు. బీఆర్ఎస్ పార్టీని నమ్మటం లేనందునే అబద్ధపు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారని వేముల విమర్శించారు. ఈ సభలో అభ్యర్థులతో పాటు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నార్సింగిలో కబ్జా చెర నుంచి పార్కుకు విముక్తి

- 60 కోట్ల విలువైన భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 9: రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం, నార్సింగి విలేజ్, ఆరుణోదయ హౌసింగ్ సొసైటీలోని పార్కును కబ్జాల చెర నుంచి సోమవారం హైడ్రా విముక్తి కల్పించింది. నార్సింగ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాయానికి చేరువులో అరుణోదయ కాలనీ హుడా అనుమతి పొందిన లేఔట్లో 6078 గజాలు పార్కు కోసం కేటాయించారు. ఈ పార్కు స్థలంపై స్థానికంగా ఉన్న వారి కన్ను పడింది. ఇప్పటికే 3 వేల గజాల వరకూ అక్రమ నిర్మాణాలు వచ్చేశాయి. మిగిలిన 3 వేల గజాల పార్కు స్థలంలో 1600ల గజాలను స్థానికంగా ఉన్న వ్యక్తి కబ్జా చేశారు. ప్రీకాస్ట్ ప్రహరీ నిర్మించి.. అందులో షెడ్డులు వేశారు. ఈ 1600ల గజాల ఆక్రమణలపై గతంలో నార్సింగ్ మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకున్నారు. నిర్మాణాలను తొలగించారు. అయినా కబ్జాలు ఆగలేదు. నార్సింగి మున్సిపాలిటీ ఇప్పుడు జీహెచ్ఎంసీలో కలవడం.. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే ఇదే అదనుగా మళ్లీ 1600ల గజాలను తన స్వాధీనంలో ఉంచుకున్నాడు. చుట్టూ ప్రీకాస్ట్ ప్రహరీ నిర్మించి.. లోపల తాత్కాలిక షెడ్డులు కూడా కట్టాడు. ఈ కబ్జా పూర్వాపరాలను వివరిస్తూ స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పార్కు స్థలంగానే నిర్ధారించుకున్నారు. మొత్తం పార్కు స్థలం 6078 గజాలు కాగా.. 3వేల గజాల వరకూ అక్రమ కట్టడాలు వచ్చేశాయి. మిగిలిన 3వేల గజాలను హైడ్రా సోమవారం కాపాడింది. పార్కు హద్దులను నిర్ధారిస్తూ చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. అలాగే పార్కు కోసం కేటాయించిన స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

ప్రజా ప్రభుత్వంతోనే
మున్సిపాలిటీల అభివృద్ధి

- రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, ఫిబ్రవరి 9: రాష్ట్రంలో మున్సిపాలిటీల అభివృద్ధి, ప్రజల సంక్షేమం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన గనులశాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు. గత మూడు రోజులుగా చెన్నూరు, క్యాతన్‌పల్లి మున్సిపాలిటిలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరుపున ఆయన విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ గృహాలు, డబుల్ బెడ్‌రూం పంపిణీ గురించి చెబుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తేనే మున్సిపాలిటీలు అగ్రగాభాగాన ఉంటాయని మంత్రి అన్నారు. సోమవారం క్యాతన్‌పల్లి మున్సిపాలిటిలో కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ బీఆర్ ఎస్ పదేళ్ల పాలనలో మున్సిపాలిటీలు మురికి కూపాలుగా మారాయన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ హయాంలో ఇసుక దందా, భూ దందాలతోపాటు విచ్చలవిడిగా ఉండేవని, ప్రజలు భయభ్రంతులకు గురయ్యారన్నారు. కాంగ్రెస్ గెలవడంతో ఉక్కుపాదంతో అణచివేశామని తెలిపారు. ఇదీ నచ్చక ఆ దందాలు చేసేవారు తిరిగి బీఆర్ఎస్‌లో చేరారని విమర్శించారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటిలో ఇప్పటికే 40 కోట్లకుపైగా పనులు నడుస్తున్నాయని, అదే విధంగా మరో 40 కోట్లతో కేంద్ర అమృతస్కీం కింద పైపులైన్ పనులు జరుగుతున్నాయన్నారు. చెన్నూరులో కూడ దాదాపు 20కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ రెండు సంవత్సరాల్లో మున్సిపాలిటిలో 250 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. మొత్తం నియోజకవర్గంగా 700 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రధానంగా కోట్టపల్లిలో 200కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలతోపాటు, 50కోట్లతో అడ్వాన్‌టెక్నాలజీ సెంటర్, ఉన్నాయని తెలిపారు. గతంలో ఇక్కడ ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌కు సింగరేణి డీఎంఎఫ్‌టీ నిధులు తీసుకెళ్లడానికి సహకరించారని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో బొక్క బోర్ల పడ్డ బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఈ ఎన్నికల్లో సైతం ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమని అన్నారు. ఎన్నికల వేల ప్రజలు ఆ రెండు పార్టీలు ఏది ఇచ్చిన తీసుకోవాలని నిరంతరం అండగా నిలువడంతోపాటు చేతిలో చేయి వేసి భరోసా కల్పించే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తెలిపారు. రాష్ట్రంలో 90 శాతం మున్సిపాలిటీలు కార్పొరేషన్‌లో విజయం తమ పార్టీదేనని తెలిపారు. మంత్రి వెంట పార్టీ జిల్లా అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, ఆయా వార్డుల్లో పోటి చేస్తున్న అభ్యర్థులు ఉన్నారు.

వార్డు అభివృద్ధే లక్ష్యం

- 20వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కనగాల్ల శోభరాణి రాజు

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 9 : 20వ వార్డు అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని కౌన్సిలర్ అభ్యర్థి కనగాల్ల శోభరాణి రాజుతెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "వార్డులో తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తాను. ప్రతి ఇంటి సమస్య నా సమస్యగా భావించి పని చేస్తాను" అని అన్నారు.యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు సంక్షేమ పథకాలు, వృద్ధులకు అవసరమైన సదుపాయాలు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలతో నేరుగా సంప్రదింపులు కొనసాగిస్తూ పారదర్శక పాలన అందించడమే తన లక్ష్యమని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంతో 20వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని ధీమా వ్యక్తం చేశారు.

యువతకు అవకాశం ఇవ్వండి

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 9: యెన్కెపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా మధ్యపాగు మహేష్‌స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగారు. ఈ సందర్భంగా ఆయన వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను ప్రత్యక్షంగా కలిసి తమ అభిప్రాయాలను తెలుసుకున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా ప్రజల ఆశీర్వాదాలతో మీ ముందుకు వస్తున్నానని, గౌను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. రాజకీయాలకు అతీతంగా, కేవలం అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలనే ఉద్దేశంతోస్వతంత్రంగా పోటీ చేస్తున్నట్లు మహేష్ తెలిపారు. వార్డులో నెలకొన్న తాగునీటి సమస్య, డ్రైనేజీ, రహదారులు, పారిశుధ్యం, వీధి దీపాల వంటి మౌలిక సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన అజెండా అని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా యువత సమస్యలపై ప్రత్యేక దృష్టిసారిస్తానని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం కృషి చేస్తానని చెప్పారు. "యువతకు ఒకసారి అవకాశం ఇవ్వండి" అంటూ ప్రజలను అభ్యర్థించిన మహేష్, నిజాయితీగా పనిచేసే అవకాశం ఇస్తే 11వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని భరోసా ఇచ్చారు. ప్రజల మద్దతుతో విజయం సాధించి, ప్రతి సమస్యపై వెంటనే స్పందించే కౌన్సిలర్‌గా నిలుస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే
వార్డుకు రూ.8కోట్లతో అభివృద్ధి పనులు

- సీఎం రేవంత్ రెడ్డి వద్దకు రూ.208కోట్ల నిధులు తీసుకొస్తా
- కిరాయి ఇళ్లలో ఉండే వాళ్లకూ ఇంటి స్థలాలు ఇప్పిస్తా
- రూ.150కోట్లతో చేసి రెండేళ్లలో సదాశివపేట మున్సిపాలిటీకి మంజీరా నీళ్లు
- ముఖాముఖిలో వివరించిన జగ్గారెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 9: సదాశివపేట మున్సిపాలిటీలో గాంధీ చౌక్ వద్ద టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్థానిక ప్రజలతో ముఖాముఖి సమావేశమయ్యారు. టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డితో పాటు పార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జి జూలకంటి ఆంజనేయులు, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రామ్ రెడ్డి తదితరులతో కలిసి ప్రజలతో మాట్లాడారు. వారి అభిప్రాయాలు, అభ్యర్థనలు విన్నారు. తాను ఎమ్మెల్యేగా వున్నా, లేకున్నా ప్రజలకు పనులు చేసి పెడతానని స్పష్టం చేశారు. తన మనసులో ఉన్న మాటలను సూటిగా ప్రజలకు వివరించారు. సదాశివపేట మున్సిపాలిటీలోని 26వ వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే అన్ని మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తానన్నారు. ''2013లో నేను సదాశివపేట పట్టణంలోని నిరుపేదలకు 5,500 ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు ఇప్పించాను. కానీ ఈ ఊరి లీడర్ పోలీసులను పెట్టి ఇంటి జాగాల్లోకి రాకుండా పేదలను తరిమేశారు. పదేళ్లు కేసీఆర్ సీఎంగా, హరీష్ రావు ఆర్థిక, వైద్య, నీటి వనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన అడిగితే అధికారులు ఆగమేఘాల మీద పనులు చేసి పెట్టే పరిస్థితి ఉండేది. అయినా సదాశివపేట మున్సిపాలిటీలో ఏ ఒక్క పనీ చేయలేదు. 2014 కంటే ముందు తాను చేసిన పనులే ఇప్పటికి ఉన్నాయి. 2023 ఎన్నికల్లో నన్ను ఓడించేందుకు హరీష్ రావు సంగారెడ్డికి రూ.27 కోట్లు పంపించారు. నేను ఎమ్మెల్యేగా గెలిచినా, గెలవకపోయినా ప్రజలకు పనులు చేసి పెడుతూనే ఉంటాన''ని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ''తట్టుకోలేని కష్టం వస్తే నా ఇంటి తలుపు తట్టండి. వైద్య సహాయం, ఇతరత్రా అవసరాలు తీవ్రస్థాయిలో ఉంటే తప్పకుండా నా వద్దకు రండి. మీకు నా చేతనయినంత సహాయం చేస్తాను. ఎవరైనా కష్టాల్లో ఉంటే సహాయం చేస్తుంటాను. నా తల్లిదండ్రులు అట్లాంటి పుట్టుకను ఇచ్చారు. నేను మాటలు ఓట్ల కోసం చెప్పడం లేదు. నేను రోజూ పాలిచ్చే ఆవు లాంటివాడిని. రోజూ పాలిచ్చే ఆవు కావాలా? ఐదేళ్లకోసారి పాలిచ్చే ఆవు కావాలా? ''అంటూ జగ్గారెడ్డి ప్రజలను అడిగారు. సదాశివపేట మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకునేందుకు వీలుగా 26 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోండి అంటూ ఆయన సూచించారు.

పెండ్లి వేడుకలో విషాదం

- స్విమ్మింగ్ పూల్ లో పడి బాలుడి మృతి!

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 9: బంధువుల పెండ్లికి రిసార్టుకు వచ్చిన ఓ కుటుంబంలో విషాదం అలుముకుంది. మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ప్రకాశ్ సింగ్ కుటుంబ సభ్యులతో అజీజ్ నగర్ లోని మృగవని రిసార్ట్ లో సోమవారం జరిగిన బంధువుల పెండ్లి సంగీత్ వేడుకలకు హాజరయ్యారు. ప్రకాశ్ సింగ్ కుమారుడు సూర్య ప్రకాశ్ సింగ్ (10) తోటి పిల్లలతో ఈగ కొట్టేందుకు దిగి నీట మునిగాడు. వెంటనే బంధువులు మొయినాబాద్ లోని భాస్కర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకునే లోపే నిర్వాహకులతో పాటు బంధువులంతా అక్కడినుండి వెళ్లిపోయారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలుస్తోంది.

ఇటీవలి కాలంలో ప్రేమలు విఫలమవ్వడంతోనే అధికంగా ఆత్మహత్యలు జరుగుతున్నాయి. కుటుంబ కలహాలు, వివాహేతర సంబంధాలతోనూ ఆత్మహత్యలు పెరిగాయి. వీటిపై ఉన్నత స్థాయిలో అధ్యయనం చేసి మరణాలు అరికట్టాలి. ప్రభుత్వ అవగాహనతో లోన్ యాప్ ఆత్మహత్యలు తగ్గాయి. రాష్ట్రంలో గంజాయి సాగు జీరో పర్సెంట్ వచ్చింది.

- ఏపీ హోంమంత్రి అనిత

ప్రాంతీయం

పోలింగ్ నిర్వహణను నిశితంగా పరిశీలించాలి

- జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్
- ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన అవసరం
- అడిషనల్ కలెక్టర్ పాండు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 9 : ఎన్నికలలో అత్యంత కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని మైక్రో అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించాలని జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్ సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు తు.చ తప్పకుండా అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆయన హితవు పలికారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సూక్ష్మ స్థాయిలో పరిశీలించేందుకు నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఎన్నికల సాధారణ పరిశీలకులు ఉదయ్ కుమార్ హాజరై మైక్రో అబ్జర్వర్లకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్లు పరిశీలకులుగా మాత్రమే వ్యవహరించాలని, ఓటింగ్ మరియు కౌంటింగ్ రోజుల్లో పూర్తిస్థాయి ప్రక్రియను గమనించి, గమనించిన అంశాలపై నివేదికలను లిఖితపూర్వకంగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. మైక్రో అబ్జర్వర్లు తమ విధులు, బాధ్యతల పరిధిలోనే పనిచేయాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ, సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరించి ఆయా మున్సిపాలిటీల పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లకు బాధ్యతలు కేటాయించడం జరుగుతుందన్నారు. పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై మైక్రో అబ్జర్వర్లు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను సమర్థవంతంగా పరిశీలించగలుగుతారని అన్నారు. పోలింగ్ ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకంగా జరుగుతోందా లేదా అన్నది నిశితంగా పరిశీలించాలని, గమనించిన అంశాలను వెంటనే జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోలింగ్ పూర్తయ్యే వరకు అన్ని అంశాలను జాగ్రత్తగా గమనిస్తూ, ఓటింగ్ గోప్యతను కాపాడే విధంగా మైక్రో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్ మైక్రో అబ్జర్వర్ల విధులు, బాధ్యతలు , తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ శిక్షణ తరగతుల్లో ఎన్నికల శిక్షణల నోడల్ అధికారి రామాచారి, డీఈఓ వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ నర్సింగ్, మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్, మైక్రో అబ్జర్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తేనే అభివృద్ధి

- ఎమ్మెల్యే నవీన్ యాదవ్

ప్రతిపక్షం,హుజురాబాద్, ఫిబ్రవరి 9 : కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తేనే మున్సిపాలిటీల్లో అభివృద్ధి నిరాటంకంగా కొనసాగుతుందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అన్నారు. సోమవారం హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని 13వ వార్డులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్, స్థానిక ప్రజలతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సందమల్ల పుణ్యబాబుకు మద్దతు తెలుపుతూ, చేతి గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. సందమల్ల పుణ్యబాబు గెలిస్తే వార్డులో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా పనిచేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతును ప్రకటించారు. 22వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే , కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వడ్లూరి శ్రీలేఖను భారీ మెజారిటీతో గెలిపించాలని వార్డు ప్రజలను కోరారు. 26వ వార్డుల్లో చివరి రోజు జోరుగా ప్రచారం నిర్వహించిన హుజూరాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారు, ఇంటింటి ప్రచారంలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కలెక్టర్ కే. హేమావతి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, ఫిబ్రవరి 9: జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి కే. హేమావతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ... ఈ నెల 11న హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయని, 13న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు చెప్పారు.నాలుగు మున్సిపాలిటీల్లో మొత్తం 72 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయని, ఇందుకోసం 176 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 1,069 మంది పోలింగ్ సిబ్బందిని, 22 మంది జోనల్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయగా, 31 క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించామని తెలిపారు.జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో కలిపి మొత్తం 1,01,085 మంది ఓటర్లు ఉన్నారని, వారు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, అర్హులైన ప్రతి ఓటరు తప్పకుండా ఓటు వేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

గణితంలో సుహాసినికి పీహెచ్ డీ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 9 : గణితంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్.డీ)ని విజయవంతంగా పూర్తిచేసిన డాక్టర్ ఆర్. సుహాసినిని హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అభినందించింది. 'నానోపార్టికల్స్ తో కూడిన సాగే షీటుపై మాగ్నెటోహైడ్రో డైనమిక్ (ఎంహెచ్ డీ) మైక్రోపోలార్ ద్రవ ప్రవాహంపై ఒక సంఖ్యా అధ్యయనం' అనే శీర్షికతో ఆమె పరిశోధన చేసినట్టు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఇది న్యూటోనియన్ కాని ద్రవ గతిశాస్త్రం, వేడి, ద్రవ్యరాశి బదిలీ దృగ్విషయాల అధ్యయనానికి గణనీయమైన తోడ్పాటును అందిస్తుందన్నారు. ఈ పరిశోధన గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, పరిశోధన పర్యవేక్షకుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస రాజు మార్గదర్శనంలో నిర్వహించినట్టు తెలియజేశారు. ఈ అధ్యయనం మాగ్నెటోమైక్రోపోలార్ నానోఫ్లూయిడ్ ప్రవాహంపై వివిధ భౌతిక పారామితుల ప్రభావాలను విశ్లేషించడానికి అధునాతన సంఖ్యా పద్ధతులను ఉపయోగించిందని, ధృవీకరించిన ఫలితాలు ఇప్పటికే అందుబాటులో ఉన్న సాహిత్యంతో దగ్గరగా ఉన్నాయన్నారు. డాక్టర్ సుహాసిని విజయవంతంగా డాక్టరేట్ డిగ్రీకి అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, ఇతర అధ్యాపకులు తదితరులు ఆమెను హృదయపూర్వకంగా అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులు ముందస్తు ప్రణాళికతో

భవిష్యత్ దిశను ఎంచుకోవాలి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 9 : తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎ), సంగారెడ్డి లో కెరీర్ గైడెన్స్ సెల్ మరియు తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉన్నత విద్య, మేనేజ్‌మెంట్ కోర్సులు మరియు ప్రవేశ పరీక్షలపై అవగాహన కల్పించే కెరీర్ మార్గదర్శక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐబీఎస్ సంస్థకు చెందిన రిసోర్స్ పర్సన్ శ్రీ రామ్ నర్సింహ రెడ్డి హాజరై మాట్లాడుతూ, జీఎమ్యాట్ పరీక్ష ప్రాముఖ్యత, పరీక్ష విధానం, సిలబస్, దేశీయ మరియు విదేశీ స్థాయిలో మేనేజ్‌మెంట్ విద్యలో ఉన్న అవకాశాలపై విద్యార్థులకు విపులంగా వివరించారు. అలాగే ఐసీఫై విశ్వవిద్యాలయాలలో అందుబాటులో ఉన్న వివిధ మేనేజ్‌మెంట్ కోర్సులు, ప్రవేశ విధానం, పూర్తయ్యాక లభించే ఉద్యోగ అవకాశాల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ ఆసక్తులు, లక్ష్యాలను గుర్తించి ముందస్తు ప్రణాళికతో సరైన కెరీర్ దిశను ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. ప్రవీణ మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత విద్య మరియు ప్రొఫెషనల్ కోర్సులపై స్పష్టమైన అవగాహన అత్యంత అవసరమని అన్నారు. ఇటువంటి కెరీర్ మార్గదర్శక కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించడంలో ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ సెల్ సభ్యులు, తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ కోఆర్డినేటర్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీల ప్రారంభం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 9: సీఎం కప్ 2025 జిల్లా స్థాయి క్రీడా పోటీలను సోమవారం సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడలు, సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ క్రీడా పోటీలను గ్రామస్థాయి నుంచే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయి, మండలస్థాయి మరియు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ జిల్లాస్థాయి పోటీలు నేడు మరియు రేపు మొత్తం రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ స్థాయిలలో ప్రతిభ చాటిన క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీలకు హాజరయ్యారని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పంపడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు ఈ నెల 20వ తేదీ నుండి ప్రారంభం కానున్నట్లు అఖిలేష్ రెడ్డి తెలిపారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభను చాటి సంగారెడ్డి జిల్లాను మొదటి స్థానంలో నిలిపి సంగారెడ్డి జెండా ఎగురవేయాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాస్కెట్బాల్, హ్యాండ్బాల్, కరాటే, వుషు కిక్ బాక్సింగ్, ఫుట్బాల్, ప్రెస్లింగ్, జూడో, బాక్సింగ్ నందు క్రీడాకారులకు క్రీడలు నిర్వహించడం జరిగిందనీ ,ఈ క్రీడలలో 1500 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ క్రీడలలో మొదటి , రెండవ స్థానంలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్.జి.యఫ్. సెక్రెటరి శ్రీనివాస్ , టి.ఎన్.జి.ఓ మరియు అథ్లెటిక్ సెక్రెటరీ జావిద్ అలీ , హ్యాండ్బాల్ సెక్రెటరి విజయ్ , స్విమ్మింగ్ సెక్రెటరి శశ్వంత్ , బాల్ బ్యాడ్మింటన్ విజయ్ బాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

3, 10 వార్డుల అభ్యర్థులకు సీపీఐఎం మద్దతు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, ఫిబ్రవరి 9 : మక్తల్ పట్టణ మున్సిపల్ ఎన్నికల్లో ప్రగశీల శక్తులకు, అభ్యర్థులకు మద్దతు తెలియజేయాలని నిర్ణయించింది. సోమవారం విలేకరుల సమావేశంలో ఏర్పాటుచేసి పత్రికల ద్వారా ప్రకటించారు. ఈ సందర్భంగా సీపీఎం మక్తల్ మండల కార్యదర్శి గోవింద్ రాజ్ మాట్లాడుతూ మక్తల్ మున్సిపాలిటీలో 3 వ వార్డులో పోటీ చేస్తున్న మద్దిలేటి, 10 వ వార్డులో పోటీ చేస్తున్న డి స్వరూప రాణికి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. వారు సామాజిక, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా, ప్రజా సమస్యలపై పోరాడి న వ్యక్తులు అన్నారు. మరియు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 14 వార్డుల అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు, మక్తల్ పట్టణ ప్రజలు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించగలరని విజ్ఞప్తి. సిపిఎం మక్తల్ ఏరియా కార్యదర్శి పుంజనూర్ ఆంజనేయులు, సిపిఎం మక్తల్ మండల కార్యదర్శి గోవింద్ రాజ్ మక్తల్ పట్టణ ప్రజలకు, కార్మికులకు, కర్షకులు, విద్యార్థులు మేధవులకు విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 9: హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పరకాల పురపాలక ఎన్నికల సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ను సోమవారం జిల్లా ఎన్నికల పరిశీలకులు కె. శివ కుమార్ నాయుడు, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ సమక్షంలో ఎన్నికల సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. పరకాల పురపాలక సంఘంలో 22వార్డులకు ఈ నెల 11న ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఎన్నికల విధులను నిర్వర్తించే పోలింగ్, అదనపు పోలింగ్ అధికారులు ఓపీవోల ఆయా వార్డులకు ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు అదనంగా తొమ్మిది మంది (ఇరవై శాతం)మొత్తంగా 53మంది, అదనపు పోలింగ్ అధికారులు 44 మంది (ఇరవై శాతం) అదనంగా కలిపి 53మంది, ఓపీవోలు 132 మంది, అదనంగా ఇరవై శాతం కలిపి 158మంది, అదేవిధంగా రిజర్వు సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయింపు చేశారు. ఈ సందర్భంగా పరకాల పురపాలక కమిషనర్ అంజయ్య, టౌన్ ప్లానింగ్ అధికారి సుష్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలి
- కలెక్టర్ స్నేహ శబరీష్



ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 9: హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా నిర్వహిస్తున్న ప్రత్యేక కోచింగ్ తరగతులపై మండలాల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ప్రజావాణి కార్యక్రమం అనంతరం, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పదో తరగతి పాఠశాలలు, ప్రభుత్వ హాస్టల్స్‌లో ఏర్పాటు చేసిన ఫిర్యాదు పెట్టెలకు సంబంధించిన అంశాలు, విద్యార్థుల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - ఎస్ఐఆర్) పురోగతిపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మండలాలకు ప్రత్యేక అధికారులుగా నియమితులైన వివిధ శాఖల జిల్లా అధికారులను ఆయా పాఠశాలలు, హాస్టల్స్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులు, వసతులు, బోధన విధానం, విద్యార్థులకు అందుతున్న సేవలపై పూర్తి వివరాలు తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియ క్షేత్రస్థాయిలో ఏ విధంగా జరుగుతోందో సమీక్షించి, సర్వే నిర్వహణ తీరుపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా ఉన్నత పాఠశాలలు, హాస్టల్స్‌ను సందర్శించాలని, పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక కోచింగ్ తరగతులు సమర్థవంతంగా జరుగుతున్నాయా లేదా పరిశీలించాలని తెలిపారు. హాస్టల్స్‌లో ఏర్పాటు చేసిన కంప్లైంట్ బాక్సులను ఓపెన్ చేసి అందులో వచ్చిన ఫిర్యాదులను కేటగిరీలుగా నమోదు చేసి, సంబంధిత వివరాలతో కూడిన నివేదికను వారం రోజులలో అందజేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్యను ఆదేశించారు. అదేవిధంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్పెషల్ కోచింగ్ క్లాసులను మండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు జిల్లాలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా అధికారులు సమర్థవంతంగా పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో ప్రక్రియ పురోగతిపై వివరాలు సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీఆర్వో వై.వి. గణేష్, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, సిపిఓ సత్యనారాయణ రెడ్డి, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

“

సీఎం రేవంత్ మున్సిపల్ ఫలితాలకు ముందే ఓటమిని ఒప్పుకున్నారు. ఆ భయంతోనే బీజేపీపై అవాకులు పేలుతున్నారు. సీఎం స్క్రిప్ట్ దారుస్సలాంలో ప్రిపేర్ అవుతోంది. చేతగానితనాన్ని ఇతరులపైకి నెట్టడం సీఎంకు అలవాటైంది. కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము తనకు లేదని రేవంత్ లేఖ రాస్తే వాళ్ల సంగతి తాము చూసుకుంటాం.

- కేంద్ర మంత్రి బండి సంజయ్

అంతర్రాష్ట్ర యువజన సమ్మేళనం విజయవంతం

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 9: మేరా యువ భారత్ వరంగల్, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజుల అంతర్రాష్ట్ర యువజన సమ్మేళన కార్యక్రమం ఈ నెల 5 నుంచి 9 వరకు హనుమకొండ బాలసముద్రంలోని యూత్ హాస్టల్‌లో విజయవంతంగా జరిగింది సోమవారం నిర్వహించిన ముగింపు సమావేశానికి వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ అంతర్రాష్ట్ర సమ్మేళనంలో కేరళ రాష్ట్రానికి చెందిన 37 మంది యువతీయువకులు తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను అవగాహన చేసుకోవడం, చారిత్రక ప్రదేశాల సందర్శన ద్వారా వాటి ప్రాముఖ్యతను తెలుసుకోవడం, ఇతర రాష్ట్రాల యువత తమ సంస్కృతిసంప్రదాయాలను స్థానిక యువతకు పరిచయం చేయడం, జాతీయ సమైక్యతను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ చాహత్ బాజ్పయి మాట్లాడుతూ, విభిన్న మతాలు, భాషలు, సంస్కృతులు కలిగిన భారతదేశంలో యువత దేశభక్తి భావంతో జాతీయ సమైక్యతను బలోపేతం చేస్తూ ముందుకు సాగాలని అన్నారు. యువత నైతిక విలువలను నేర్చుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా సేవ రంగాలపై కూడా యువత దృష్టి సారించాలని చెప్పారు. విద్యా, వైద్య రంగాల్లో యువత మరింత పురోగతి సాధించాలని సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత మాట్లాడుతూ యువత శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని, సాంఘిక రుగ్మతలపై ప్రజలను చైతన్యం చేయవలసిన అవసరం ఉందని, ముఖ్యంగా మాదకద్రవ్యాలు, మొబైల్ అడిక్షన్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్ప్రెన్యూర్ షిప్ ఆధ్వర్యంలో నడపబడుతున్న జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఖాజా మసియొద్దీన్ మాట్లాడుతూ యువత నైపుణ్యాలను అలవర్చుకుంటేనే భవిష్యత్ లో ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. అనంతరం కేరళ రాష్ట్రం నుండి పాల్గొన్న యువతకు సర్టిఫికెట్లు మరియు మెమొంటోలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ - వరంగల్ ఉప సంచాలకులు శ్రీ చింతల అన్వేష్, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపెల్లి మధు, సూపరింటెండెంట్ దేవి లాల్, ఖమ్మం సూపరింటెండెంట్ భాను, జన శిక్షణ సంస్థాన్ ప్రతినిధి డా. తిరుపతి, మై భారత్ వాలంటీర్లు వెల్దండ సురేష్, నవీన్ యాదవ్, వస్థల్య, హార్షిని కర్ణాటక రాష్ట్ర యువజన ప్రతినిధులు, స్థానిక యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి ఉట్ల శంకర్ బైక్ ర్యాలీ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 9: నగరంలోని నాలుగవ డివిజన్ బీఆర్ఎస్ అభ్యర్థి ఉట్ల శంకర్ కు మద్దతుగా మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ బైక్ ర్యాలీ నిర్వహించారు. డివిజన్లో బ్యాంక్ కాలనీ, కెనాల్ కట్ట, మాధవ్ నగర్ ప్రాంతాలలో బైక్ ర్యాలీ నిర్వహిస్తూ బీ ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులను కాలనీ ప్రజలకు వివరిస్తూ ర్యాలీని కొనసాగించారు.

బీజేపీ ఆలయాలకు చందాలు ఇస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలయాలే కట్టించింది

- గల్లీ గల్లీలో రోడ్లు వేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- బీజేపీ కాంగ్రెస్ రెండు సంవత్సరాలలో ఇప్పటివరకు ఒక్క అభివృద్ధి కూడా చేయలేదు
- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే మాజీ గణేష్ బిగాల

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 9: బీజేపీ నాయకులు ఆలయాలకు చందాలు ఇస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకంగా ఆలయాలే కట్టించడం జరిగిందని అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని హమాల్ వాడి చౌరస్తా 35వ డివిజన్లో కార్పొరేటర్ అభ్యర్థి తాటికొండ నరేష్, 13 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి నేనావత్ శ్రీహరి లకు మద్దతుగా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డలకు స్కూటీలు ఇస్తానని చెప్పి మోసం చేసిన రేవంత్ రెడ్డికి ఓటు వేస్తారా లేకా కళ్యాణ లక్ష్మి రూ.లక్ష 116 బీఆర్ఎస్ ప్రభుత్వానికి వేస్తారా అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటితో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పి మోసం చేసిందన్నారు. బీజేపీ ఎమ్మెల్యే గెలిపిస్తే నగరం సుందరీ కరణంగా చేస్తా ప్రభుత్వం నిధులు ఇవ్వకుంటే నా సొంత ట్రస్ట్ ద్వారా అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఒక్క అభివృద్ధి కూడా చేయలేదని విమర్శించారు. నగరంలో ప్రతి గల్లీలో ప్రతి రోడ్డు వేసింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. ప్రజలు కాలనీలో విద్యుత్ సరఫరా లేదని కాంగ్రెస్ నాయకుల వద్ద కు వెళ్తే ధన్పాల్ సూర్యనారాయణ మా ప్రభుత్వం అధికారంలో లేదని ఇంటింటికి డబ్బులు వసూలు చేసి బల్బులు కొనుక్కోమని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఆడపడుచులకు స్కూటీలు ఇస్తానని చెప్పి మోసం చేశాడు, కళ్యాణ్ లక్ష్మి ద్వారా తులం బంగారం ఇస్తానని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ కు ఎలా ఓటు వేస్తారని అన్నారు. బీజేపీకి మేయర్ పదవి వస్తే రాత్రికి రాత్రి అధికారం వస్తుందా ? రెండున్నర సంవత్సరాల పాటు నిజామాబాద్ నగరం ఎవరు పట్టించుకోలేదన్నారు. 35 వ డివిజన్ తాటికొండ నరేష్, శ్రీహరి లను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

51 వ వార్డు ప్రజల సమస్యలు పరిష్కరిస్తా

ప్రతిపక్షం, మంచిర్యాల, జనవరి 9: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 51 వ డివిజన్ ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని సోమవారం ఇంటింట ప్రచారం చేస్తూ నీలి స్వప్న శ్రీనివాసులు పేర్కొన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ వర్తించేలా కృషి చేస్తానన్నారు. వాటిలోని పెన్షన్ దారులకు ఇందిరమ్మ ఇండ్లు తదితర అంశాలను అందరికి వర్తించేలా తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రజల సేవ చేసే అందుకే డివిజన్లో కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్ గా పోటీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఆదరించి భారీ మెజార్టీతో తమను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

చేర్యాల పట్టణ అభివృద్దే నా లక్ష్యం

- 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ముస్త్యాల అరుణ బాల్ నర్సయ్య

ప్రతిపక్షం చేర్యాల, ఫిబ్రవరి 9: చేర్యాల మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ, బలపరిచిన 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ముస్త్యాల అరుణ బాల నర్సయ్య, ఎన్నికలలో భాగంగా ఆరో వార్డు పరిధిలో ఉన్న ప్రతి గడపగడపకు తిరుగుతూ ప్రతి ఒక్కరితో అనురాగ ఆప్యాయంతో ఆధార అభిమానాలతో పలకరిస్తూ ఎన్నికల్లో ఓటర్లు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించి తమను ఆశీర్వదించమని కోరారు. నిస్వార్థ సేవకురాలుగా ఉంటానని ఆరవవార్డు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఏ సమస్య ఉన్న ప్రజల వద్దకే వెళ్లి పరిష్కరిస్తానని చేర్యాల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చేర్యాలను అభివృద్ధి పథంలో నడిపిస్తానంటూ "మీ ఓటు నా బలం మీరే నా బలగం" అని అన్నారు. ఆరో వార్డులో ఉన్న సమస్యలను సి.సి రోడ్లు గాని డ్రైనేజ్ వ్యవస్థను, వీధి దీపాలు, రేషన్ కార్డుల మంజూరు. పెన్షన్ల మంజూరు ప్రత్యేక దృష్టి, పెట్టి అన్ని రంగాలుగా 6వ వార్డు అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సర్పంచులకు అవగాహన

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి 9: నూతనంగా ఎన్నికైన చేగుంట మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్ లకు రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో చిన్నారెడ్డి సమక్షంలో సర్పంచులకు సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శివప్రసాద్ మండల విద్యాధికారి నీరజ వ్యవసాయ అధికారి ప్రసాద్ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ అనిల్ కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చేగుంట సర్పంచ్ సండ్రగు స్రవంతి రాంపూర్ సర్పంచ్ కాశబోయిన నాగమణి సోమ్లా తండా ప్రవళిక గొల్లపల్లి సర్పంచ్ చేర్యాల సబిత మక్క రాజుపేట మల్లారెడ్డి రేఖ కర్నాల్ పల్లి జనగామ రాములు కరీంనగర్ కర్రె పుష్ప చిట్టోజ్ పల్లి మద్ది లక్ష్మీనరసయ్య వడియారం సాయికుమార్ గౌడ్ పోలంపల్లి కొండి రాజ్యలక్ష్మి మక్క రాజుపేట తాలూకా మహేశ్వరి తదితర గ్రామాల సర్పంచులను సన్మానించారు.

ప్రేమ జంట ఆత్మహత్య

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 9: సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లి శివారులో ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో నారాయణరావుపేట గ్రామానికి చెందిన మ్యాదనగారి శ్రావణ్, పెద్దకోడూరు గ్రామానికి చెందిన బోనాల నవ్య మృతిచెందారు. శ్రావణ్ చదువు మధ్యలో ఆపివేసి ప్రస్తుతం వ్యవసాయం చేస్తూ, జెసిబి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నవ్య ప్రస్తుతం డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. వీరిద్దరూ వరుసకు మేన బావ, మరదలు కావడంతో కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారూ. ఇరు కుటుంబాల మధ్య సఖ్యత లేకపోవడమే ఈ విషాదానికి కారణమై ఉండొచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి సంఘటన స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు.

కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మవద్దు

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రతిపక్షం, దుబ్బాక, జనవరి 9: దుబ్బాక మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మాజీ మంత్రి హరీశ్ రావు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి 4,5 వార్డులు, చెల్లపూర్ 2,3,4 వార్డులు, లచ్చపేట 10,11,12 వార్డులు ,దుబ్బాక పట్టణంలోని 1,6,13,14,15,16,17,18,19,20 వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులకు, పార్టీ శ్రేణులకు ప్రజలు ఘన స్వాగతం పలికి భారీగా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ..అబద్ధాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్,బీజేపీ పార్టీల మాటలు నమ్మవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు..తెలంగాణ అభివృద్ధికి పునాది వేసిన, కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు నిర్మించి రైతాంగానికి నీరు అందించిన మహానేత కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నది మన ఇంటి పార్టీ అయిన బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రతి ఓటరు కారు గుర్తును గుర్తుచేసుకొని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిన పార్టీలకు గుణపాఠం చెప్పే సమయం వచ్చిందని, అభివృద్ధి - సంక్షేమం కొనసాగాలంటే కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రతిపక్షం, దౌల్తాబాద్, ఫిబ్రవరి 9: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు గడ్డం నాగరాజు అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండలం తిరుమలపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం, కూరగాయలు, పప్పు వంటి పదార్థాలు నాణ్యంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

'అల్లుడు హరీశూ.. గిల్లుడు మొదలెట్టితే నువ్వు తట్టుకోలేవు'

- పద్ధతి మార్చుకోకుంటే సిద్దిపేట పొలిమేరలు దాటిస్తాం
- నన్ను తిట్టడం కాదు ముందు మరదలు ప్రశ్నలకు జవాబు చెప్ప
- క్యాంప్ ఆఫీస్ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అడ్డా అయ్యింది
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 9: అల్లుడు హరీశూ... నన్ను గిల్లడం మొదలెట్టితే నువ్వు తట్టుకోలేవని స్పష్టం చేస్తూ పరిస్థితి ఇలాగే కొనసాగితే నిన్ను సిద్దిపేట పొలిమేరలు దాటిస్తామని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గజ్వేల్ లో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచార సభకు హాజరై ఆయన ప్రసంగించారు. గజ్వేల్, సిద్దిపేటలో పెత్తనం చేస్తున్న హరీష్ రావుకు 610 జీవో ఎందుకు వర్తించదని నిలదీశారు. తన నోట్లో వేలు పెడితే నువ్వు తట్టుకోలేవని, ఇక మిగిలింది నిన్ను ఇక్కడి నుండి తరిమేయడమేనని పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో నిర్వాసితులను నిండా ముంచిన మీకు ఇక తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు. పేదల ఇండ్లను కూల్చి ఫాంహౌజ్ కు దారి వేసుకోగా, మరి ఈ నిరుపేదల కష్టాలు ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు. 13 ఏళ్లుగా ఫాంహౌజ్ లో పండుకున్న కెసిఆర్ ఏ ఒక్కరోజు గజ్వేల్ ప్రజలకు కనిపించలేదని గుర్తు చేశారు. కాగా పరిశ్రమల ఏర్పాటు పేరుతో భూములు లాక్కుంటారనే భయంతో కామారెడ్డి ప్రజలు తగిన బుద్ధి చెప్పగా, నమ్మి ఓట్లేసిన పాపానికి గజ్వేల్ ప్రజలు ఆవేదన అనుభవిస్తున్నట్లు స్పష్టం చేశారు. మల్లన్న సాగర్ నిర్వాసిత గ్రామాల ప్రజలు బిఆర్ఎస్ నేతలకు శాంపిల్ మాత్రమే చూపించారని, ముంపు బాధితులకు న్యాయం చేయాల్సిన కెసిఆర్ అవేమీ పట్టించుకోకపోవడం సిగ్గుచేటని నిలదీశారు. నమ్మి నాన పోస్తే పుచ్చి బుర్రలైనట్లు వారి వైఖరి ఉండగా, బిఆర్ఎస్ ప్రభుత్వ అసలు నిజ స్వరూపాన్ని కవిత బయట పెడుతున్నట్లు తెలిపారు. అయితే దుబ్బాకలో నన్ను బూతులు తిట్టడం కాకుండా, తమ మరదలు సంధిస్తున్న ప్రశ్నలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ రాక కోసం ఎదురు చూసిన క్యాంప్ ఆఫీస్ ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అడ్డాగా మారిందని అన్నారు. గజ్వేల్ ప్రజల కష్టాలు పోవాలంటే బిజెపికి అండగా నిలిచి ఆశీర్వదించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గాడిపల్లి కళ్యాణి, మాజీ చైర్మన్ భాస్కర్, జిల్లా పార్టీ అధ్యక్షులు శంకర్ ముదిరాజ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సింగం సత్తయ్య, జిల్లా అధికార ప్రతినిధి నందన్ గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షులు మనోహర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సైలెన్స్ పీరియడ్‌లో ప్రచారం నిషేధం

- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 9: మెదక్ జిల్లాలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు, ప్రవర్తనా నియమావళి ప్రకారం నేటి సాయంత్రం 5.00 గంటలతో ఎన్నికల ప్రచారం ముగుస్తుందని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు, తెలిపారు. సాయంత్రం 5గంటలకు అమల్లోకి వచ్చే సైలెన్స్ పీరియడ్ సమయంలో ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారం, మైక్‌లు, లౌడ్ స్పీకర్లు, ప్రచార వాహనాలు, పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు లేదా ఇతర ప్రచార కార్యక్రమాలు నిర్వహించడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. సైలెన్స్ పీరియడ్ సమయంలో సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులు, డిజిటల్ ప్లాట్ ఫామ్‌ల ద్వారా కూడా ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని తెలిపారు. ఈ అంశంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ రోజు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా మరియు నిర్భయ వాతావరణంలో ఎన్నికలు జరిగేలా జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టిందని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించామని, ఫ్లయింగ్ స్క్వాడ్స్ మరియు క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు ఎన్నికల నిబంధనలను గౌరవించి పోలీస్ శాఖకు సహకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

'2024 జూలై 6న వచ్చిన 2 ట్యాంకర్లు, జూలై 12న వచ్చిన మరో 2 ట్యాంకర్ల నెయ్యిని టీటీడీ ల్యాబ్ పరీక్షించి, నాణ్యతా ప్రమాణాలు లేవని వెనక్కి పంపింది వాస్తవం కాదా? ఆ లారీలు దొడ్డిదారిన తిరిగి వచ్చింది మీ పాలనలోనే కదా? ఒకవేళ కల్తీ జరిగి ఉంటే అది మీ హయాంలోనే కదా? దీనికి మీ సమాధానమేంటి?

- మాజీ మంత్రి విడదల రజిని

ప్రాంతీయం

అమెరికా ఒత్తిడికి మోడీ సర్కారు లొంగుబాటు

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 9: దేశ సార్వభౌమాధికారానికి మరణ శాసనం రాస్తూ వాణిజ్య ఒప్పందం చేయడానికి తీవ్రంగా నిరసిస్తూ సిద్దిపేటలోని కొత్త బస్టాండ్ వద్ద కేంద్ర ప్రభుత్వం దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా గొపలస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ట్రంప్ బెదిరింపులకు పూర్తిగా లొంగిపోవడం తప్ప మరోటి కాదని అన్నారు. మోడీ భారతదేశం జాతీయ ప్రయోజనాలను తాకట్టు పెట్టి దానిని పరస్పర ప్రయోజనకరమైన భాగస్వామ్యం అని పిలవడం దారుణమని విమర్శించారు. భారతదేశం యురోపియన్ యూనియన్ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం తర్వాత వస్తున్న ఈ వాణిజ్య ఒప్పందం భారతీయ కార్మికులకు రైతులకు సామాన్య ప్రజలకు కష్టాలను మరింత పెంచి ఒక డబుల్ దెబ్బ కాబోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా వస్తువులపై సుంకాలను ఎత్తేయడం వల్ల మన దేశ మార్కెట్లోకి విచ్చలవిడిగా అమెరికా ఉత్పత్తులు వెలువెత్తాయని ఇది మన వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, ఇతర పరిశ్రమలపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న రైతుల, కార్మికుల జీవితాలను నాశనం చేస్తాయని స్పష్టం చేశారు. ఖరీదైన అమెరికా ఇంధనం బొగ్గు ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి చేసిన వాగ్దానాలు భారతీయ వినియోగదారులపై నేరుగా ప్రవాహం చూపుతాయని అన్నారు. ధరల పెరుగుదలకు దారితీసి సామాన్య ప్రజల జీవితాలు మరింత దుర్భర స్థితిలోకి నెట్టబడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా సైనిక సాంకేతిక పరిజ్ఞానాన్ని బలవంతంగా సేకరించడం దేశీయ ఉత్పత్తిని దెబ్బతీస్తుందని జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. ఇప్పటిదాకా మనం అనుసరిస్తున్న వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి ప్రమాదం వాటిల్లుతుందని తెలిపారు అమెరికా, యూకే, యూరోపియన్ యూనియన్ దేశాలతో జరిగిన స్వేచ్ఛ వాణిజ్య ఉత్పందాలను పార్లమెంట్లో చర్చకు పెట్టాలని రాష్ట్రాలతో సమగ్రంగా చర్చించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, ప్రజల వ్యతిరేక స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు అన్నింటిని రద్దు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చల్లారపు తిరుపతిరెడ్డి ఉపాధ్యక్షులు మూడోజు కనకాచారి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అమ్ముల బాల్ నర్సయ్య నాయకులు కనకరాజు, అశోకు,సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ పద్ధతిలో పోలింగ్‌కు సిబ్బంది

- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 9: ఈ నెల 11 వ తేదీనా జరగనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ కే. హైమవతి కేటాయించారు.సాధారణ మున్సిపల్ ఎన్నికలు 2026 నిర్వహణలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మష్రత్ ఖానం సమక్షంలో జిల్లాలో ఎన్నికలు జరగనున్న చేర్యాల, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీల ఎన్నికల పోలింగ్ ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ,అదర్ పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ పద్ధతిలో ఆన్లైన్ లో కేటాయించారు. చేర్యాల మున్సిపాలిటీకి 147 మంది సిబ్బందిని, హుస్నాబాద్ మున్సిపాలిటీకి 240 మంది సిబ్బందిని, దుబ్బాక మున్సిపాలిటీకి 246 మంది సిబ్బందిని, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి 436 మంది సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రాజ్ కుమార్, డిఆర్డీఓ జయదేవ్ ఆర్యా, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఎన్నికల సిబ్బంది. ఎలక్షన్ విభాగం అధికారులు, ఈడియం ఆనంద్ మరియు టెక్నికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం ఖాయం

- పట్టణ బీఆర్ఎస్ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు మహమ్మద్ షాహిద్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 9: మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక మున్సిపాలిటీలను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని పట్టణ బీఆర్ఎస్ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు మహమ్మద్ షాహిద్ ధీమా వ్యక్తం చేశారు.సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మైనార్టీల కోసం అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసిందన్నారు. మైనార్టీల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. అబద్ధపు హామీలు, అమలుకు సాధ్యం కాని వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, కానీ ఇప్పటివరకు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి మరోసారి ప్రజల అభివృద్ధికి అండగా నిలవాలని ఆయన కోరారు.

ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- పోలింగ్ రోజున కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు
- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 9: మెదక్ మున్సిపాలిటీ పరిధిలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను అదనపు ఎస్పీ మహేందర్ పరిశీలించారు. ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న భద్రతా చర్యలను ఆయన సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మెదక్ పట్టణంలోని వేస్లీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. అక్కడ భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల అమరిక, బ్యారికేడింగ్ విధానం వంటి అంశాలను పరిశీలించారు. ఎన్నికల సామగ్రి రవాణా సమయంలో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని చర్చ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మాడల్ డే కేర్ సెంటర్ పోలింగ్ కేంద్రాన్ని, అలాగే దయరా, నవాబ్ పేట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు.అనుమానాస్పద కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి భయం లేకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు శాఖ పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే విజయవంతంగా నిర్వహించగలమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధిని అడ్డుకోవడమే గులాబీ నేతల పని

- గత పాలనలో అభివృద్ధి నిధులన్నీ సిద్దిపేటకు తరలింపు
- కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 9: గత పది సంవత్సరాల పాటలలో పట్టణం అభివృద్ధి మరిచి మెదక్ నియోజకవర్గ నిధులను సిద్దిపేట గజ్వేల్ తరలించకపోయి అక్కడ అభివృద్ధి చేయడం జరిగిందని మెదక్ పట్టణాన్ని మరోసారి అభివృద్ధి అడ్డుకోవడమే హరీష్ రావు లక్ష్యమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంతరావు అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో చివర రోజు మంగళవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి స్థానిక రాందాస్ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు అనంతరం రాందాస్ చౌరస్తాలో మాట్లాడుతూ. మెదక్ దేవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్టమైన క్యాడర్ ఉందని ఆయన తెలిపారు గత పది సంవత్సరాల పాలనలో మెదక్ నియోజకవర్గ నిధులన్నీ సిద్దిపేట గజ్వేల్ సిరిసిల్ల ప్రాంతాలకు తరలించి అక్కడ అభివృద్ధి చేయడం జరిగిందని మెదక్ నియోజకవర్గం పట్టించుకోలేని పాపాన గులాబీ శ్రేణులకే దక్కుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత మెదక్ అభివృద్ధి దిశలో ముందుకు పోతున్న తరుణంలో స్థానిక సంస్థల ఎన్నికల మరోసారి అభివృద్ధిని అడ్డుకోవడం కోసం హరీష్ రావు బ్యాచ్ మరోసారి కుట్ర పన్నుతుందని దీనిని పట్టణ ప్రజలు గ్రహించి గులాబీ శ్రేణులపై పోరాటం చేయాలని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందని ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామన్న దళిత బంధు ఇస్తామని నమ్మించి మోసం చేసిన ఘనత భారత రాష్ట్ర సమితి నాయకులకు దక్కిందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో దళిత బంధువులు బీసీ బందులు అన్ని ప్రాంతాలలో అమలు చేస్తానని కేవలం ఆయన సొంత ఊరు ఎర్రవల్లి చింతమడక గ్రామాలలో అమలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత ఇద్దరమ్మా ఇళ్ళు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. మెదక్ నియోజకవర్గం లో 200 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన గుర్తు చేశారు. మెదక్ నియోజకవర్గం లో నిరుద్యోగ సమస్యలు తీర్చింది తను ఎమ్మెల్యేగా ఉన్న ప్రాంతంలో శంకరాపేటలో ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయడం జరిగిందని మెదక్ జిల్లా కేంద్రంలో షాపింగ్ మాల్స్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని దీంతో నిరుద్యోగ సమస్య కొత్త తీరుతుందని ఆయన తెలిపారు అభివృద్ధిని అడ్డుకోవడమే ధ్యేయంగా మాజీ మంత్రి హరీష్ రావు బ్యాచ్ మరోసారి ప్రయత్నం చేస్తుందని ప్రజలు నమ్మద్దు అని ఆయన తెలిపారు ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అభివృద్ధిని చేయడం జరుగుతుందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గ మాత ఆలయానికి ముఖ్యమంత్రి హోదాలో వచ్చి దర్శనం చేసుకుని 35 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి నిధులు మంజూరు చేయడం జరుగుతుంది జరిగిందని పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు అలాగే మెదక్ చర్చిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన గుర్తు చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలో మూడు అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు.ఖిల్లా అభివృద్ధి కి రూ 4 కోట్లు అభివృద్ధికి ప్రణాళిక పంపడం జరిగిందని మెదక్ నియోజకవర్గ పరిధిలోని యంగ్ ఇండియా స్కూల్లో 200 కోట్ల రూపాయలతో రామయంపేట్ లో ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రెండు నెలల్లో కొత్త పెన్షన్లు వస్తున్నాయి ఆయన తెలిపారు. అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ పార్టీ ఈ ఓటు వేయాలని ఆయన గుర్తు చేశారు ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ. మెదక్ నియోజకవర్గం లో త్రాగునీటి సమస్య నిర్మా పరిష్కరించడం కోసం మైనంపల్లి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా 800 బోర్లు వేయడం జరిగిందని. మెదక్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరాలని ఆయన తెలిపారు భారత రాష్ట్ర సమితి నాయకులు అభివృద్ధిని కోరుకోవడం లేదని ఆయన గుర్తు చేశారు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు పార్టీలో అంతర్గత విభేదాలు ఉన్నాయని చాలా మేరకు అవినీతి జరిగిందని ఆరోపించడం జరుగుతుందని ఆయన గుర్తు చేశారు. 10 సంవత్సరాల పాలనలో అభివృద్ధిని చేయలేని నాయకులు ఇప్పుడు వచ్చి అభివృద్ధిని అడ్డుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ప్రజలు గ్రహించి అభివృద్ధిని కావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అయినా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్. పట్టణ అధ్యక్షులు గంగాధర్. తో పాటు కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ అభ్యర్థులు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన డీబీఎఫ్ నేత

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 9: తెలంగాణ రాష్ట్ర ఎస్సీఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను సిద్దిపేట జిల్లా భూంపల్లి గ్రామంలో దళిత బహుజన ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా వారిరువురు రాష్ట్రంలో జరుగుతున్న ఎస్సీ ఎస్టీల పరిస్థితులపై చర్చించారు. ఇటీవల కాలంగా చైర్మన్ చేస్తున్న కార్యక్రమాలు దళిత గిరిజనులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, దళితనేత రౌతు రమేష్ కుమార్ అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉండాలని రమేష్‌కుమార్ చైర్మన్ కోరారు. వారు దళితుల పక్షపాతిగా పోరాటం చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన నాయకులు అన్నిమల్లె రఘుపతి అన్నిమల్లె శివకుమార్ రౌతు అరుణ సాయికుమార తదితరులు పాల్గొన్నారు.

సేవే మనిషి పరమావధి..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట పిబ్రవరి 9: సిద్దిపేట పట్టణంలోని సిద్ధార్థ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న భూధవ్వకు కాలు ఆపరేషన్ నిమిత్తం 'ఏ' పాజిటివ్ రక్తం అత్యవసరంగా అవసరమైంది. ఈ విషయాన్ని బ్లడ్ ఫౌండేషన్ ప్రతినిధి రంగదాం భాను దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సిద్దిపేట పట్టణ వాసవి క్లబ్ అధ్యక్షుడు కూర శ్రీనివాస్‌కు తెలియజేశారు. ఆయన స్పందించి 'ఏ' పాజిటివ్ రక్త గ్రూప్‌కు చెందిన గందె రాజును సంప్రదించగా, ఆయన వెంటనే ఆసుపత్రికి చేరుకొని రక్తదానం చేశారు. ఇది గందె రాజు చేసిన 31వ రక్తదానం కావడం విశేషం. ఎంత బిజీ జీవితం ఉన్నా మానవసేవే పరమావధిగా భావించి, సమాజానికి తిరిగి ఏదైనా చేయాలనే సంకల్పంతో సిద్దిపేట పట్టణ వాసవి క్లబ్ అధ్యక్షుడు కూర శ్రీనివాస్, క్లబ్ కార్యదర్శి నాగమల్ల కిషన్, బ్లడ్ ఫౌండేషన్ ప్రతినిధి రంగదాం భాను ఎన్నో సంవత్సరాలుగా విశేష సేవలు అందిస్తున్నారు. భాను చిన్న వయసులోనే తన ఫౌండేషన్ ద్వారా అత్యవసర సమయాల్లో ఇప్పటికే వందల మందికి రక్తదానం అందేలా ముందుండి కృషి చేశారు.వీరందరి సేవాతత్పరతను గుర్తించి మిత్ర బ్లడ్ సెంటర్, సిద్దిపేట తరపున చిరు సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిత్ర బ్లడ్ సెంటర్ చైర్మన్ అయిత సత్యనారాయణ, నిర్వాహకులు సి. వేణుగోపాల చారి, లింగంపల్లి నవీన్ పాల్గొని, యువత రక్తదాన కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు.

రేవంత్ రెడ్డి జైలుకెళ్లడం ఖాయం

- ఎమ్మెల్యే గుండాగిరికి పాల్పడుతున్నాడు
- మాజీ మంత్రి హరీష్ రావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 9: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓటుకు నోటు కేసులో రేవంతు జైలుకు పోవడం ఖాయం అన్ని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు మెదక్ జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక గోల్డెన్ క్లబ్ నుండి శివాజీ రాందాస్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా తెలంగాణ ఆటపాటలతో డీజే చప్పుడులతో తెలంగాణ నినాదాలు తో భారీ ర్యాలీ కొనసాగింది చౌరస్తాలో నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ .ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన దొంగ జైలుకు పోయే సమయం దగ్గరకు వచ్చింది. అందుకే సాక్ష్యాలు మాయం చేసేందుకు హైద్రాబాద్‌లో ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేసిండని హరీష్ రావు ఆరోపించారు. జైలుకు పోకుండా ఉండేందుకు సాక్ష్యాలు మాయం చేసిండు. ప్రమాదవశాత్తు జరిగింది కాదు.. రేవంత్ డైరెక్షన్‌లో జరిగిన ప్రమాదం ఇదన్నారు. . పోలీసుల సహకారంతో ఈ కుట్ర పన్నిండు. హైద్రాబాద్ లో పేదల బతుకులు కూల్చిండని మండిపడ్డారు. జైలుకు పోకుండా ఉండేందుకు సాక్ష్యాలను మాయం చేసిండు. రేవంత్ డైరెక్షన్‌లో పోలీసులు చేసిన దహనకాండ. ప్రమాదవశాత్తు జరిగింది కాదు. రేవంత్ చేసింది. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డికి శిక్ష పడక తప్పదు, జైలుకు పోక తప్పదు. రెండున్నరేండ్ల కాలంలో కాంగ్రెస్ చేసింది గుండు సున్నా. మిర్యాలగూడ, భూపాలపల్లి, నిజామాబాద్ పోయిండు ముఖ్యమంత్రి కానీ మెదక్ కు వచ్చేందుకు ముఖం లేదు. ఏడుపాయల అమ్మవారి మీద ఒట్టు వేసి మాట తప్పిండు కాబట్టి ఆయనకు భయం, రుణమాఫీ మాట తప్పి మోసం చేసిండు. రైతు బంధు ఎగ్గొట్టిండు. ఎరువుల కరువు తెచ్చిండు రేవంత్. రేవంత్ బూతులు మాట్లాడటం తప్ప ఒక్క మంచి పని చేయలేదు. రంజాన్ తోఫా కూడా ఇవ్వడం లేదు. షాదీ ముబారక్ చెక్కులు రావడం లేదు. తులం బంగారం దిక్కు లేదన్నారు.కేసీఆర్ మైనార్టీ గురుకులాలు కట్టారు. షాదీ ఖానా ఏర్పాటు చేసారు. కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని సెక్యులర్ పార్టీగా నిలబెట్టారని హరీష్ రావు అన్నారు. హిందూ ముస్లింలను అన్నదమ్ములుగా చూశారని అన్నారు. రేవంత్ రెడ్డి తెల్లవారితే కేసీఆర్‌ను తిడుతుంటాడు. కేసీఆర్‌ను తిడితే, హరీష్ రావును తిడితే పేదల కడుపు నిండుతుందా..? ఇక్కడి ఎమ్మెల్యే చాలా గొప్పోడు.ఎన్నికల సమయంలో 25 గంటల కరెంటు ఇస్తా అన్నడు. కనీసం 12 గంటలు కూడా రావడం లేదు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు అని గుండు కొట్టిండన్నారు. ఉద్యోగస్థులకు డీఏ లేదు, పీఆర్సీ లేదు. రిటైర్డ్ ఉద్యోగులకు రిటైర్ బెనిఫిట్స్ లేవు. అన్ని వర్గాల ప్రజలను దారుణంగా సీఎం రేవంత్ రెడ్డి మోసం చేసిండు అని హరీష్ రావు అన్నారు.ఎస్సీ, బీసీ, ఎస్టీ పిల్లల చదువులను ఆగం చేసిండు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అని దగా చేసిండు. రెండు లక్షల ఉద్యోగాలని నిరుద్యోగులను మోసం చేసిండు.కాంగ్రెస్ వాళ్లను గెలిపించుకోకుంటే బిల్లులు రావని బెదిరిస్తున్నరట. మెదక్‌లో నీ పిట్ట బెదిరింపులకు, చిల్లర బెదిరింపులకు భయపడం. బిల్లులు మీ జేబుల నుంచి ఇస్తున్నారా..? మీ జాగిరా..? బరాబర్ బిల్లులు వస్తయి, కొట్లాడి సాధించుకుంటమన్నారు.

స్థానిక ఎమ్మెల్యే గుం/డా గిరి చేస్తున్నాడు బెదిరింపులకు పాల్పడుతున్నాడు

స్థానిక మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మల్కాజ్గిరి గుండాలతో మెదక్ లో రౌడీయిజం చేస్తున్నారని ఆరోపించారు. మెదక్ ప్రజలు బెదిరిస్తే భయపడరని, మంచితనంతోనే గెలవాలన్నారు. బెదిరింపులకు పాల్పడితే ఇక్కడి ప్రజలకు బెదరని చెప్పారు. మెదక్ ప్రజలను గెలవాలంటే ఒక్క మంచితనం తోనే సాధ్యమని, బెదిరింపులకు భయపడేది లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి మెదక్ మున్సిపల్ ఇంచార్జి మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, శేరి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి.తిరుపతి రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ లు బట్టి జగపతి, మల్లికార్జున్ గౌడ్, కృష్ణా రెడ్డి, సురేందర్ గౌడ్ తో పాటు బీ ఆర్ ఎస్ అభ్యర్థులు, నేతలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

"



టాలెంట్‌ను కొలవడంలో పరీక్షలు, ఇంటర్వ్యూలు ప్రమాణాలు కాదు. నిజ జీవితంలో ఓ వ్యక్తి అసాధారణ ప్రతిభను పరీక్షలు, ఇంటర్వ్యూల ద్వారా గుర్తించలేరు. ఫ్రెంచ్ మ్యాథమెటీషియన్ డ్యుమినిల్ ఎప్పుడూ మ్యాథ్స్ కాంపిటీషన్‌లో పాల్గొనలేదు. అయినా తన సత్తా ఏంటో చూపారు.

- జొహో కో-ఫౌండర్ శ్రీధర్ వెంబు

'మావోయిస్టులు వినాశనం తప్ప అభివృద్ధిని కాంక్షించలేదు'

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ''మావోయిజం ఏ సమాజానికి ఎప్పుడూ మేలు చేయలేదు. అది అడుగుపెట్టిన ప్రతిచోటా వినాశనం తప్ప అభివృద్ధిని కాంక్షించలేదు. కొలంబియా, పెరూ, కంబోడియా వంటి దేశాల చరిత్రే ఇందుకు నిదర్శనం. అందుకే చెబుతున్నా, మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని సమూలంగా తుడిచిపెడతాం.'' అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా కేంద్రం జగదల్‌పూర్‌లో సోమవారం జరిగిన 'బస్తర్ పాండుమ్2026' ముగింపు ఉత్సవాల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ, నక్సల్స్ అంతానికి డెడ్‌లైన్ విధించారు. ''మేము ఎవరితోనూ యుద్ధం చేయాలనుకోవడం లేదు. మా పోరాటం మా గిరిజన సోదరసోదరీమణుల రక్షణ కోసమే. కానీ ఎవరైనా చేతిలో ఆయుధం పట్టుకుంటే, వారికి ఆయుధంతోనే సమాధానం చెబుతాం. ఐఈడీలు అమర్చి అమాయక పిల్లల ప్రాణాలు తీస్తున్నారు. పాఠశాలలను, ఆసుపత్రులను తగులబెడుతున్నారు. ఇంతటి క్రూరత్వం ఎక్కడి నుంచి వచ్చింది? సాయుధ పోరాటాన్ని ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేస్తుంది''అని ఆయన తేల్చిచెప్పారు. నక్సల్స్ దళాల్లో ఉన్న గిరిజన యువతుల గురించి అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల్లో ఇంకా మిగిలి ఉన్నవారిలో చిన్న వయసు గిరిజన బాలికలు కూడా ఉన్నారని, వారి చేతుల్లో తుపాకులు చూడటం బాధాకరమన్నారు. వారి ముందు ఇంకా ఎంతో జీవితం ఉంది. వారంతా ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి ఎలాంటి హానీ జరగదని భరోసా ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'పునరావాస విధానం' దేశంలోనే అత్యుత్తమమైనదని ఆయన కితాబిచ్చారు. మావోయిస్టుల వల్ల దశాబ్దాలుగా నష్టపోయిన బస్తర్ ప్రాంతం ఇప్పుడు అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందని షా పేర్కొన్నారు. ఇప్పుడు బస్తర్ మారుతోందని, డిసెంబర్ 2027 నాటికి బస్తర్ ప్రాంతంలోని 7 జిల్లాల్లోని ప్రతి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

విశ్వ వీక్షణం

ఎస్ఐఆర్‌ను అడ్డుకోవద్దు

- బెంగాల్ సర్కార్ ను హెచ్చరించిన సుప్రీం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఓటర్లకు జాబితా ప్రక్రియకు చెందిన ప్రత్యేక సమగ్ర సమీక్ష (ఎస్ఐఆర్) పూర్తి చేయడంలో ఎటువంటి అడ్డంకులు సృష్టించవద్దని సోమవారం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు హెచ్చరించింది. కాగా ఈ ప్రక్రియలో నిజమైన ఇబ్బందులను పరిష్కరిస్తామని ప్రభుత్వానికి సుప్రీం హామీ ఇచ్చింది. బెంగాల్ సర్‌లో దరఖాస్తుల పరిశీలన లేదా పూర్తిచేయడానికి, డాటాను ఖరారు చేయడానికి గడువును ఒక వారం పొడిగించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ ఎన్‌వీ అంజారియా నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాట్సాప్ ద్వారా అధికారిక ఆదేశాలు ఇవ్వడాన్ని నిలిపివేయాలని కోరుతూ సర్ ప్రక్రియలో మార్పులు చేయాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టును కోరారు. అన్ని ఆదేశాలను అధికారికంగా జారీచేయాలని, వాటిని ఈసీఐ వెబ్‌సైట్ లో అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం డిమాండు చేసింది. మైక్రో అబ్జర్వర్లను తొలగించాలని, బదులుగా 8,505 గ్రూప్ బీ అధికారులను ప్రతిపాదించింది. సీజేఐ కోర్టు వైఖరిని స్పష్టం చేస్తూ తాము అవరోధాలను తొలగిస్తామని, అయితే సర్ ప్రక్రియ పూర్తిలో ఎటువంటి అడ్డంకులను సృష్టంచబోమని తెలిపారు.

నిశ్శబ్దంగా కూలుతున్న మానవత్వం

మానవ నాగరికత మొదలైనప్పటి నుంచి మనం ఎన్నో యుగాలను చూశాం. రాతి యుగంలో మొదలై, ఇవాళ ఈ డిజిటల్ ప్రపంచం వరకు ఎంతో దూరం ప్రయాణించాం. ఈ క్రమంలో ఎన్నో గెలుపులు చూశాం, శిఖరాలు అధిరోహించాం, అసాధ్యమైన వాటిని సుసాధ్యం చేశాం. కానీ, ఈ వేగవంతమైన పురోగతిలో మనకు తెలియకుండానే ఒక అత్యంత ముఖ్యమైన విషయాన్ని కోల్పోతున్నాం. అదే... 'మనిషితనం'. విచిత్రం ఏమిటంటే, ఈ మానవత్వం ఏదో పెద్ద శబ్దంతో కూలిపోవడం లేదు, లేదా ఆర్భాటంగా అంతమైపోవడం లేదు. అది చాలా నిశ్శబ్దంగా, నెమ్మదిగా, మన కళ్ల ముందే మనకు తెలియకుండా కరిగిపోతోంది. ఈ నిశ్శబ్ద పతనం మన సమాజానికి, మన భవిష్యత్తుకు ఒక పెద్ద హెచ్చరిక.

ఒకప్పుడు మనిషి అంటే కేవలం రక్తం, మాంసం కాదు మనిషి అంటే ఒక ఆత్మ, ఒక స్పందన. కరుణ, సహానుభూతి, త్యాగం వంటి గుణాలు మనిషి జీవితాన్ని నింపేవి. పక్కవాడి కష్టాన్ని తన కష్టంగా భావించే గొప్ప గుణం ఉండేది. ఎదుటివారి కన్నీళ్లు తుడిచే చేతులు ఉండవి. కానీ, ఏమైపోయాడు? తన చుట్టూ తాను ఒక అదృశ్య గోడను నిర్మించుకుని బందీ అయిపోతున్నాడు. అతని గుండె కొట్టుకుంటోంది నిజమే, కానీ అది కేవలం ఒక యంత్రంలా మాత్రమే పనిచేస్తోంది. అందులో పాత తరం నాటి వెచ్చదనం లేదు, ఆప్యాయత అసలే లేదు. మనం ఎంతగా అభివృద్ధి చెందుతున్నామో, అంతగా మనలోని మనిషితనం కరిగిపోతుండటం నిజంగా ఒక చేదు నిజం. ఇవాల్టి మనిషి నిజానికి, మనిషితనం చచ్చిపోతోందని చెప్పడానికి ఎక్కడో వెతకక్కర్లేదు. రోజూ మన చుట్టూ జరుగుతున్న చిన్న చిన్న సంఘటనలే దానికి నిదర్శనం. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే రోడ్లు, ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి.

కళ్లెదురుగా ఒక ముసలాయన నిలబడి ఉన్నా కనీసం కూర్చోవడానికి చోటు ఇవ్వాలన్న ఆలోచన కూడా రావట్లేదు. ఒక గర్భిణీ స్త్రీ ఇబ్బంది పడుతున్నా ఎవరికీ పట్టడం లేదు. అందరూ తమ తమ లోకాల్లో మునిగిపోయి ఉన్నారు. ఇక

డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

ప్రమాదాల సంగతైతే మరీ దారుణం. రోడ్డు మీద ఎవరైనా ప్రాణాపాయంలో ఉంటే, వాళ్ళను కాపాడాలన్న ఆలోచన కంటే. వెంటనే మొబైల్ ఫోన్ తీసి వీడియో తీయాలన్న ఆత్రుతే ఎక్కువ కనిపిస్తోంది. ఆ వీడియోను సోషల్ మీడియాలో పెట్టి ఎన్ని లైక్స్ వచ్చాయో, ఎవరు ఏం కామెంట్ 'చేశారో అని చూసుకుంటున్నాం. ఒక మనిషి పడుతున్న వేదన మనకు కంటెంట్ అయిపోయింది. ఎదుటివారి బాధ మనకు ఒక వినోదంగా మారిపోయింది. అంతకంటే దారుణమైన పతనం మరొకటి ఉంటుందా? ఒకప్పుడు కుటుంబం అంటే మన జీవితానికి ఒక బలమైన పునాది. కానీ ఇప్పుడు ఆ పునాదులు మెల్లగా కదిలిపోతున్నాయి. తమ జీవితాంతం పిల్లల కోసం చెమటోడ్చి, అన్నీ త్యాగం చేసిన తల్లిదండ్రులను. ఇవాళ వృద్ధాశ్రమాలకు పంపిస్తున్నారు. వాళ్లను కన్న బిడ్డలే ఇవాళ వాళ్లను ఒక భారం లా చూస్తున్నారు. వాళ్లను కనిపెట్టుకుని ఉండటాన్ని ఒక బాధ్యతగా కాకుండా, ఒక పెద్ద సమస్యగా భావిస్తున్నారు. అప్పట్లో కుటుంబం అంటే ఒక పవిత్రమైన బంధం. అందులో ఎంతో ప్రేమ, మరెంతో గౌరవం ఉండేవి. తాతముత్తాతల నుంచి మనవళ్ల వరకు అందరూ కలిసి ఒకే గొడుగు కింద ఉండేవారు. ఒకరి సంతోషం అందరి పండుగ, ఒకరి కష్టం అందరి బాధ. కానీ ఇప్పుడు? కుటుంబం అంటే కేవలం ఒకే చోట ఉండటం (Accommodation)లా మారిపోయింది. అందరూ ఒకే ఇంట్లో ఉంటున్నారు కానీ, ఎవరి లోకం వాళ్లదే. ఒకప్పుడు భోజనాల దగ్గర కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ రోజంతా జరిగిన విషయాలను పంచుకునేవాళ్లం. ఇప్పుడు ఆ దృశ్యాలు మాయమైపోయాయి. డైనింగ్ టేబుల్ మీద కూర్చున్నా.. అందరి కళ్లు మొబైల్ స్క్రీన్ల మీదే! మెకానికల్లా తింటున్నారు తప్ప, పక్కన ఉన్న మనిషితో మాట్లాడే తీరిక లేదు, ఆత్మీయంగా పలకరించే ఓపిక లేదు. మనమందరం ఒకే చోట ఉన్నాం. కానీ ఎవరికి వారు ఒంటరి అయిపోతున్నాం. నిజానికి టెక్నాలజీ అనేది ఒక వరం. కానీ అది ఇప్పుడు మనలోని మనిషితనాన్ని నమిలేస్తున్న రాక్షసంలా మారుతోంది. వేల మైళ్ల దూరంలో ఉన్న వాళ్లతో సెకన్లలో మాట్లాడుతున్నాం కానీ, మన పక్కనే కూర్చున్న మనిషిని పలకరించడం మర్చిపోతున్నాం. సోషల్ మీడియాలో వేల మంది ఫాలోవర్లు, వందల మంది ఫ్రెండ్స్ ఉండొచ్చు. కానీ కష్టం వస్తే కళ్లెదుట నిలబడే తోడు ఒక్కడైనా ఉన్నాడా? అంటే సమాధానం లేదు. అందరం ఈ ఫోన్ల లోకంలోనే బతికేస్తున్నాం.

ఈ ఆన్లైన్ ప్రపంచంలో అందరూ హ్యాపీగా ఉన్నట్టే కనిపిస్తారు, అందరూ సక్సెస్ అయిపోయినట్టే ఫోజులిస్తారు. కానీ స్క్రీన్ వెనుక అసలు నిజం వేరే ఉంటుంది. ఈ నకిలీ జీవితాలు మనల్ని మానసికంగా కుంగదీస్తున్నాయి. లోపల ఒంటరితనంతో, డిప్రెషన్తో నలిగిపోతున్నా. బయటికి మాత్రం ఒక నవ్వుతున్న ఎమోజీ మాస్క్ వేసుకుని తిరుగుతున్నాం. ఇక మన పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన చదువుల సంగతి సరేసరి. స్కూళ్లు ఇప్పుడు కేవలం మార్కులు ముద్రించే మెషిన్లుగా మారిపోయాయి. పిల్లలకు నైతిక విలువలు, మనిషిని ప్రేమించే గుణం నేర్పడం ఎప్పుడో మానేశారు. పోటీలో పక్కవాడిని ఎలా తొక్కి ముందుకెళ్లాలో నేర్పిస్తున్నారే తప్ప. అందరూ కలిసి ఎలా ఎదగాలో, ఎదుటివారికి ఎలా సహాయం చేయాలో చెప్పే నాథుడే లేడు. ఫలితంగా, మన పిల్లలు మనుషులుగా కాకుండా యంత్రాల్లా తయారవుతున్నారు. వాళ్లకు పుస్తకాల్లోని సమాచారం మొత్తం తెలుసు కానీ, జీవితం అంటే ఏంటో తెలియదు. ఎదుటివారి బాధను అర్థం చేసుకునే హృదయం లేదు. పోటీ పడటం మంచిదే, కానీ ఆ పోటీ మనిషిని మృగంగా మార్చకూడదు కదా! పర్యావరణాన్ని పాడుచేస్తున్నామంటే అది కేవలం చెట్లను నరకడం కాదు, మనలోని మనిషితనాన్ని చంపుకోవడమే. మనిషి తన స్వార్థం కోసం ప్రకృతిని ఎంత దారుణంగా దోచుకుంటున్నాడో చూడండి. అడవులను నరికేస్తున్నాం, మూగజీవాలను అంతం చేస్తున్నాం, పారే నదులను మురికి కూపాలుగా మార్చేస్తున్నాం. రేపు మన పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి ఏంటి? విషపూరితమైన గాలి, తాగడానికి పనికిరాని నీళ్లేనా? ప్రకృతి పట్ల మనకు ఉండాల్సిన ప్రేమ, గౌరవం పూర్తిగా మాయమైపోయాయి. ప్రకృతి లేకపోతే అసలు మనమే ఉండమని మర్చిపోయి బతుకుతున్నాం. మరోవైపు, ఈ ధన దాహం మనిషిని అగాధంలోకి నెట్టేస్తోంది. ఇవాళ డబ్బు ఉంటే చాలు, ఏమైనా చేయొచ్చు అన్న స్థాయికి వచ్చేసాం. విలువలు, నైతికత, మర్యాద. ఇవన్నీ నోట్ల కట్టల ముందు అమ్ముడుపోతున్నాయి. మోసం చేయడం, అబద్ధాలు చెప్పడం ఒక టాలెంట్ మారిపోయింది. డబ్బున్నవాడు ఇంకా కోట్లు సంపాదిస్తున్నాడు, పేదవాడు మాత్రం పూట గడవక అల్లాడిపోతున్నాడు. సమాజంలో ఇంత అన్యాయం జరుగుతున్నా ఎవరికీ పట్టడం లేదు. ఎవరి సంపాదనలో వారు, ఎవరి గోలలో వారు మునిగిపోయారు. వస్తువులను పోగేసుకోవడమే జీవిత పరమార్థం అనుకుంటున్నాం. కానీ, ఎంత సంపాదిస్తే ఏం లాభం? మనసులో తృప్తి లేదు, ప్రాణాల్లో శాంతి లేదు. మనుషుల ఆలోచనలను ప్రభావితం చేయాల్సిన మీడియా, ఇవాళ అదే మనుషుల మధ్య దూరాన్ని పెంచుతోంది. న్యూస్ ఛానెళ్లలో ఎప్పుడూ ఏదో ఒక సంచలనం! ఎక్కడో జరిగిన గొడవలు, కుంభకోణాలు, క్రైమ్ వార్తలే తప్ప.. ఎక్కడైనా ఎవరైనా చేస్తున్న మంచి పనుల గురించి ఒక్క నిమిషం కూడా చూపించరు. ఎందుకంటే, మంచి వార్తలు చెబితే వాళ్లకు టీఆర్పీలు రావు కదా! పగలూ రాత్రి ఇలాంటి నెగెటివ్ వార్తలే చూడటం వల్ల మన మనసులపై కూడా ఆ ప్రభావం పడుతోంది. ఫలితంగా. పక్కవాడిని కూడా నమ్మలేని పరిస్థితి. ఎవరిని చూసినా ఏదో ఒక అనుమానం, ఏదో ఒక భయం. ఇక కులం, మతం, ప్రాంతం పేరుతో జరుగుతున్న గొడవల గురించి ఎంత చెప్పినా తక్కువే. మనిషిని మనిషిగా చూడటం ఎప్పుడో మానేశాం. కేవలం అతను వేరే మతం వాడనో, వేరే భాష మాట్లాడుతున్నాడనో ద్వేషించడం మొదలుపెట్టాం. అందరం ముందు మనుషులమన్న చిన్న లాజిక్ మర్చిపోతున్నాం. ఈ మత రాజకీయాలు, ఈ అసహనం మనల్ని ఒకరికొకరు శత్రువులుగా మారుస్తున్నాయి. అహింస, ఓర్పు, సహనం. ఇవన్నీ ఇప్పుడు పాత కాలపు మాటల్లా వినపడుతున్నాయి. ఎదుటివారి అభిప్రాయాన్ని గౌరవించే సంస్కారం కూడా మాయమైపోతోంది. మనం ఎంత నాగరికత గురించి మాట్లాడుకున్నా, స్త్రీల పట్ల మనం ప్రవర్తించే తీరు చూస్తే మన మనిషితనం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఇక మన పిల్లల విషయానికొస్తే, అసలు వాళ్లకి బాల్యం అనేదే లేకుండా చేస్తున్నాం. ఒకప్పుడు పిల్లలు మట్టిలో ఆడుకునేవారు, ప్రకృతితో పెరిగేవారు. కానీ ఇప్పుడు, పిల్లలు బయట ప్రపంచాన్ని మర్చిపోయి నాలుగు గోడల మధ్య మొబైల్ స్క్రీన్లకే అతుక్కుపోతున్నారు. స్నేహితులతో కలిసి ఆడుకునే సందడి లేదు, ఆ చిలిపి పనులు లేవు. దానికి తోడు, చిన్న వయసులోనే వాళ్ల మీద కొండంత చదువుల ఒత్తిడి! ఆటలకు చోటు లేదు, కంటినిండా నిద్ర లేదు. చిన్న పిల్లల్ని కూడా ఒక రేసు గుర్రాల్లా పోటీ ప్రపంచంలోకి తోసేస్తున్నాం. ఫలితంగా, ఆ చిట్టి ప్రాణాలు మానసిక ఒత్తిడికి, డిప్రెషన్కు గురవుతున్నాయి. మనం వాళ్లకు మంచి భవిష్యత్తు ఇస్తున్నామనుకుంటున్నాం కానీ, నిజానికి వాళ్ల అందమైన బాల్యాన్ని లాగేసుకుంటున్నాం. ఒకప్పుడు ఇంట్లో పెద్దవారంటే ఆ ఇంటికి ఒక ధైర్యం, ఒక రక్షణ కవచం. వాళ్ళ అనుభవం మనకు దారి చూపే దీపం. కానీ ఇప్పుడు పరిస్థితి దారుణంగా మారిపోయింది. ముసలివాళ్లని పాత సామాన్లలాగా పనికిరాని వారిగా చూస్తున్నాం. వాళ్ళు ఏదైనా సలహా ఇస్తే వినే ఓపిక లేదు, వాళ్ళ మాటలకు అసలు విలువే లేదు. అమ్మానాన్నలను కళ్ళ ముందు ఉంచుకోవడానికి ఇష్టపడక వృద్ధాశ్రమాలకు పంపిస్తున్నాం. కానీ ఒక్కటి గుర్తుంచుకోవాలి.రేపు మనకు కూడా ఆ వయసు వస్తుంది, ఆ పరిస్థితి ఎదురవుతుంది. మరోవైపు, మనిషి మనసు లోలోపల ఎంతగా నలిగిపోతున్నాడో ఎవరూ పట్టించుకోవడం లేదు. డిప్రెషన్, మానసిక ఒత్తిడి, ఆత్మహత్యలు, ఇవి ఇవాళ విపరీతంగా పెరిగిపోయాయి. ఏదైనా మానసిక సమస్య గురించి మాట్లాడాలంటేనే అదేదో పెద్ద తప్పు అన్నట్టుగా సమాజం చూస్తోంది. మనసు బాలేదని చెబితే వాళ్ళను పిరికివాళ్ళుగా ముద్ర వేస్తున్నాం. సాయం చేయడానికి చేతులు చాచకపోగా, కనీసం వాళ్ళ బాధను వినే తీరిక కూడా మనకు లేదు. అందుకే ఎంతోమంది ఆ బాధను లోపలే దాచుకుని, నిశ్శబ్దంగా ప్రాణాలు వదులుతున్నారు. అసలు కమ్యూనిటీ అనే మాటే మర్చిపోతున్నాం. ఒకప్పుడు పక్కింటి వాళ్లంటే ప్రాణం ఇచ్చే వాళ్ళు,ఒక కుటుంబంలా కలిసి ఉండేవారు. ఒకరింట్లో శుభకార్యం జరిగితే అది ఊరందరి పండుగ, ఒకరికి కష్టం వస్తే అది వీధి అందరి బాధ. కానీ ఇప్పుడు? పక్క ఇంట్లో ఎవరు ఉంటున్నారో, వాళ్ళు బతికున్నారో లేదో కూడా తెలియని లోకంలో బతుకుతున్నాం. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా మన అపార్ట్మెంట్ గోడల మధ్య బందీ అయిపోతున్నాం. ఈ ఒంటరితనం మనల్ని మనుషుల నుంచి వేరు చేసి, మనలోని మనిషితనాన్ని చంపేస్తోంది. నిజానికి ఇవాల్టి ఉద్యోగ సంస్కృతి మనిషిని ఒక యంత్రంలా మార్చేస్తోంది. ఆఫీసు పని, టార్గెట్లు, డెడ్ లైన్లు, ఈ ఒత్తిడిలో పడి అసలు జీవితాన్ని ఆస్వాదించడమే మర్చిపోతున్నాం. పొద్దున్నే ఆఫీసుకి వెళ్లి, అర్ధరాత్రి ఎప్పుడో అలసిపోయి ఇంటికి వస్తున్నాం. అటు కుటుంబంతో గడపడానికి సమయం లేదు, ఇటు మన గురించి మనం ఆలోచించుకోవడానికీ తీరిక లేదు. ఈ పరుగు పందెం మనల్ని అటు శారీరకంగా, ఇటు మానసికంగా కుంగదీస్తోంది. అయితే, ఇంత చీకటిలోనూ అక్కడక్కడా కొన్ని ఆశాకిరణాలు కనిపిస్తూనే ఉన్నాయి. లోకమంతా స్వార్థంతో నిండిపోయినా, ఇంకా కొంతమంది మనిషితనాన్ని బతికించుకుంటున్నారు. నిస్వార్థంగా పేదలకు సాయం చేసేవారు, అనాథలను అక్కున చేర్చుకునేవారు, ప్రకృతిని కాపాడేవారు మన మధ్యే ఉన్నారు. ఈ మంచి మనుషులే మన సమాజానికి అసలైన ఆశ. మానవత్వం ఇంకా పూర్తిగా చచ్చిపోలేదని వీళ్లే నిరూపిస్తున్నారు. ఎక్కడో ఒకచోట, ఎవరో ఒకరు ఎదుటివారి కోసం త్యాగం చేస్తూనే ఉన్నారు. అలాంటి వాళ్లే మన భవిష్యత్తుకు మార్గదర్శకులు. మరి ఈ మానవత్వాన్ని కాపాడుకోవాలంటే ఏం చేయాలి? ఆ మార్పు మన నుండే మొదలవ్వాలి. మనసులో కరుణను, పక్కవాడి బాధను అర్థం చేసుకునే సహానుభూతిని పెంచుకోవాలి. పెద్దగా ఆర్భాటాలు చేయనక్కర్లేదు, బస్సులో ఒక వృద్ధుడికి చోటు ఇవ్వడం, రోడ్డు దాటలేక ఇబ్బంది పడేవారికి చేయూతనివ్వడం, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం వంటి చిన్న చిన్న పనులతో మొదలు పెట్టవచ్చు. అన్నిటి కంటే ముఖ్యంగా, మన పిల్లలకు గెలవడం కంటే మంచిగా బతకడం నేర్పాలి. పోటీలో నెగ్గడం ముఖ్యం కాదని కాదు, కానీ ఆ గెలుపు మనిషితనాన్ని వదిలేసి సాధించేది కాకూడదు. సమాజంలో మార్పు రావాలంటే ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూడటం మానేయాలి. అన్ని పనులూ ప్రభుత్వాలే చేయాలి అనుకోవడం కంటే, మన స్థాయిలో మనం ఏం చేయగలమో ఆలోచించాలి. పక్కింటి వారితో ఒక చిన్న పలకరింపు, వీధిలో అందరం కలిసి చేసే ఒక మంచి పని, ఇలాంటి చిన్న చిన్న అడుగులే పెద్ద మార్పుకు పునాది అవుతాయి. అలాగే మీడియా కూడా తన బాధ్యతను గుర్తించాలి. కేవలం రేటింగ్ల కోసం (TRP) గొడవలను, గోలలను చూపించడం మానేసి, సమాజంలో ఎక్కడైనా ఒక చిన్న మంచి జరిగినా దానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజల మధ్య విభేదాలను పెంచడం కంటే, అందరూ కలిసి ఉండేలా ప్రోత్సహించాలి. ఇక చదువుల విషయానికొస్తే,కేవలం మార్కులు, ర్యాంకుల వెంట పడే విద్యార్థులను కాకుండా, సామాజిక బాధ్యత తెలిసిన మనుషులను తయారు చేయాలి. పిల్లలకు ఒకరితో ఒకరు పోటీ పడటం కంటే, ఒకరికి ఒకరు తోడుగా ఉంటూ ఎలా ఎదగాలో నేర్పించాలి. పాఠాల్లో ఉండే సమాచారం కంటే, గుండెల్లో ఉండే కరుణకు ఎక్కువ మార్కులు ఇవ్వాలి. టెక్నాలజీ విషయంలో మనం బానిసలుగా మారకూడదు. ఫోన్ ఉండాలి కానీ మన జీవితాన్ని అది శాసించకూడదు. ఆన్లైన్ ప్రపంచం ఎంత బాగున్నా, అది ఎప్పటికీ నిజమైన బంధాలకు, ఆత్మీయ పలకరింపులకు ప్రత్యామ్నాయం కాలేదు. చివరగా, ప్రకృతిని కాపాడుకోవడం మన ప్రాథమిక ధర్మం. మనం ప్రకృతి బిడ్డలం, అది లేకపోతే మనమే లేము. చెట్లు నాటడం, నీటిని వృథా చేయకుండా ఆదా చేయడం, మూగజీవాల పట్ల దయ చూపడం,ఇవేవీ మనం ప్రకృతికి చేసే సహాయం కాదు, మన ఉనికిని మనం కాపాడుకోవడానికి చేసే ప్రయత్నం మాత్రమే. నిశ్శబ్దంగా కరిగిపోతున్న ఈ మనిషితనాన్ని మనం మళ్ళీ బతికించుకోవాలి అంటే, ఇప్పుడే మనం మేల్కొనాలి. అంతా అయిపోయాక బాధపడటం కంటే, సమయం మించిపోక ముందే అడుగులు వేయాలి. మార్పు అనేది ఎక్కడో పైనుంచి రాదు,మనలో కలిగే చిన్న మార్పే రేపు ఒక పెద్ద విప్లవానికి దారితీస్తుంది. మనం ఇంకా ఆశ కోల్పోవాల్సిన అవసరం లేదు, ఎందుకంటే మార్పు ఖచ్చితంగా సాధ్యం. కాకపోతే, దాని కోసం మనమందరం కలిసి పోరాడాలి. మనిషితనం పూర్తిగా మాయమైపోయే లోపు మనం స్పందించాలి. ఇది కేవలం మన బాధ్యత మాత్రమే కాదు, మన రాబోయే తరాలకు మనం తీర్చుకోవాల్సిన ఒక గొప్ప రుణం. మన పిల్లలకు, మనవళ్లకు మనం ఎలాంటి లోకాన్ని ఇవ్వబోతున్నాం? రక్తం, మాంసం మాత్రమే ఉండి.. హృదయం లేని మనుషుల మధ్యన వాళ్ళను వదిలేద్దామా? ఈ ప్రశ్నకు సమాధానం ఇవాళ మనం చేసే పనుల్లోనే ఉంది. మళ్ళీ ప్రేమను, కరుణను చిగురింపజేసే శక్తి మనకు ఉంది. మనమందరం ఒకరికొకరు తోడుగా నిలబడితే, ఈ సమాజం కచ్చితంగా మారుతుంది. మన భవిష్యత్తు మళ్ళీ వెలుగులతో నిండుతుంది.

అసోం సీఎం వీడియోపై దుమారం

- తనకు తెలియదన్న హిమంత బిశ్వశర్మ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఒవైసీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: అసోం బీజేపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఓ వీడియోపై తీవ్ర దుమారం చెలరేగింది. తాజాగా వైరల్ అయిన వీడియోపై అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ స్పందించారు. ఆ వీడియో గురించి తనకు తెలియదని అన్నారు. తాను బంగ్లాదేశ్ చొరబాటుదారులను వ్యతిరేకిస్తున్నానని, ఎప్పటికి అలాగే ఉంటానని స్పష్టం చేశారు. దిబ్రూగఢ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు హిమంత వ్యాఖ్యానించారు. ఒక తుపాకీతో అసోం సీఎం హిమంత బిశ్వశర్మ గురిపెట్టి కాల్పులు జరుపుతున్నట్లుగా ఉన్న వీడియోను అసోం బీజేపీ తన అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్‌లో పోస్ట్ చేసింది. ఆ వీడియోలో ఒకరు టోపీ ధరించి ఉండగా, మరొకరు గడ్డంతో ఉన్నారు. ఆ వీడియోకు పాయింట్‌బ్లాంక్ షాట్ అని శీర్షిక పెట్టారు. ఆ వీడియో వివాదస్పదం అవ్వడంతో అసోం బీజేపీ దాన్ని డిలీట్ చేసింది. అయితే ఈ ఘటనపై హైదరాబాద్ ఎంపీ, ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడియోలో పాయింట్ బ్లాంక్ షాట్, నో మెర్సీ వంటి పదాలు మతపరమైన భావాలను రెచ్చగొట్టడానికి, మత విద్వేషాన్ని ప్రోత్సహించడానికి, హింసను ప్రేరేపించడానికి ఉద్దేశించినవని ఒవైసీ ఫిర్యాదులో పేర్కొన్నారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మపై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై దిబ్రూగఢ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో హిమంత బిశ్వ శర్మ స్పందించారు. ''నేను జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. నేనేం చేయగలను? నాకు ఏ వీడియో గురించి ఏమీ తెలియదు. ఓవైసీ నాపై కేసు పెట్టి ఉంటే నన్ను అరెస్టు చేయండి. అందుకు నాకు ఎటువంటి అభ్యంతరం లేదు. కానీ నేను నా మాటలకు ఎప్పుడూ కట్టుబడి ఉంటాను. నేను బంగ్లాదేశ్ చొరబాటుదారులకు వ్యతిరేకం. ఎప్పటికే అలాగే ఉంటాను. '' అని హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు.

శరద్ పవార్‌కు అస్వస్థత.. ఆస్పత్రిలో చేరిక

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పుణె, ఫిబ్రవరి 9: ఎన్సీపీఎస్పీ అధినేత శరద్ పవార్ అస్వస్థతకు గురయ్యారు. గత కొన్ని రోజులుగా ఆయన గొంతునొప్పి, దగ్గుతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే కుటుంబ సభ్యులు ఆయన్ను పుణెలోని రూబీ ఆస్పత్రికి తరలించారు. శరద్ పవార్ కొన్ని రోజులుగా గొంతునొప్పితో బాధపడుతున్నారని ఆయన సన్నిహితుడు తెలిపారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ పర్వేజ్ నేతృతంలోని బృందం శరద్ పవార్‌కు చికిత్స అందిస్తోంది. మరిన్ని వివరాలను తర్వాత వెల్లడిస్తామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ''శరద్ పవార్‌కు ముందుగా దగ్గు కోసం పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆయన్ను ఆసుపత్రిలో చేర్చుకోవాలా లేదా డిశ్చార్జ్ చేయాలా అనే దానిపై నిర్ణయం తీసుకుంటారు.'' అని రూబీ హాల్ క్లినిక్ చీఫ్ కార్డియాలజిస్ట్, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పర్వేజ్ గ్రాంట్ వెల్లడించారు. సోమవారం ఉదయం నుంచి దగ్గు కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉందని పవార్ ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ఎలాంటి రిస్క్ తీసుకోకూడదనే ఉద్దేశంతో ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపాయి. శరద్ పవార్‌తో ఆయన కుమార్తె, బారామతి పార్లమెంట్ సభ్యురాలు సుప్రియా సూలే కూడా పుణెలోని రూబీ హాల్ ఆసుపత్రికి వెళ్లారు.

మళ్లీ భగ్గుమన్న మణిపూర్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో,మణిపూర్, ఫిబ్రవరి 9: మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే అక్కడ మళ్లీ హింస చెలరేగింది. ఉఖ్రుల్ జిల్లాలో సోమవారం టాంగ్‌ఖుల్ నాగా, కుకీ వర్గాలు పరస్పరం దాడులకు తెగబడ్డాయి. సాయుధులైన దుండగులు లిటాన్ గ్రామంలో 20కిపైగా ఇండ్లకు నిప్పు పెట్టారని అధికారులు తెలిపారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు భద్రతా బలగాలు గాల్లోకి కాల్పులు జరిపినట్టు పేర్కొన్నారు. లిటాన్, టాంగ్‌ఖుల్ గ్రామానికి చెందిన ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు ఇండ్లను వదిలి, పక్క జిల్లా కాంగ్‌పోక్పీకి పారిపోయారని తెలిసింది. లిటాన్ గ్రామంలో శనివారం రాత్రి నాగా వర్గానికి చెందిన ఓ వ్యక్తిపై సామూహిక దాడి ఘటన.. తాజా హింసకు దారితీసిందని అధికారులు చెబుతున్నారు.

రోహిత్, కోహ్లీకి బీసీసీఐ 'బి' గ్రేడ్

టీమ్ ఇండియా మాజీ సారథులు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ సెంట్రల్ కాంట్రాక్టుల్లో ఇన్నాళ్లుగా అనుభవిస్తున్న 'గ్రేడ్ ఏ+' కేటగిరీ నుంచి డిమోట్ అయ్యారు. ఇప్పటికే టెస్టులు, టీ20ల నుంచి వీడ్కోలు పలికిన ఈ ఇద్దరూ వన్డేలు మాత్రమే ఆడుతున్న నేపథ్యంలో బీసీసీఐ వారి గ్రేడ్‌ను 'ఏ+' నుంచి 'బీ'కి తగ్గించింది. ఈ మేరకు బీసీసీఐ మంగళవారం విడుదల చేసిన 2025 26 వార్షిక కాంట్రాక్టుల్లో మొత్తం 30 మంది క్రికెటర్లకు సెంట్రల్ కాంట్రాక్టును అందించింది. 'గ్రేడ్ ఏ+'ను పూర్తిగా తొలగించి మూడు గ్రేడ్‌లుగానే ఆటగాళ్లకు కాంట్రాక్టులను అందజేసింది. టెస్టు, వన్డే సారథి శుభ్‌మన్ గిల్‌తో పాటు బుమ్రా, జడేజా మాత్రమే 'ఏ' క్యాటగిరీలో ఉన్నారు. సుందర్, కుల్‌దీప్, జైస్వాల్, సూర్యకుమార్, శ్రేయాస్ 'బి' క్యాటగిరీలోకి రాగా సీనియర్ పేసర్ మహ్మద్ షమీ, ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్, ముకేశ్ కుమార్, పాటిదార్ కాంట్రాక్టులను కోల్పోయారు. అక్షర్, తిలక్, రింకూ, సంజూ, అర్షదీప్, సాయి సుదర్శన్ వంటి క్రికెటర్లు గ్రేడ్ 'సీ'లో ఉన్నారు. మహిళల విభాగంలో 21 మందికి కాంట్రాక్టులు అందజేయగా హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, జెమీమా, దీప్తి శర్మకు గ్రేడ్ 'ఏ' దక్కింది.

ప్రతిపక్షం
Prathipaksham.in
10
హైదరాబాద్
మంగళవారం
10.02.2026
సినిమా

భారత్‌తో ఆడాలంటే.. కండీషన్స్ అప్లయ్!!

ఐసీసీ ముందు డిమాండ్లు ఉంచిన పాకిస్తాన్

టీ20 ప్రపంచకప్‌లో భారత్, పాక్ మ్యాచ్ జరుగుతుందా? లేదా? అన్నదానిపై అనిశ్చితి కొనసా..గుతూనే ఉంది. మ్యాచ్ రద్దు అయితే ఆర్థికంగా భారీ నష్టం వాటిల్లబోయే ఆస్కారమున్న నేపథ్యంలో ఐసీసీ ఈ మ్యాచ్‌ను ఎలాగైన నిర్వహించాలని చూస్తున్నా.. పాకిస్తాన్ మాత్రం తాము ఆడతాం కానీ తమ డిమాండ్లను నెరవేరిస్తేనే మ్యాచ్‌పై పునరాలోచిస్తామని ఐసీసీ ప్రతినిధికి వివరించినట్టు సమాచారం. కరాచీలో జరిగిన చర్చల్లో పాక్ బోర్డు.. ఐసీసీ ఎదుట పలు డిమాండ్లను ఉంచినట్టు తెలుస్తున్నది. అందులో ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో క్రికెట్ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు ఇవ్వడం, ప్రపంచకప్ ఆడనప్పటికీ ఆ దేశానికి పార్టిసిపేషన్ ఫీజు మంజూరు చేయడం, ఐసీసీ ఫ్యూచర్ టూర్స్‌లో బంగ్లాకు ఆతిథ్య హక్కులు అందించడం, భారత్‌పాక్‌బంగ్లాదేశ్ తో ముక్కోణపు సిరీస్, భారత్‌పాక్ ద్వైపాక్షిక సిరీస్‌ల పునరుద్ధరణ వంటివి ప్రతిపాదించినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. వీటిలో చాలావరకూ ఐసీసీ పరిధిలోనివి కాకుండా భారత ప్రభుత్వం, బీసీసీఐ చేతిలో ఉన్నవే కావున ఆ విషయంలో ఐసీసీ నిస్సహాయంగానే ఉండే అవకాశాలున్నాయి. ఇదిలాఉండగా రాబోయే 48 గంటల్లో భారత్, పాక్ మ్యాచ్ భవితవ్యం తేలనుందని పీసీబీ చీఫ్ మోహ్సిన్ నక్వీ వ్యాఖ్యానించడం గమనార్హం. ఐసీసీ, పీసీబీతో చర్చల్లో పాల్గొన్న బంగ్లా క్రికెట్ బోర్డు చీఫ్ అమినుల్ ఇస్లాం సైతం.. పాక్, భారత్‌తో మ్యాచ్ ఆడాలని సూచించడం విశేషం.

స్కాట్లాండ్ అదిరే ఆట.. ఇటలీపై ఘన విజయం

టీ20 ప్రపంచకప్‌లో స్కాట్లాండ్ అదిరిపోయే బోణీ కొట్టింది. సోమవారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన గ్రూపుసీ పోరులో స్కాట్లాండ్ 73 పరుగుల తేడాతో ఇటలీపై ఘన విజయం సాధించింది. బంగ్లాదేశ్‌పై బహిష్కరణ వేటుతో ఆఖరి నిమిషంలో మెగాటోర్నీ బెర్తు దక్కించుకున్న స్కాట్లాండ్ ఎట్టకేలకు పాయింట్ల ఖాతా తెరిచింది. తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్ చేతిలో ఓడిన స్కాట్లాండ్..మలి పోరులో అరంగేట్రం టీమ్ ఇటలీ భరతం పట్టింది. తొలుత జార్జ్ మున్సె (54 బంతుల్లో 84, 13 ఫోర్లు, 2 సిక్సులు) అర్ధసెంచరీకి తోడు బ్రెండన్ మెక్‌ముల్లెన్ (41 నాటౌట్), ఆఖర్లో మిచెల్ లీస్క్ (5 బంతుల్లో 22 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సులు) రాణించడంతో స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 207/4 స్కోరు చేసింది. అంతర్జాతీయ క్రికెట్‌లో కొత్తగా అడుగుపెట్టిన ఇటలీ పసలేని బౌలింగ్‌ను స్కాట్లాండ్ బ్యాటర్లు అలవోకగా ఎదుర్కొన్నారు. లక్ష్యఛేదనకు దిగిన ఇటలీ.. లీస్క్ (4/17) ధాటికి 16.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. బెన్ మనెటీ (52) అర్ధసెంచరీ మినహా పెద్దగా ఎవరూ ఆకట్టుకోలేకపోయారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించి లీస్క్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ఆసియా ఛాంపియన్ షిప్‌లో మన షూటర్ల హవా

మనుకు రజతం... ఇషా సింగ్ కు కాంస్యం

ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతక వేట కొనసాగుతున్నది. మహిళల 25 మీటర్ల పిస్టోల్ ఈవెంట్‌లో యువ షూటర్లు మను బాకర్, ఇషా సింగ్ సత్తాచాటారు. సోమవారం ఇక్కడ అత్యంత ఉత్కంఠ నడుమ సాగిన ఈవెంట్‌లో విజేతను తేల్చేందుకు షూటాఫ్ అవసరమవగా.. మను, ఇషా తృటిలో స్వర్ణ పతకానికి దూరమయ్యారు. ఫైనల్‌లో మను, గుయెన్ థుయ్ (వియత్నాం), ఇషా స్కోర్లు సమమవ్వడంతో షూటాఫ్ అవసరమొచ్చింది. ఇషా.. షూటాఫ్ ఆరంభంలో ఆధిక్యంలోనే ఉన్నా 8, 9వ సిరీస్‌కు వచ్చేసరికి గురి తప్పి 30 పాయింట్లకే పరిమితమై కాంస్యంతో సరిపెట్టుకుంది. ఈ టోర్నీలో ఆమెకు ఇది మూడో పతకం. మరోవైపు మను, గుయెన్ స్కోర్లు 35తో సమమవగా షూటాఫ్‌లో వియత్నాం అమ్మాయి.. 32తో గెలిచి స్వర్ణాన్ని దక్కించుకోగా భారత షూటర్ రజతం గెలుచుకుంది. జూనియర్ విభాగంలో తెలంగాణ యువ షూటర్ 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టోల్ వ్యక్తిగత విభాగంలో కాంస్యం గెలిచాడు.

'ఆయా షేర్'

నేచురల్ స్టార్ నాని ప్రతిష్ఠాత్మక చిత్రం 'ది ప్యారడైజ్' ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, SLV సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా, షూటింగ్ ఫ్లోర్ నుంచి తాజా అప్‌డేట్‌తో భారీ హైప్‌ను సృష్టిస్తోంది. వందలాది మంది డ్యాన్సర్స్ కూడిన భారీ సెట్‌లో నాని బ్లాస్టింగ్ ఇంట్రో సాంగ్ ఆయా షేర్ షూటింగ్ ని టీం ప్రారంభించింది. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ గ్రిట్, హై-అడ్రినలిన్ వైబ్‌లతో నిండిన ఎలక్ట్రిఫైయింగ్ మాస్ బ్యాంగర్ అందించారు. రా ఎనర్జీతో నాని డ్యాన్స్ స్టైల్‌కు ఇది పర్ఫెక్ట్ సాంగ్. విజయ్ 'జన నాయగన్' కు పని చేసిన కొరియోగ్రాఫర్ సుధన్ మాస్టర్, షార్ప్ మూవ్స్, పవర్‌ఫుల్ ఫార్మేషన్స్‌తో ఈ పాటను గూస్‌బంప్స్ కలిగించే విజువల్ స్పెక్టకిల్‌గా మలుస్తున్నారు. నాని ట్రేడ్‌మార్క్ మాడ్‌నెస్, ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్ తో ఈ పాట అద్భుతంగా వుంటుంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల నిర్మాణంలోని ప్రతి అంశంలోనూ ప్రతిష్ఠాత్మకంగా ది ప్యారడైజ్‌ను రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మోహన్ బాబు, బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ బాబు ప్రముఖ పాత్రలు పోషిస్తున్నారు. సిహెచ్ సాయి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తారు, నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తారు అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్. ఈ చిత్రం ఎనిమిది భాషలలో పాన్-వరల్డ్ విడుదలకు సిద్ధంగా ఉంది.

'గాయపడ్డ సింహం'కు ఆడియన్స్ ఫిదా అవుతారు

టైజర్ లాంచ్ ఈవెంట్ లో హీరో తరుణ్ భాస్కర్

డిఫరెంట్ ఎంటర్టైనర్స్ తో అలరిస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి మరో యూనిక్ మూవీతో రాబోతున్నారు. 'గాయపడ్డ సింహం' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సప్తస్వ మీడియా వర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్లపై కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ నిర్మించారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ నటిస్తున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న పవన్ సాదినేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఆసక్తికరమైన టైటిల్ పోస్టర్‌తో బజ్‌ను సృష్టించిన ఈ టీం, ఇప్పుడు ఫన్ ఫిల్డ్ టైజర్‌ను విడుదల చేశారు. చిన్నప్పటి నుండి అమెరికాకు వెళ్లాలని కలలు కనే ఒక యువకుడి కథ ఇది. అతని కోరిక చివరికి నెరవేరుతుంది, ఎన్నో ఆశలతో అమెరికాకు వెళ్తాడు. కానీ అతని ఆనందం ఎక్కువ కాలం నిలవదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అకస్మాత్తుగా అమెరికా చరిత్రలోనే అతిపెద్ద డిపోర్టేషన్ ఆపరేషన్‌ను ప్రకటిస్తాడు. ఈ కష్టాన్ని హీరో ఎలా ఎదుర్కొంటాడు, మనుగడ కోసం ఎలా పోరాడతాడు అనేది కథ ప్రధానాంశం. కశ్యప్ శ్రీనివాస్ అందరికీ కనెక్ట్ అయ్యే అంశాన్ని అత్యంత వినోదాత్మకంగా తెరకెక్కించారు. ఈ ట్రైజర్ ఒక భారతీయ కోణం నుండి అమెరికన్ డ్రీమ్‌పై ఒక సెటైరికల్ నరేటివ్ ని ప్రజెంట్ చేస్తుంది. కేజీఎఫ్ తరహా ప్రెజెంటేషన్, పెళ్లిచూపులు తరహా కామెడీ కలగలిసి మరింతగా అలరించాయి. తరుణ్ భాస్కర్ తన కామెడీ టైమింగ్ అలరించారు. ఈ పాత్రకు ఆయన పర్ఫెక్ట్ యాప్ట్. ఫరియా అబ్దుల్లా, శుభలేఖ సుధాకర్ కథను కేజీఎఫ్ తరహాలో వివరించ నవ్వులని పంచింది. మానస చౌదరి తరుణ్ లవర్ పాత్రలో నటిస్తుంది. విష్ణు ఓయ్ అతని స్నేహితుడిగా కనిపించారు. విద్యా సాగర్ చింత సినిమాటోగ్రఫీ, స్వీకర్ అగస్తి సంగీతం సినిమా మూడ్‌ను అద్భుతంగా ఎలివేట్ చేశాయి. విప్లవ్ నైషధం ఎడిటర్, చంద్రిక గొర్రెపాటి ప్రొడక్షన్ డిజైనర్, కథను సూర్య ప్రకాష్ జోస్యుల రాశారు. 2026 వేసవిలో సినిమా విడుదల అవుతుందని మేకర్స్ అనౌన్స్ చేశారు. సరదాగా సాగే ఈ ట్రైజర్ తో తో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి.

ఉర్రూతలూగించేలా 'ఫంకీ' మాస్ సాంగ్

విశ్వక్ సేన్, దర్శకుడు అనుదీప్ కలయికలో వస్తున్న 'ఫంకీ' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, 'ధీరే ధీరే', 'రట్టాటటావ్' పాటలకు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా ఈ చిత్రం నుంచి మూడవ గీతం 'యమ యమ్మ' విడుదలైంది. సోమవారం సాయంత్రం తిరుపతిలో ఈ గీతావిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. శ్రోతలను ఉర్రూతలూగించేలా భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ మాస్ గీతం, విన్న వెంటనే ఆకట్టుకునేలా ఉంది. అందరూ కాలు కదిపేలా భీమ్స్ అందించిన ఉత్సాహభరిత సంగీతం, ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దేవ్ పవార్ అందించిన సాహిత్యం, మాస్ పాటకు తగ్గట్టుగా మళ్ళీ మళ్ళీ పాడుకునేలా ఉంది. గాయని రోహిణి సోరట్ తో కలిసి సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ పాటను ఆలపించడం విశేషం. తమ ఉత్సాహభరితమైన గాత్రంతో పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు. నాయకానాయికలు విశ్వక్ సేన్, కయాదు లోహర్ పై చిత్రీకరించిన ఈ పాట.. అదిరిపోయే మాస్ బీట్ లు, ఆట సందీప్ మాస్టర్ అద్భుతమైన నృత్యరీతులతో మాస్ పాటల అభిమానులకు విందు భోజనంలా మారింది. భీమ్స్ సిసిరోలియో సంగీతానికి శ్రోతలలో ఉండే ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా తొలి గీతం 'ధీరే ధీరే', రెండో గీతం 'రట్టాటటావ్' చార్ట్‌బస్టర్స్ గా నిలిచాయి. ఇప్పుడు 'యమ యమ్మ' కూడా అదే జోరును కొనసాగిస్తూ సంగీత ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటీవల విడుదలైన 'ఫంకీ' ట్రైలర్ విశేష స్పందనను సొంతం చేసుకుంది. కె.వి. అనుదీప్ శైలి హాస్యంతో విశ్వక్ సేన్ నవ్వులు పూయించిన తీరు కట్టిపడేసింది. ట్రైలర్ తో ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి.

పవన్ మూవీలో..

టాలీవుడ్ స్టార్ హీరో పవన్ కల్యాణ్ నెక్స్ట్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో అభిమానులకు వినోదాన్ని పంచేందుకు రెడీ అవుతున్నాడని తెలిసిందే. హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ 2026 సమ్మర్ కానుకగా విడుదల కానుంది. ఉస్తాద్ భగత్ సింగ్ రిలీజ్ తర్వాత పవన్ కల్యాణ్ తన కొత్త ప్రాజెక్ట్‌పై ఫోకస్ పెట్టబోతున్నాడు. ఇంతకీ ఆ సినిమా ఏంటనే కదా మీ డౌటు. సురేందర్ రెడ్డి డైరెక్ట్ చేయనున్న సినిమా. చాలా కాలం కిందే తెరపైకి వచ్చిన ఈ క్రేజీ కాంబోలో సినిమా ఫైనల్ అయింది. తాజాగా క్రేజీ వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. ఈ మూవీలో ఫౌజీ ఫేం ఇమాన్వీ హీరోయిన్‌గా ఫిక్సయిందంటూ కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతానికి దీనికి సంబంధించిన అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఏం లేకున్నా.. అప్పుడే సిల్వర్ స్క్రీన్‌పై ఇమాన్వీ, పవన్ కల్యాణ్ పెయిర్‌ను ఊహించేసుకుంటూ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు మూవీ లవర్స్, అభిమానులు. మరి దీనిపై రాబోయే రోజుల్లో ఏదైనా ప్రకటన చేస్తారేమో చూడాలి. అంతేకాదు ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200